www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 7-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 263 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 12.47 తదుపరి ద్వాదశి; నక్షత్రం: విశాఖ రా. 10.09 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 2.08-3.43; దుర్ముహూర్తం: సా. 4.24-5.08; అమృతఘడియలు: మ. 1.04-2.43; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.52 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సిరీస్‌పై గురి

ఆసీస్‌తో భారత మహిళల రెండో టీ20 నేడు

రా. 7.30 గం. నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో..


ప్రాక్టీస్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రేణుకా సింగ్

నవీ ముంబై: తొలి టీ20లో అద్భుత విజయం దక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సేన..ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌కు ఇనుమడించిన ఉత్సాహంతో సిద్ధమైంది. ఇదే ఊపులో రెండో టీ20ని కూడా చేజిక్కించుకొని మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే పట్టుదలగా ఉంది. అన్ని విభాగాల్లో పేలవమైన ప్రదర్శనతో మూడు వన్డేల సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌నకు గురైన టీమిండియా.. మొదటి టీ20లో సూపర్ షోతో ఆకట్టుకుంది. ఫలితంగా తొమ్మిది వికెట్లతో భారీ విజయం అందుకుంది. వన్డే సిరీస్‌లో చెత్త ఫీల్డింగ్‌తో తీవ్ర విమర్శలపాలైన అమ్మాయిలు..తొలి టీ20లో కళ్లు చెదిరే ఫీల్డింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఏకంగా నాలుగు క్యాచ్‌లు తీసుకోవడం విశేషం. బౌలింగ్ విభాగంలో యువ పేసర్ టిటాస్ సాధు ఆస్ట్రేలియా బ్యాటర్లకు పూర్తిగా కళ్లెం వేసింది. స్పిన్నర్లు దీప్తిశర్మ, శ్రేయాంక పాటిల్ చెరో రెండేసి వికెట్లతో తమ పాత్రను సమర్థంగా నిర్వర్తించారు. బ్యాటింగ్‌లో..షఫాలీ వర్మ, స్మృతి మంధాన హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. వీరిద్దరూ 137 రన్స్ జోడించిన దరిమిలా..పొట్టి ఫార్మాట్‌లో ఆసీస్‌పై టీమిండియా మొదటి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం నమోదు చేసింది. ఇలా అన్ని విభాగాల్లో కనబరిచిన అమోఘ ప్రదర్శనను కొనసాగిస్తేనే..ఆస్ట్రేలియా స్వదేశంలో మొదటిసారి పొట్టి సిరీస్ విజయం లభిస్తుంది. అయితే తొలి మ్యాచ్‌లో చిత్తయినా..ఆస్ట్రేలియాను తక్కువగా అంచనా వేయకూడదు. పోరాటానికి మారుపేరైన ఆ జట్టు ఓటమి నుంచి బయటపడి చెలరేగడం కష్టమేమీ కాదు. పైగా..లెజెండరీ ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీకి ఈ మ్యాచ్ అంతర్జాతీయంగా 300వది. ఈనేపథ్యంలో రెండో టీ20 నెగ్గడం ద్వారా ఆమెకు ఘనమైన కానుక ఇవ్వాలని ఆసీస్ భావిస్తోంది.

ఆంధ్ర 119/3

బెంగాల్‌తో రంజీట్రోఫీ

విశాఖపట్నం: ఓపెనర్ ప్రశాంత్ కుమార్ (41), జ్ఞానేశ్వర్ (33) రాణించడంతో బెంగాల్‌తో రంజీట్రోఫీ ఎలీట్ గ్రూప్-బి మ్యాచ్‌లో రెండోరోజు ఆఖరికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లకు 119 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్, ప్రశాంత్ మొదటి వికెట్‌కు 64 పరుగులతో శుభారంభం ఇచ్చారు. రషీద్ (32) మూడో వికెట్‌గా అవుట్‌కాగా కెప్టెన్ విహారి (6) క్రీజులో ఉన్నాడు. ప్రత్యర్థి మొదటి ఇన్నింగ్స్ స్కోరుకు ఆంధ్ర 290 పరుగులు వెనుకంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ 289/4 స్కోరుతో శనివారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 409 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ లలిత్ మోహన్ నాలుగు, శశికాంత్, నితీశ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



నీ దూకుడు సాటెవ్వరు!

ఆసీస్ క్లీన్‌స్వీప్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఇక అంతర్జాతీయ క్రికెట్‌లో టీ20 ఫార్మాట్‌లోనే కనిపించనున్నాడు. పాకిస్థాన్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌తో ఈ ఫార్మాట్‌తో అతడి అనుబంధం కూడా ముగిసింది. ఇక, కొత్త ఏడాది మొదటి రోజునే వన్డేల నుంచి కూడా వైదొలుగుతున్నట్టు వార్నర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆడేది టెస్టా.. వన్డేనా.. టీ20నా అనేది చూడకుండా ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే ఈ ఆసీస్ స్టార్ అందరి అభిమానాన్ని చూరగొన్నాడనడంలో సందేహం లేదు. అలాగే అతను కెరీర్‌లో అన్ని రకాల అనుభవాలనూ చవిచూశాడు. 15 ఏళ్ల లేత ప్రాయంలోనే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన డేవిడ్ ఆ తర్వాత ఆసీస్ అండర్-19 క్రికెట్ జట్టు తరఫున పరుగుల మోతతో అంతర్జాతీయ కెరీర్‌కు రంగం సిద్ధం చేసుకున్నాడు. కోహ్లీ ఆధ్వర్యంలో భారత్ అండర్-19 వరల్డ్‌కప్ సాధించినప్పుడు ఆసీస్ కెప్టెన్‌గా ఉన్నది వార్నరే. ఆసీస్ తరఫున 2009లో టీ20ల్లో అరంగేట్రం చేసిన డేవిడ్ తొలి మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికాపై 43 బంతుల్లో 89 రన్స్‌తో విరుచుకుపడ్డాడు. 2011లో న్యూజిలాండ్‌తో టెస్టు అరంగేట్రం చేసిన అతను ఆ తర్వాత ఇంతింతై అన్నట్టుగా పాంటింగ్, బోర్డర్, స్టీవ్ వా, స్మిత్ తర్వాత అత్యధిక టెస్టు పరుగులు సాధించిన ఆసీస్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. మూడు ఫార్మాట్లలోనూ ఓపెనర్ పాత్రలో నమ్మదగ్గ ఆటగాడిగా ఎదగడం అతడిలోని నిలకడైన ఆటతీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. 2019లో పాకిస్థాన్‌తో టెస్టులో 335 పరుగులతో బ్రాడ్‌మన్ (334) రికార్డును వెనక్కినెట్టాడు. వన్డే వరల్డ్‌కప్‌లోనూ వార్నర్‌ది అద్భుత ప్రదర్శనే. అంతేకాకుండా వరుసగా రెండు మెగా టోర్నీల్లోనూ 500+ స్కోర్లు సాధించిన ఏకైక ఆసీస్ ప్లేయర్‌గా నిలిచి సగర్వంగా ఈ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

1

అన్ని ఫార్మాట్లలో కలిపి ఓపెనర్‌గా అత్యధిక సెంచరీలు (49) చేసిన ఆటగాడు వార్నరే. సచిన్ (45), గేల్ (42), జయసూర్య (41), రోహిత్ (40), తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

మాయని మచ్చలా..

వార్నర్ కెరీర్‌లో బాల్ ట్యాంపరింగ్ వివాదం మాయని మచ్చగా నిలిచింది. ఆసీస్ జట్టు 2018లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లినప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. మొదట బాన్‌క్రాఫ్ట్ సాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతూ వీడియోలో కనిపించగా.. విచారణలో ఇందులో స్మిత్‌తో పాటు వార్నర్ హస్తం ఉన్నట్టుగా తేలింది. దీంతో ఏడాదిపాటు నిషేధంతో పాటు కెప్టెన్సీకి కూడా దూరమయ్యాడు. ఏదిఏమైనా చివరి టెస్టులో విజయం సాధించడంతో పాటు చివరి వన్డేలో వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన వార్నర్ క్రికెట్ కెరీర్.. సంపూర్ణంగా ముగిసిందనే చెప్పవచ్చు.

3-0తో టెస్టు సిరీస్ కైవసం
వార్నర్ అర్ధసెంచరీ
ఆఖరి మ్యాచ్‌లోనూ పాక్ చిత్తు



సిడ్నీ: పాకిస్థాన్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం నాలుగో రోజే ముగిసిన ఆఖరి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో నెగ్గింది. వీడ్కోలు టెస్టు ఆడిన ఓపెనర్ డేవిడ్ వార్నర్ (75 బంతుల్లో 7 ఫోర్లతో 57) అర్ధసెంచరీతో కీలక ఇన్నింగ్స్‌తో మెరువగా.. లబుషేన్ (73 బంతుల్లో 9 ఫోర్లతో 62 నాటౌట్) అజేయంగా నిలిచాడు. పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌ను 115 పరుగుల వద్ద ముగించింది. పేసర్ హాజెల్‌వుడ్‌కు 4, స్పిన్నర్ లియోన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఆసీస్ 130 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. ఓపెనర్ ఖవాజా డకౌటైనా మరో ఓపెనర్ వార్నర్, లబుషేన్ రెండో వికెట్‌కు 118 పరుగులు జత చేయడంతో 25.5 ఓవర్లలో 130 పరుగులు చేసి గెలిచింది. అంతకుముందు పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 313, ఆసీస్ 299 పరుగులు చేశాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా జమాల్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా కమిన్స్ నిలిచారు.

విజయంతో వీడ్కోలు


చివరి టెస్టు అనంతరం భార్యా పిల్లలతో వార్నర్

డేవిడ్ వార్నర్ టెస్టుల్లో చివరాట ఆడేశాడు. అయితే ఆఖరాటలోనూ అంతేజోరుగా విజృంభించాడు. రెండో ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీతో జట్టును గెలిపించడంతో కెరీర్‌ను అద్భుతంగా ముగించాడు. పాక్‌తో జరిగే మూడు టెస్టుల తర్వాత ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తానని 37 ఏళ్ల వార్నర్ గతంలోనే ప్రకటించాడు. అలాగే వన్డేల నుంచి కూడా వైదొలుగుతున్నట్టు ఇటీవలే వెల్లడించిన అతను టీ20లకే పరిమితం కానున్నాడు.

చిరునవ్వు చిందేలా చేశా..: వీడ్కోలు టెస్టు సందర్భంగా వార్నర్ భావోద్వేగానికి గురయ్యాడు. 'ఏడాదిన్నరగా ఆసీస్ ప్రదర్శన జోరుగా సాగుతోంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేతగా, యాషెస్ సిరీస్‌ను డ్రా చేసుకోవడం, వన్డే వరల్డ్ కప్ గెలవడం.. ఇప్పుడు పాక్‌తో టెస్టు సిరీస్.. ఇలా వీటన్నింటిలో నా భాగస్వామ్యం ఉండడం ఆనందంగా ఉంది. నా ఆటతో ప్రతీ అభిమాని ముఖంలో చిరునవ్వు వచ్చేలా చేశానని భావిస్తున్నా' అని వార్నర్ అన్నాడు. 112 టెస్టుల్లో 8786 పరుగులు చేసిన వార్నర్.. 26 సెంచరీలు, 37 హాఫ్ సెంచరీలు సాధించాడు. 161 వన్డేల్లో 22 శతకాలతో 6932 రన్స్ చేశాడు.

భారత్-ఎ సారథిగా అభిమన్యు

ముంబై: స్వదేశంలో ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగే ప్రాక్టీస్ మ్యాచ్‌లకు భారత్-ఎ జట్టు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్ వ్యవహరించనున్నాడు. అహ్మదాబాద్‌లో ఈ నెల 12 నుంచి రెండు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌తోపాటు 17నుంచి నాలుగు రోజుల ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ జరగనుంది. శనివారం ప్రకటించిన 13 మంది సభ్యుల భారత్-ఎ టీమ్‌లో కేఎస్ భరత్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్‌కు కూడా చోటు దక్కింది. కాగా, ఈ నెల 25 నుంచి జరిగే ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టు భారత్‌లో పర్యటించనుంది.

భారత్‌తో టీ20 సిరీస్‌కు
అఫ్ఘాన్ కెప్టెన్‌గా జద్రాన్



కాబూల్: భారత్‌తో ఈనెల 11 నుంచి జరిగే మూడు టీ20ల సిరీస్‌కు అఫ్ఘానిస్థాన్ జట్టును ప్రకటించారు. యువ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్‌నే కెప్టెన్‌గా కొనసాగించనున్నారు. ఇటీవలి యూఏఈతో సిరీస్‌కు కూడా అతనే సారథిగా వ్యవహరించాడు. అయితే వెన్నెముక సర్జరీ నుంచి కోలుకుంటున్న రెగ్యులర్ కెప్టెన్ రషీద్ ఖాన్‌ను కూడా ఈ సిరీస్‌కు ఎంపిక చేయడం గమనార్హం. అతను మ్యాచ్‌లకు మాత్రం దూరంగానే ఉండనున్నట్టు సమాచారం. స్పిన్నర్ ముజీబుర్ రహ్మాన్ సైతం జట్టులో చోటు దక్కించుకున్నాడు.

అఫ్ఘానిస్థాన్ జట్టు: జద్రాన్ (కెప్టెన్), గుర్బాజ్, అలిఖిల్, జజాయ్, రహ్మత్ షా, నజీబుల్లా, నబీ, జనత్, ఒమర్జాయ్, అష్రాఫ్, ముజీబుర్, ఫరూఖి, ఫరీద్ అహ్మద్, నవీన్ ఉల్ హక్, నూర్ అహ్మద్, సలీమ్, ఖాయిస్ అహ్మద్, నయీబ్, రషీద్ ఖాన్.

ముంబైతో పోరుకు రెండు జట్లుగా వచ్చి..

బిహార్ క్రికెట్‌లో బయటపడ్డ విభేదాలు

పట్నా: రెండు దశాబ్దాలుగా బిహార్ క్రికెట్‌లో కొనసాగుతున్న వర్గపోరు 'మైదానాని'కి పాకింది. ముంబైతో శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన రంజీ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా సంఘంలోని రెండు వర్గాల జట్లు ఆడేందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో రెండు జట్లకు సంబంధించిన అధికారులు వాగ్వాదానికి దిగడంతోపాటు గొడవపడే దుస్థితికి పరిస్థితి దిగజారింది. బిహార్ క్రికెట్ సంఘంలో (బీసీఏ) ఒక వర్గానికి అధ్యక్షుడు రాకేశ్ తివారీ, మరో వర్గానికి కార్యదర్శి అమిత్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముంబై జట్టుతో పోరుకు రెండు వర్గాల జట్లు మైదానానికి రావడంతో..అక్కడున్నవారంతా షాక్ తిన్నారు. చర్చల అనంతరం అశుతోష్ అమన్ కెప్టెన్సీలోని రాకేశ్ తివారీ వర్గానికి చెందిన జట్టును ఆడేందుకు నిర్వాహకులు అనుమతించారు. దాంతో మ్యాచ్ ఆలస్యంగా ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది.

10 మ్యాచ్‌లు.. 9 ఓటములు



ముంబై: ప్రొ కబడ్డీ సీజన్-10లో తెలుగు టైటాన్స్ పేలవఫామ్ కొనసాగుతోంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 30-37తో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓడింది. ఇప్పటిదాకా పది మ్యాచ్‌లాడిన టైటాన్స్‌కు ఇది తొమ్మిదో పరాజయం కావడం గమనార్హం. దీంతో టైటాన్స్ ఓవరాల్‌గా 9 పాయింట్లు మాత్రమే సాధించి చివరి స్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 41-31తో యు ముంబాపై నెగ్గింది.

9 నుంచి ఆర్‌ఎస్‌సీఏ సంక్రాంతి టీ20 క్రికెట్ కప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌సీఏ) అంతరాష్ట్ర సంక్రాంతి టీ20 క్రికెట్ కప్ ఈనెల 9 నుంచి 16 వరకు బాపట్ల జిల్లా, కొరిశపాడు మండలం, రావినూతలలోని ఆర్‌ఎస్‌సీఏ స్టేడియంలో జరగనుంది. హైదరాబాద్ లెవన్, చెన్నై జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, బెంగళూరు లైన్స్ క్లబ్ సహా 16 జట్లు తలపడనున్నాయి. విజేత జట్టుకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.2 లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. లక్ష బహుమతిగా లభించనుంది.

ఖో-ఖో సెమీస్‌లో ఒడిశా, చెన్నై

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో ఒడిశా జగర్‌నాట్స్, చెన్నై క్విక్ గన్స్ జట్లు సెమీఫైనల్స్ బెర్త్‌లు ఖాయం చేసుకున్నాయి. శనివారం జరిగిన తొలి పోరులో ఒడిశా 30-27తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో చెన్నై క్విక్ గన్స్ 41-18తో ముంబై ఖిలాడిస్‌పై గెలిచింది. ఆదివారం ముంబై ఖిలాడిస్‌తో రాజస్థాన్ వారియర్స్, ఒడిశాతో తెలుగు యోధాస్ తలపడనున్నాయి.

బిజినెస్



ఎలక్ట్రానిక్స్ రంగంలో విదేశీ భాగస్వామ్యాలు

భారత కంపెనీల చేతికి తయారీ యూనిట్లు
గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న ఎలక్ట్రానిక్స్ వినియోగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే ఐదేళ్లలో ఎలక్ట్రానిక్స్ తయారీకి భారత్ పెద్ద కేంద్రం కానుంది. ఇప్పటి వరకూ లో-ఎండ్ డివైసెస్‌ను తయారు చేస్తున్న దేశీయ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ హైటెక్ వస్తువుల తయారీలోకి అడుగు పెట్టనుంది. ఇందుకు విదేశీ కంపెనీలతో చేతులు కలుపుతోంది. దీనివల్ల ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ రంగంలో దేశీయ కంపెనీలకు నైపుణ్యాలు పెరగడమే కాక విదేశీ మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం కూడా వచ్చే వీలుందని మాస్‌చిప్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడానికి దేశీయ కంపెనీలు విదేశీ కంపెనీల తయారీ యూనిట్లను కొనుగోలు చేస్తున్నాయి. భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. యాపిల్ టెక్నాలజీని పొందడానికి భారత్‌లో ఐఫోన్‌ను తయారు చేస్తున్న తైవాన్ కంపెనీ విస్ట్రాన్ యూనిట్‌ను టాటా టెక్నాలజీస్ సొంతం చేసుకుంది. చైనాకు చెందిన షామీతో డిక్సన్ టెక్నాలజీస్ చేతులు కలిపింది. ల్యాప్‌టాప్‌లను తయారు చేయడానికి ఇంటెల్‌తో కేనీస్ టెక్నాలజీస్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.

18 శాతం వృద్ధి అంచనా..

రానున్న ఐదేళ్లలో దేశీయ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఏడాదికి 18 శాతం వృద్ధి చెందగలదని అంచనా. మొత్తం ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ (ఈఎస్‌డీఎం) పరిశ్రమను తీసుకుంటే ఈ వృద్ధి రేటు 32 శాతం ఉండొచ్చని భావిస్తున్నాయి. భారత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎలక్ట్రానిక్స్ పరికరాలు, ఉపకరణాల వాడకం పెరగడం ఇందుకు కారణం. 2023 తొలి త్రైమాసికంలో దేశంలో విక్రయించిన స్మార్ట్ ఫోన్లలో 37.2 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే విక్రయం అయ్యాయి. ఫ్రిజ్, వాషింగ్ మిషన్ల వంటి అన్ని గృహోపకరణాలు స్మార్ట్ డివైసెస్‌గా మారుతున్నాయి. దేశీయ ఈఎస్‌డీఎం పరిశ్రమ విలువ ప్రస్తుతం 3,400 కోట్ల బిలియన్ డాలర్ల (రూ.2.78 లక్షల కోట్లు) మేరకు ఉందని ఇది 2026 నాటికి 8000 కోట్ల డాలర్లకు చేరగలదని అంచనా వేస్తున్నారు. ఇందుకు ఆటోమోటివ్, ఏరోస్పేస్, రక్షణ, మెడికల్ డివైసెస్‌లు దోహదం చేయనున్నాయి. సాధారణ ద్విచక్ర వాహనంతో పోలిస్తే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంలో 9 రెట్లు అధికంగా ఎలక్ట్రిక్ కాంపొనెంట్లు ఉంటాయి. మరోవైపు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధికి స్పెషల్ ఎకనమిక్ జోన్లు ఏర్పాటు, ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకాల పథకం వంటి విధానపరమైన నిర్ణయాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమను ప్రోత్సహిస్తున్నాయి.

తప్పనిసరి నాణ్యత ప్రమాణాల పరిధిలోకి
మరిన్ని ఉత్పత్తులు: గోయల్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మరిన్ని ఉత్పత్తులను తప్పనిసరి నాణ్యత ప్రమాణాల పరిధిలోకి తీసుకురానుందని వినియోగదారుల వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. శనివారం జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) 77వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా ఆయన ప్రసంగించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించాలన్న లక్ష్య సాధనకు ఉత్పత్తులు, సేవల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు తోడ్పడనున్నాయని అన్నారు. దేశంలో నాణ్యతపై అవగాహన పెంచడంలో బీఐఎస్ కృషిని గోయల్ ప్రశంసించారు. దేశంలో నాణ్యత ప్రమాణాలకు బీఐఎస్ ప్రతినిధిగా మారాలన్నారు. ఇతరుల నాణ్యత ప్రమాణాలను ఆదర్శంగా తీసుకోవడం కాదు, ప్రమాణాలకు మనమే మార్గదర్శకం కావాలన్నారు. ఉదాహరణకు, లిఫ్ట్, ఎయిర్ ఫిల్టర్లు, వైద్య పరికరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల ఏర్పాటు ద్వారా భారత్ అందరికన్నా ముందు వరుసలో నిలవగలదన్నారు.

ఇప్పటివరకు దేశంలో 672 ఉత్పత్తులకు వర్తించేలా 156 నాణ్యత నియంత్రణ ఆదేశాల (క్యూసీఓ)ను జారీ చేయడం జరిగిందని గోయల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2014 కంటే ముందు కేవలం 106 ఉత్పత్తులు మాత్రమే క్యూసీఓ పరిధిలోకి వచ్చాయన్నారు. మున్ముందు 2,000-2,500 ఉత్పత్తులను తప్పనిసరి నాణ్యత ప్రమాణాల పరిధిలోకి తేవాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

2030 నాటికి 2 లక్షల కోట్ల డాలర్ల ఎగుమతులు

భౌగోళిక రాజకీయ ప్రతికూలతలు, అధిక ధరల ఆందోళనల నేపథ్యంలోనూ భారత వార్షిక ఎగుమతులు 2030 నాటికి 2 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకోగలవని గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని జాతీయ జౌళి బోర్డు, జూట్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం, జూట్ కమిషనర్ కార్యాలయమైన పట్సన్ భవన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య ఉద్రిక్తతలతో పాటు తాజాగా ఎర్ర సముద్రంలో సరుకు రవాణా నౌకలపై హౌతీ మిలిటెంట్ల దాడులు ఎగుమతి వాణిజ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు.



ఘనంగా యూకో బ్యాంక్ 82వ వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. 82వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 1943లో స్వర్గీయ జీడీ బిర్లా చేతుల మీదుగా ప్రారంభమైన యూకో బ్యాంక్.. తన కార్యకలాపాలను మరింత విస్తరించటమే కాకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎస్ శ్రీకాంత్ తెలిపారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్‌ను అందజేసినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు. అలాగే ఖాతాదారుల కోసం ఉచిత హెల్త్‌క్యాంప్‌ను, బ్యాంక్ జోనల్ కార్యాలయంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను నిర్వహించినట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా ప్రయారిటీ ఖాతాదారులతో పాటు పదవీ విరమణ చేసిన సిబ్బందిని సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఏజీఎం శశిభూషణ్ రావు, మోతీలాల్, ఇతర సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

టాటా అసెట్ మేనేజ్‌మెంట్ నుంచి 4 కొత్త ఫండ్స్

టాటా అసెట్ మేనేజ్‌మెంట్.. బంగారం, వెండికి సంబంధించి నాలుగు కొత్త ఫండ్స్‌ను తీసుకువచ్చింది. ఇందులో రెండు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ కాగా మరో రెండు ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్). దేశీయంగా బంగారం, వెండి ధరలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఈ ఫండ్స్ పెట్టుబడులు పెట్టనున్నాయి. టాటా గోల్డ్ ఈటీఎఫ్, సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఈ నెల 9న ముగియనుండగా టాటా గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్, సిల్వర్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్.. ఈ నెల 16న ముగియనున్నాయి. గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్ కనీస పెట్టుబడి రూ.100 కాగా ఫండ్ ఆఫ్ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000.

- ఐటీసీ ఫుడ్స్‌కు చెందిన ఐటీసీ సన్‌ఫీస్ట్ ఫార్మ్‌లైట్.. మార్కెట్లోకి సరికొత్త సన్‌ఫీస్ట్ ఫార్మ్‌లైట్ డైజెస్టివ్ బిస్కెట్ ఫ్యామిలీ ప్యాక్‌ను విడుదల చేసింది. ఈ బిస్కెట్ ప్యాక్‌ను పూర్తిగా పేపర్ బ్యాగ్ ప్యాకేజింగ్‌లో తీసుకువచ్చింది. బిస్కెట్ విభాగంలో ఈ తరహా ప్యాకేజింగ్‌ను ఇదే తొలిసారి అని ఐటీసీ వెల్లడించింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉన్న ఈ ప్యాక్ త్వరలో ఇతర ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌తో పాటు సూపర్ మార్కెట్స్‌లో అందుబాటులోకి రానుందని తెలిపింది.
- ఈ నెల 17న అమెరికా, కాలిఫోర్నియాలోని శాన్‌జోస్‌లో మార్కెట్లోకి విడుదల చేయనున్న సరికొత్త గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌ను ముందుగా రిజర్వ్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సామ్‌సంగ్ ఇండియా ప్రకటించింది. ముందుగా రిజర్వ్ చేసుకునే వినియోగదారులకు కొత్త గెలాక్సీ ఫోన్ కొనుగోలు చేసే సమయంలో ప్రత్యేక ఆఫర్లను అందించనున్నట్లు వెల్లడించింది. సామ్‌సంగ్ డాట్‌కామ్, సామ్‌సంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, అమెజాన్ డాట్‌ఇన్ ద్వారా రూ.2,000 చెల్లించి ఈ ఫోన్‌ను రిజర్వ్ చేసుకోవచ్చని తెలిపింది.

2023లో కొత్తగా 3.1 కోట్ల డీమ్యాట్ ఖాతాలు



ముంబై: గత ఏడాదిలో కొత్తగా 3.1 కోట్లకు పైగా డీమ్యాట్ ఖాతాలు తెరిచారు. స్టాక్ మార్కెట్లో రికార్డుల ర్యాలీతోపాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీ షేర్లలో పెట్టుబడులు భారీ రిటర్నులు పంచుతుండటం, పబ్లిక్ ఆఫరింగ్(ఐపీఓ)ల జోరు వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయి. గత 12 నెలల్లో సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్(సీఎస్‌డీఎల్), నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) నిర్వహణలోని మొత్తం డీమ్యాట్ ఖాతాలు 28.7 శాతం వార్షిక వృద్ధితో 13.92 కోట్లకు చేరుకున్నాయి. 2022 చివరినాటికి అకౌంట్స్ 10.81 కోట్లుగా ఉన్నాయి. కాగా, 2023 డిసెంబరులో కొత్తగా 41 లక్షల డీమ్యాట్ ఖాతాలు తెరిచారు. డీమ్యాట్ ఖాతాల్లో ఇప్పటివరకిదే అత్యధిక నెలవారీ జోడింపు. గత సంవత్సరం స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు రెండంకెల రిటర్నులు పంచాయి. నిఫ్టీ-50 సూచీ 20 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 46.6 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 55.6 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,280 ▲	58,010 ▲	78,000 ▼
ముంబై	62,540 ▼	57,287 ▼	71,550 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ		విజయవాడ	585
హైదరాబాద్	560	విశాఖపట్నం	625
7 జనవరి		వరంగల్	562
చిత్తూరు	583	డజను గుడ్లు రూ.72	
గోదావరి	585		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	84
వరంగల్	70	గుంటూరు	82
కరీంనగర్	70	ఒంగోలు	82
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	80
కర్నూలు	70	నెల్లూరు	80
విశాఖపట్నం	79	అనంతపురం	84
గోదావరి	84		

సంద్రంలో సంక్షోభం!

- ఎర్ర సముద్రంలో ఉద్రిక్తతలతో భారత ఎగుమతులపై ప్రభావం
- 60% వరకు పెరిగిన సరుకు రవాణా వ్యయం
- బీమా ప్రీమియం 15-20 శాతం అప్: జీటీఆర్ఐ



న్యూఢిల్లీ: ఎర్ర సముద్రంలో సరుకు రవాణా నౌకలపై యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్ల దాడులు పెరగడం భారత ఎగుమతులపైనా ప్రభావం చూపుతోందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. హౌతీ దాడుల నేపథ్యంలో అమెరికా, యూరప్ వంటి గమ్యాలను చేరేందుకు మన సరుకు రవాణా నౌకలు దూర మార్గాల గుండా ప్రయాణించాల్సి వస్తుండటంతో రవాణా వ్యయంతోపాటు బీమా ప్రీమియం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. రవాణా వ్యయం 40 నుంచి 60 శాతం మేర, సరుకు బీమా ప్రీమియం 15-20 శాతం మేర పెరిగిందని జీటీఆర్ఐ రిపోర్టు పేర్కొంది. ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రాన్ని హిందూ మహా సముద్రంతో కలిపే కీలక నౌక ప్రయాణ మార్గమైన బాబ్-ఎల్-మాండెబ్ స్ట్రెయిట్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ మార్గంలో ప్రయాణించే సరుకు రవాణా నౌకలపై హౌతీ మిలిటెంట్లు ఇప్పటికే పలు మార్లు దాడులకు పాల్పడ్డారు. దాంతో నౌకలు సరుకును చేరవేసేందుకు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గంలో ప్రయాణించాల్సి వస్తోందని, తత్ఫలితంగా షిప్పింగ్ 14 రోజుల వరకు జాప్యమై రవాణా వ్యయం, సరుకు బీమా ప్రీమియం కూడా భారీగా పెరిగిందని ఉన్నతాధికారి అన్నారు. ఈ నెల 4న వాణిజ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఎగుమతిదారులు, వర్తకులు, కంటైనర్ నిర్వహణ సంస్థలు ఈ విషయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయన్నారు. ఈ నేపథ్యంలో ఎగుమతిదారులకు రవాణా వ్యయంలో కొంత మేర సబ్సిడీ కల్పించే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 7-1-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

పక్క రాష్ట్ర సీఎంకు ఫోన్ చేయడం మర్యాద

జగన్ ఆ పని కూడా చేయలేదు

కేసీఆర్‌ను గెలిపించాలనుకున్నారు

మేం ఓడిపోవాలని చాలా చేశారు

మోదీ మళ్లీ ప్రధాని కావాలని జగన్ కోరుకుంటున్నారు

ఏపీలో షర్మిలకు సహకరిస్తాం!

10

మా ఓటమికి జగన్ చాలా చేశారు



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి 'బిగ్ డిబేట్'లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి



జగన్ సర్కారు తీరుకు నిరసనగా కర్నూలు జిల్లా కేంద్రంలో 'మొద్దునిద్ర' రూపంలో అంగన్వాడీల వినూత్న ఆందోళన

ఎస్మాస్త్రం!

అంగన్వాడీల పోరుపై చీకటి చట్టం.. జగన్ సర్కార్ బరితెగింపు

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా అంగన్వాడీలపై జగన్ సర్కారు కక్షపూరిత చర్యలకు దిగింది. అంగన్వాడీల సమ్మెను నిషేధిస్తూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. 6 నెలలు సమ్మెలు, నిరసనలు నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అంగన్వాడీలను అత్యవసర సర్వీసుల కిందకు తీసుకొస్తూ జీవో 2ను తెచ్చింది. అయితే, ప్రభుత్వ బెదిరింపులకు లొంగేదిలేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

- ఆరు నెలలపాటు సమ్మెపై నిషేధం
- సమ్మె కాలంలో జీతాల్లో కోత
- సమ్మె కొనసాగిస్తే డిస్మిస్ చేసే చాన్స్
- ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఎస్మా పరిధిలోకి తెచ్చి మరీ చర్యలు
- చర్చల సమయంలోనే ఉత్తర్వులు జారీ

చీకటి చట్టంపై నిరసనాగ్ని

రాష్ట్రవ్యాప్తంగా జీవో కాపీల దహనం

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలపై జగన్ సర్కారు ఎస్మా అస్త్రాన్ని ఎక్కుపెట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలూ పరిష్కరించాలని కోరితే కఠిన చర్యలకు దిగింది. గత 26 రోజులుగా కుటుంబాలను, పిల్లలను వదిలి, నిద్రాహారాలు మాని అంగన్వాడీలు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. కనికరించు జగనన్నా.. ఇచ్చిన హామీ నెరవేర్చి వేతనం పెంచు జగనన్నా అని వేడుకుంటుంటే.. అందుకు భిన్నంగా జగన్ సర్కారు వారిపైనే కన్నెర్ర చేసింది. ఓ వైపు ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలతో

మిగతా 11వ పేజీలో...



బెజవాడలో జీవో కాపీలను తగలబెడుతున్న దృశ్యం

సమ్మె ఆపేది లేదు!

గౌరవ వేతనంతో పనిచేస్తున్నవారిపైనా ప్రతాపం?

అంగన్వాడీల నేత సుబ్బరావమ్మ

11

ఏంటీ.. ఎస్మా?

నేరశిక్షాస్మృతితో సంబంధం, వారెంట్ లేకుండానే అరెస్టు, జైలు!

సన్ మిషన్ సక్సెస్



ఇస్రో మొట్టమొదటి సౌర పరిశోధన ప్రాజెక్టు 'ఆదిత్య' విజయవంతం

- తుది గమ్యం ఎల్ 1 పాయింట్‌ను చేరిన వ్యోమనౌక
- 127 రోజుల్లో 15 లక్షల కి.మీ.ల ప్రయాణం
- ఏడు పేలోడ్లతో సూర్యుడిపై అధ్యయనం
- ఐదేళ్లపాటు కీలక వివరాలు అందించనున్న ఆదిత్య ఎల్ 1
- మన శాస్త్రవేత్తల అంకితభావానికి నిదర్శనం: ప్రధాని
- తదుపరి లక్ష్యం అంగారకుడు.. 'మిషన్ టు మార్స్'
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

బెంగళూరు, సూళ్లూరుపేట, జనవరి 6: నిరవధికంగా 127 రోజుల పాటు.. 15 లక్షల కి.మీ.ల ప్రయాణం చేసిన తర్వాత భారతీయ తొలి సోలార్ మిషన్ ఆదిత్య ఎల్ 1 శనివారం తన గమ్యాన్ని చేరుకుంది. సూర్యుడు-భూమి మధ్యనున్న లాగ్రేంజ్ పాయింట్ (ఎల్ 1)ను విజయవంతంగా చేరింది. ఇక్కడి నుంచి ఆదిత్య సూర్యుడి అద్భుతాలను, రహస్యాలను అధ్యయనం చేయనుంది. ఎటువంటి గ్రహణాల అడ్డులేకుండా నిరాటంకంగా ఈ పని జరగనుంది. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాధించిన ఈ ఘనవిజయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా ఎక్స్‌లో వెల్లడించారు. 'భారత్ మరో సంచలనం నమోదు చేసింది. మన తొలి సోలార్ అబ్జర్వేటరీ ఆదిత్య ఎల్ 1.. గమ్యాన్ని చేరుకుంది. అత్యంత క్లిష్టమైన అంతరిక్ష ప్రయోగాలను విజయవంతం చేయటంలో మన శాస్త్రవేత్తల నిర్విరామ కృషికి, అంకితభావానికి ఇది నిదర్శనం. ఈ అద్వితీయ విజయాన్ని యావత్‌దేశంతో కలిసి స్వాగతిస్తున్నా. మానవాళి ప్రయోజనాల కోసం సైన్స్ సరిహద్దులను

మిగతా 10వ పేజీలో...

'కమలం'తో సంకటం!



అంతులేని అధికారాన్ని చలాయించిన కేసీఆర్‌కు ప్రతిపక్ష రాజకీయాలు చేయడం అంత ఈజీ కాదు. తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ఉన్నంత ఓర్పు, నేర్పు కూడా కేసీఆర్‌కు లేవు. గతంలోనూ, ఇప్పుడూ పదిహేను సంవత్సరాల పాటు ప్రతిపక్షంలో కూర్చోవలసి వచ్చినప్పటికీ అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి తెలుగుదేశం పార్టీని చంద్రబాబు నిలబెట్టుకోగలిగారు.

తెలంగాణ ప్రజల తిరస్కరణకు గురైన కేసీఆర్ ఇకపై జాతీయ రాజకీయాల గురించి ఆలోచించే సాహసం చేయకపోవచ్చు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీ నాయకుడు జాతీయ రాజకీయాలు అంటూ ఎగిరిపడితే ఏమవుతుందో నేను అప్పుడే చెప్పాను.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ మంచి ఊపుమీదుంది. సీఎం జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉంది. మరోవైపు జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్‌లో చేరిపోయి పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఇవన్నీ టీడీపీకి కలిసివచ్చే అంశాలే అయినా ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ పెద్దలు భావిస్తే నిరాకరించే పరిస్థితిలో టీడీపీ అధినేత చంద్రబాబు లేరు.

బీజేపీతో చేతులు కలిపితే జగన్‌కు మేలు చేసినట్టే అన్న అభిప్రాయం ఉన్నందున మొత్తం పరిస్థితిని బీజేపీ పెద్దలకు వివరించి పొత్తు కోసం ఒత్తిడి తేవొద్దని, ఎన్నికల అనంతరం ఎన్డీయేలో చేరతామని నచ్చజెప్పడానికి తెలుగుదేశం, జనసేన తరఫున ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కేసీఆర్‌ను పరామర్శించడానికి జగన్ రావడం పలువురు బీఆర్ఎస్ ముఖ్యులకు ఇష్టం లేదు. జగన్ వల్లే మెజారిటీ సీమాంధ్రులు తమ పార్టీకి దూరమయ్యారని వారు అభిప్రాయపడుతున్నారు.

నెల రోజులుగా రేవంత్ రెడ్డి పనితీరును గమనించాక ఆయనలో ఒక చంద్రబాబు, ఒక రాజశేఖర రెడ్డి ఉన్నారని చెప్పవచ్చు. చంద్రబాబు వలె కష్టపడుతున్నారు, రాజశేఖర రెడ్డిలా కలుపుగోలుగా ఉంటున్నారు. ప్రస్తుతానికి ఆయన ప్రభుత్వాన్ని సాఫీగా నడపగలుగుతున్నప్పటికీ ఇకపై అసలైన సవాళ్లు ఆయనకు ఎదురుకానున్నాయి.


కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 2లో..



అక్కచెల్లెమ్మలారా.. క్షమించండి!

- రాష్ట్రంలో మహిళలపై 2.04 లక్షల అఘాయిత్యాలు
- మహిళలపై నేరాల్లో ఏపీ టాప్
- దిశ చట్టానికీ దిక్కులేదు
- జగన్ నియమించిన వలంటీర్ల వేధింపుల కేసులే 4,320
- మిస్సింగ్ కేసులు 22,278
- గృహహింస కేసులు 15,065

12



ఆంధ్రజ్యోతి

పాఠకులకు గమనిక



నేటి సంచికతో పాటు ఆదివారం అనుబంధానికి బదులుగా 2024 పంచాంగం క్యాలెండర్ ఉచితంగా అందుకోండి

- మేనేజింగ్ డైరెక్టర్

అధికార పార్టీ ఎమ్మెల్యేలలో ఆయనకో 'ప్రత్యేక' గుర్తింపు ఉంది. నోరు తెరిస్తే బూతుపురాణమే! జూదం విషయంలో నియోజకవర్గ కేంద్రాన్ని గోవా స్థాయికి తీసుకెళ్లారు. కేసినో, పేకాట శిబిరాల నిర్వహణలో ఆయనకున్న రికార్డు రాష్ట్రంలో మరే ప్రజాప్రతినిధికీ లేకపోవచ్చు! కృష్ణా జిల్లాకు చెందిన ఆ నేత పేరు వింటేనే ప్రజలు చీదరించుకునే పరిస్థితి!

ఆ ఎమ్మెల్యేకు తన అనుచరులతో కబ్జాలు, దందాలు చేయించడం నిత్యకృత్యం. నియోజకవర్గంలో వారికి 'గడ్డం గ్యాంగ్' అని పేరు. ఈ పేరు వింటేనే స్థానిక ప్రజలు వణికిపోతారు. పేకాట నిర్వహణతో వేలాది కుటుంబాలు రోడ్డున పడేలా చేశారు. ఇక ఇసుక అక్రమ రవాణాతో ఎమ్మెల్యే, అనుచరులు రూ.కోట్లు దోచుకున్నారు.

అడ్డదిడ్డం.. గడ్డం గ్యాంగ్!

అమ్మో ఎమ్మెల్యే

బూతుల ఎమ్మెల్యే ఇలాకాలో అరాచకాలు

నియోజకవర్గంలో గోవా స్థాయి జూదం.. కేసినో, పేకాట శిబిరాల నిర్వహణలో రికార్డు

- 2022లో కేసినోలో రూ.10 కోట్ల సంపాదన
- ఇసుక రవాణాలో కోట్లు కుమ్మేసిన వైనం
- గడ్డం గ్యాంగ్‌ను అడ్డుపెట్టుకుని కబ్జాలు, దందాలు
- 50 కోట్ల విలువ చేసే లేఔట్ ఆక్రమణ
- అప్పు ఇవ్వకున్నా రూ.50 లక్షలు డిమాండ్ చేయడంతో రియల్టర్ ఆత్మహత్య



(మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి)

వివాదాలకు ఆయన కేరాఫ్ అడ్రస్! మాటలు, చేతలు రెండూ అలాగే ఉంటాయి. టీడీపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, ఆ తర్వాత వైసీపీ గూటికి చేరారు. అక్రమార్జనతో ఆయన ఆస్తి పెరుగుతూ పో..తోంది. 2009 ఎన్నికల అఫిడవిట్‌లో రూ.1.19 కోట్లుగా ఉన్న ఆస్తి.. 2014నాటికి రూ.11.55 కోట్లకు, 2019 నాటికి రూ.14.82 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఆస్తుల విలువ ఎంత పెరిగిందో ఊహించలేం. వైసీపీ ప్రభుత్వంలో మంత్రి అయ్యాక ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆయనకు ఎదురే లేకుండా పోయింది. కొత్త ఇసుక పాలసీ ఆయనకు

మిగతా 10వ పేజీలో...

'ఫ్యాన్'కు ఉక్కపోత!

- వలసలతో వైసీపీ విలవిల
- రాష్ట్రమంతా అసమ్మతి సెగలు
- డైలీ సీరియల్‌లా 'వీడ్కోలు'
- తాజాగా అంబటి 'అవుట్'
- ఇదేబాటలో నలుగురు ఎంపీలు!
- సవాల్‌గా ఎంపీ సీట్ల ఎంపిక
- మరోవైపు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- సమ్మెలతో సర్కారు ఉక్కిరిబిక్కిరి
- డీలా పడుతున్న పార్టీ కేడర్

11



సచివాలయం వద్ద సజ్జలను చుట్టుముట్టి నిరసన తెలుపుతున్న మడకశిర వైసీపీ నాయకులు

వైసీపీలో 'ఆడను'

- మాజీ క్రికెటర్ అంబటి రాయుడు గుడ్ బై
- పార్టీ వీడే యోచనలో ఎమ్మెల్యే పార్థసారథి
- ఈ నెల 18న టీడీపీలో చేరే అవకాశం
- గుంటూరు నుంచైతే పోటీ చేయనన్న లావు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

'కమలం'తో సంకటం!



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగు రాష్ట్రాలలో రాజకీయ సమీకరణాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా చిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ముందుగా తెలంగాణ విషయం చర్చిద్దాం! తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి అధికారంలో కొనసాగిన భారత రాష్ట్ర సమితి తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చుంది. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి రావడం ఒక రకంగా ఆ పార్టీకి కొత్త అని చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమ సమయంలో వివిధ వర్గాల నుంచి, ముఖ్యంగా తెలంగాణకు చెందిన అధికారులు, ఉద్యోగులు, ఇతరుల నుంచి అందిన సహకారంతో భారత రాష్ట్ర సమితి పరోక్షంగా అధికారం చెలాయించిందని చెప్పవచ్చు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులలో లోక్‌సభకు ఎన్నికలు జరగనుండడంతో బీఆర్ఎస్ ఇరకాటంలో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి నెలలు గడవకముందే ఈ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఈ రెండు పార్టీలను ఢీకొని నిలదొక్కుకోవడం బీఆర్ఎస్‌కు సంకటంగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపలేని పరిస్థితి ఎదురైతే ఆ తర్వాత పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎంఎల్ఏలలో ఎంతమంది మిగులుతారో తెలియదు. అనూహ్య ఓటమితో కుంగిపోయిన నేతలు లోక్‌సభకు పోటీ చేయడానికి సిద్ధపడతారా? వంటి ప్రశ్నలు కూడా బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్నాయి. మరోవైపు భారత రాష్ట్ర సమితిని మింగేయడం ద్వారా తెలంగాణలో ప్రతిపక్షపాత్ర పోషించాలని భారతీయ జనతా పార్టీ అభిలషిస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీని కాపాడుకోవడం ఎలా అన్న అంశంపై బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు. ఇందులో ముఖ్యమైనది లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడం! ఈ ప్రతిపాదనను మాజీమంత్రి, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెరపైకి తెచ్చారు. బీజేపీతో పొత్తు అనివార్యతను పార్టీ పెద్దల వద్ద ప్రస్తావిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ఈ ఆలోచనలను వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణలోని పలు నియోజకవర్గాలలో ముస్లింలు గణనీయంగా ఉన్నందున బీజేపీతో చేతులు కలిపి వారిని శాశ్వతంగా దూరం చేసుకోవడం సరైంది కాదని కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. అధికారంలో ఉన్నంత వరకు మజ్లిస్ పార్టీతో మంచి దోస్తానా ఉండేది. ఇప్పుడు బీజేపీ వైపు చూస్తే మజ్లిస్ పార్టీ కూడా దూరమవుతుందని, దాని ప్రభావంతో ముస్లింలు పార్టీకి దూరమవుతారని కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. అయితే కేటీఆర్ ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులలో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీని ఎదుర్కొని నిలదొక్కుకుంటూ పార్టీని బతికించుకోవడం కష్టమని కేటీఆర్ అభిప్రాయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే దాని ప్రభావం పార్టీ మనుగడపై పడుతుందని, అదే జరిగితే పార్టీ నుంచి వలసలను నిరోధించలేమని కేటీఆర్ అభిప్రాయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల గండాన్ని ఎదుర్కోవడం ఇప్పుడు తమ ముందున్న అతి పెద్ద సవాలనీ, ఈ కారణంగా తమ ఆలోచనలన్నీ ఆ దిశగానే సాగుతున్నాయని పార్టీ ముఖ్యుడొకరు చెప్పారు. నిజానికి బీజేపీతో పొత్తు పెట్టుకోవాలనుకోవడం ఇష్టపడి చేస్తున్న ఆలోచన కాదనీ, పార్టీ మనుగడ కోసం విధిలేని పరిస్థితులలో ఆ దిశగా ఆలోచిస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు.

> భారతీయ జనతా పార్టీని కాదనలేని పరిస్థితిలో ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ ఉంది. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ మంచి ఊపుమీదుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉంది. మరోవైపు జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్‌లో చేరిపోయి పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్నారు. వైసీపీలో జగన్ తిరస్కరిస్తున్న పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోవడానికి సిద్ధపడుతున్నారు. ఫలితంగా వైసీపీ ఓటు బ్యాంకుకు ఎంతో కొంత గండిపడుతుంది. ఇవన్నీ తెలుగుదేశం పార్టీకి కలిసివచ్చే అంశాలే అయినా ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ పెద్దలు భావిస్తే నిరాకరించే పరిస్థితిలో టీడీపీ అధినేత చంద్రబాబు లేరు. ఏపీలో బీజేపీకి ఏ మాత్రం బలం లేకపోగా ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుంది. అయినా బీఆర్ఎస్, తెలుగుదేశం పార్టీలకు బీజేపీని కాదనుకోలేని అనివార్యత ఏర్పడిందంటే... ఆ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉండటమే కారణం.

ఇందులో వాస్తవం లేకపోలేదు. అంతులేని అధికారాన్ని చలాయించిన కేసీఆర్‌కు ప్రతిపక్ష రాజకీయాలు చేయడం అంత ఈజీ కాదు. తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ఉన్నంత ఓర్పు, నేర్పు కూడా కేసీఆర్‌కు లేవు. గతంలోనూ, ఇప్పుడూ పదిహేను సంవత్సరాల పాటు ప్రతిపక్షంలో కూర్చోవలసి వచ్చినప్పటికీ అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి తెలుగుదేశం పార్టీని చంద్రబాబు నిలబెట్టుకోగలిగారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఫాంహౌస్‌కు వెళ్లిపోయి, అక్కడ కాలు జారి పడి ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్‌కు ఇప్పుడు పార్టీని నిలబెట్టుకోవడం కత్తి మీద సామే అవుతుంది. శాసనసభ సమావేశాలలో పాల్గొని... నిన్నటి వరకు తాను కూర్చున్న స్థానంలో తనకు ఏ మాత్రం గిట్టని రేవంత్ రెడ్డి కూర్చోడాన్ని చూడలేకనే తుంటి విరిగిందన్న నాటకాన్ని కేసీఆర్ రక్తి కట్టించారన్న ప్రచారం కూడా ఉంది. ఇందులో కొంత నిజం కూడా ఉంది. ఏది ఏమైనా బీఆర్ఎస్ నాయకులకు భవిష్యత్తు అగమ్య గోచరంగా కనిపిస్తున్నది. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకుంటే... అని ఆలోచన చేస్తున్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ద్వారా ఈ పొత్తు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. నిజానికి తెలంగాణలో భారత రాష్ట్ర సమితితో పొత్తు పెట్టుకోవడం బీజేపీకి కూడా ఇష్టం లేదని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లేచి నిలబడలేదు. ఈ పరిస్థితులలో ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని మళ్లీ జీవం పోసే బదులు... తెలంగాణ రాజకీయ రంగస్థలం నుంచి మాయమయ్యే పరిస్థితి బీఆర్ఎస్‌కు కల్పించగలిగితే తాము ప్రతిపక్షంగా నిలబడతామని కమలనాథులు ఆలోచిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కూడా బీఆర్ఎస్‌తో పొత్తుకు సుముఖంగా లేరు. అయితే, పొత్తు ప్రతిపాదన భారత రాష్ట్ర సమితి వైపు నుంచే వచ్చింది కనుక బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రస్తుతానికి తుది నిర్ణయం తీసుకోలేదు.

బీఆర్ఎస్ దారెటు...

బీజేపీతో పొత్తు అనేది బీఆర్ఎస్‌కు ఆత్మహత్యాసదృశం అవుతుందా? లేక బతికి బట్టకట్టడానికి ఉపయోగపడుతుందా? అంటే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించడంకోసమే జాతీయ రాజకీయాలలోకి వెళుతున్నానని ప్రకటించిన కేసీఆర్... తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చారు. కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఏం చేయాలనుకుంటున్నారో కూడా చెప్పుకొన్నారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన వారిని ఆకర్షించడానికి డబ్బు పంచి పెట్టారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించి కొంతమంది ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించారు. దీంతో తెలంగాణకు చెందిన ఆ పార్టీ నాయకులు భ్రమల్లోకి వెళ్లారు. కేటీఆర్, హరీశ్ రావు వంటివారు మాత్రం అప్పుడు కూడా బీఆర్ఎస్ ఏర్పాటును, జాతీయ రాజకీయాల ఆలోచనను వ్యతిరేకించారు. అయితే కేసీఆర్‌ను ఎదిరించే సాహసం చేయలేక అప్పట్లో వారు కూడా వంత పాడారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. తెలంగాణ ప్రజల తిరస్కరణకు గురైన కేసీఆర్ ఇకపై జాతీయ రాజకీయాల గురించి ఆలోచించే సాహసం చేయకపోవచ్చు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీ నాయకుడు జాతీయ రాజకీయాలు అంటూ ఎగిరిపడితే ఏమవుతుందో నేను అప్పుడే చెప్పాను. తొమ్మిదిన్నర ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఇకపై కొత్తగా అందుకోబోయే పదవి కూడా ఏదీ లేదు. యూపీఏ హయాంలో ఆయన కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ నుంచి కేసీఆర్ పోటీ చేస్తారని కూడా తెలుస్తోంది. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎదురుపడటం కేసీఆర్‌కు ఏ మాత్రం ఇష్టం లేదట! అందుకే మెదక్ నుంచి లోక్‌సభకు పోటీచేసే ఆలోచన చేస్తున్నట్టు చెబుతున్నారు. మరోవైపు కేసీఆర్‌కు వయసు మీద పడుతోంది. పార్టీని ఎంతో కాలం ఆయన నడపలేరు. ఈ కారణంగా బీఆర్ఎస్‌ను నిలబెట్టుకోవలసిన బాధ్యత కేటీఆర్‌పై పడింది. అందుకే ఆయన ప్రస్తుతం పార్టీ పైనే దృష్టి కేంద్రీకరించారు. సమీక్షలు నిర్వహిస్తున్నారు. తనకు సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్నందున పార్టీని నిలబెట్టుకోవాల్సిన అవసరం కేటీఆర్‌కే ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే బీజేపీతో పొత్తుకోసం ఆయన పట్టుపడుతున్నారు. కేసీఆర్ అభిప్రాయపడుతున్నట్టుగా బీజేపీతో పొత్తు దీర్ఘకాలంలో బీఆర్ఎస్‌కు నష్టం చేసే అవకాశం లేకపోలేదు. పార్టీని బతికించుకోవాలంటే లాభనష్టాలతో నిమిత్తం లేకుండా ప్రస్తుతానికి బీజేపీతో చేతులు కలపడం అనివార్యం అన్న కేటీఆర్ అండ్ కో వాదనలోనూ హేతుబద్ధత లేకపోలేదు. అయితే బీజేపీ పెద్దలు ఈ పొత్తు ప్రతిపాదనను స్వాగతిస్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

> బీజేపీతో చేతులు కలపడం వల్ల తెలంగాణలో భారత రాష్ట్ర సమితికి కొంత నష్టం, కొంత లాభం ఉంటుంది కానీ... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తెలుగుదేశం పార్టీకి నష్టమే ఉంటుంది. అయితే జగన్ అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొని ఎన్నికలు సజావుగా జరిగి ప్రజాభిప్రాయం ప్రతిబింబించాలంటే బీజేపీ సహకారం తెలుగుదేశం పార్టీకి అవసరం. అయితే, అదే సమయంలో బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. రాయలసీమలో ముస్లిం మైనారిటీలు అధికంగా ఉన్నారు. ఈ కారణంగా రాయలసీమకు చెందిన తెలుగుదేశం నాయకులు బీజేపీతో పొత్తు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే, ఇది వరకే పొత్తు ప్రకటన చేసిన జనసేనాని పవన్ కల్యాణ్ కూడా బీజేపీ విషయంలో సానుకూలంగా ఉన్నారు. దీంతో తెలుగుదేశం నాయకత్వం ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉంది. బీజేపీతో చేతులు కలిపితే జగన్‌కు మేలు చేసినట్టే అన్న అభిప్రాయం ఉన్నందున మొత్తం పరిస్థితిని బీజేపీ పెద్దలకు వివరించి పొత్తు కోసం ఒత్తిడి తేవొద్దని, ఎన్నికల అనంతరం ఎన్డీయేలో చేరతామని నచ్చజెప్పడానికి తెలుగుదేశం, జనసేన తరఫున ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఏపీలో చిత్రం ఇలా...

తెలంగాణ రాజకీయం ఇలా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా భారతీయ జనతా పార్టీని కాదనలేని పరిస్థితిలో ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ ఉంది. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ మంచి ఊపుమీదుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉంది. మరోవైపు జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్‌లో చేరిపోయి పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్నారు. వైసీపీలో జగన్ తిరస్కరిస్తున్న పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోవడానికి సిద్ధపడుతున్నారు. ఫలితంగా వైసీపీ ఓటు బ్యాంకుకు ఎంతో కొంత గండిపడుతుంది. ఇవన్నీ తెలుగుదేశం పార్టీకి కలిసివచ్చే అంశాలే అయినా ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ పెద్దలు భావిస్తే నిరాకరించే పరిస్థితిలో టీడీపీ అధినేత చంద్రబాబు లేరు. దీంతో ఇటు తెలంగాణలో భారత రాష్ట్ర సమితికి, అటు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీతో కలవాల్సి రావడం బలవంతపు బ్రాహ్మణార్థంగా మారింది. బీజేపీతో చేతులు కలపడం వల్ల తెలంగాణలో భారత రాష్ట్ర సమితికి కొంత నష్టం, కొంత లాభం ఉంటుంది కానీ... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తెలుగుదేశం పార్టీకి నష్టమే ఉంటుంది. అయితే జగన్ అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొని ఎన్నికలు సజావుగా జరిగి ప్రజాభిప్రాయం ప్రతిబింబించాలంటే బీజేపీ సహకారం తెలుగుదేశం పార్టీకి అవసరం. అయితే, అదే సమయంలో బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. రాయలసీమలో ముస్లిం మైనారిటీలు అధికంగా ఉన్నారు. ఈ కారణంగా రాయలసీమకు చెందిన తెలుగుదేశం నాయకులు బీజేపీతో పొత్తు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే, ఇది వరకే పొత్తు ప్రకటన చేసిన జనసేనాని పవన్ కల్యాణ్ కూడా బీజేపీ విషయంలో సానుకూలంగా ఉన్నారు. దీంతో తెలుగుదేశం నాయకత్వం ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉంది. బీజేపీతో చేతులు కలిపితే జగన్‌కు మేలు చేసినట్టే అన్న అభిప్రాయం ఉన్నందున మొత్తం పరిస్థితిని బీజేపీ పెద్దలకు వివరించి పొత్తు కోసం ఒత్తిడి తేవొద్దని, ఎన్నికల అనంతరం ఎన్డీయేలో చేరతామని నచ్చజెప్పడానికి తెలుగుదేశం, జనసేన తరఫున ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణలో బీజేపీకి చెప్పుకోదగిన బలం ఉంది కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీకి ఏ మాత్రం బలం లేకపోగా ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుంది. అయినా బీఆర్ఎస్, తెలుగుదేశం పార్టీలకు బీజేపీని కాదనుకోలేని అనివార్యత ఏర్పడిందంటే... ఆ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉండటమే కారణం. రాజకీయాలలో అవసరం కోసం పొత్తు పెట్టుకుంటారు. ఇప్పుడు మొదటిసారిగా తెలుగునాట ఇష్టం లేకపోయినా బీజేపీతో చేతులు కలపాల్సిన పరిస్థితి ఏర్పడటం సరికొత్త పరిణామం. రాజకీయాలలో కూడా బలవంతపు బ్రాహ్మణార్థం ఉంటుందని ఇప్పుడే తెలుస్తోంది.

> కేసీఆర్‌ను పరామర్శించడానికి జగన్ రావడం పలువురు బీఆర్ఎస్ ముఖ్యులకు ఇష్టం లేదు. జగన్ వల్లే మెజారిటీ సీమాంధ్రులు తమ పార్టీకి దూరమయ్యారని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు మళ్లీ జగన్‌తో రాజకీయాలు చర్చించడం సీమాంధ్రులను శాశ్వతంగా దూరం చేసుకోవడమే అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

ఈ విషయం అలా ఉంచితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రెండు రోజుల క్రితం హైదరాబాద్ వచ్చి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఇరువురూ రాజకీయాలు చర్చించుకున్నారని, జగన్‌కు కేసీఆర్ కొన్ని సలహాలు ఇచ్చారని వార్తలు వచ్చాయి. అదే నిజమైతే తన ఓటమికి కారణం తెలుసుకోలేకపోయిన కేసీఆర్ మరొకరికి సలహాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. నిజానికి కేసీఆర్‌ను పరామర్శించడానికి జగన్ రావడం పలువురు బీఆర్ఎస్ ముఖ్యులకు ఇష్టం లేదు. జగన్ వల్లే మెజారిటీ సీమాంధ్రులు తమ పార్టీకి దూరమయ్యారని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు మళ్లీ జగన్‌తో రాజకీయాలు చర్చించడం సీమాంధ్రులను శాశ్వతంగా దూరం చేసుకోవడమే అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

నెలదాటిన పాలన...

ఈ విషయం అలా ఉంచితే తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి నెలరోజులైంది. ఒక ముఖ్యమంత్రి వ్యవహార శైలి గురించి తెలుసుకోవడానికిగానీ, ప్రభుత్వం ఎలా ఉండబోతున్నదన్న దానిపై అభిప్రాయానికి రావడానికిగానీ ఈ నెల రోజులు సరిపోవు. అయితే రేవంత్ రెడ్డిపై పలువురిలో భిన్నాభిప్రాయాలు ఉండేవి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన వ్యవహార శైలిని గమనించిన వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారు. నిజానికి చాలా మందికి రేవంత్ రెడ్డి గురించి సరైన అవగాహన లేదు. చాలా మంది ఆయనను తేలికగా తీసుకున్నారు. రేవంత్ రెడ్డిలో లోతైన మనిషి ఉన్నాడని, నిర్దిష్టమైన ప్రణాళికతోనే ఆయన అడుగులు వేస్తారని అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు. నెల రోజులుగా ముఖ్యమంత్రిగా రేవంత్ వ్యవహార శైలిని గమనిస్తున్న వారు ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు. రేవంత్ రెడ్డిపై మా అభిప్రాయం సరైంది కాదని ఈ నెల రోజుల్లో తెలుసుకున్నామని ఇప్పుడు వారంతా వ్యాఖ్యానిస్తున్నారు. ఒకటి రెండు సందర్భాలలో తొందరపాటు నిర్ణయాలు ప్రకటించడం మినహా మిగతా విషయాలలో ఆయన పరిణతి ప్రదర్శిస్తున్నారు. అధికారుల నియామకాల నుంచి ప్రభుత్వపరంగా సమీక్షల వరకు... రేవంత్ రెడ్డి అనుభవం ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. నెల రోజులుగా ఆయన పనితీరును గమనించాక రేవంత్ రెడ్డిలో ఒక చంద్రబాబు, ఒక రాజశేఖర రెడ్డి ఉన్నారని చెప్పవచ్చు. చంద్రబాబు వలె కష్టపడుతున్నారు, రాజశేఖర రెడ్డిలా కలుపుగోలుగా ఉంటున్నారు. ప్రస్తుతానికి ఆయన ప్రభుత్వాన్ని సాఫీగా నడపగలుగుతున్నప్పటికీ ఇకపై అసలైన సవాళ్లు ఎదురు కానున్నాయి. బొటాబొటి మెజారిటీతో అధికారంలోకి వచ్చినందున రేవంత్ ప్రభుత్వానికి ఇంకా సుస్థిరత ఏర్పడలేదు. లోక్‌సభ ఎన్నికల గండం దాటితేగానీ ఆయన రాజకీయంగా కుదురుకోలేని పరిస్థితి! లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను సాధించలేని పక్షంలో రేవంత్ రెడ్డి ఇబ్బందుల్లో పడతారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది సీనియర్లు ఇప్పటికీ ఆయనను ముఖ్యమంత్రిగా మనస్ఫూర్తిగా అంగీకరించలేకపోతున్నారు. రేవంత్ కింద పనిచేయడానికి ఒకరిద్దరు ఇప్పటికీ మానసికంగా సిద్ధపడలేకపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరవలసిందిగా ఒకరిద్దరు మాజీ ఎంపీల వద్ద కొందరు ప్రతిపాదించగా, రేవంత్ దగ్గర పనిచేయాలా? అని చులకనగా వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి అందరికీ తెలిసిన రేవంత్ రెడ్డిలా కాకుండా అందరినీ కలుపుకొనిపోయే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమైన సమావేశాలకు సీనియర్ మంత్రులను ఆహ్వానిస్తున్నారు. పార్టీలో, ప్రభుత్వంలో విభేదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'ఫార్మాసిటీ రద్దు చేస్తాం' వంటి ఒకటీ రెండు తొందరపాటు ప్రకటనలు మినహా మిగతా వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ నెల రోజులలో రేవంత్ రెడ్డి మంచి మార్కులే సాధించారు. ఆయనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారు కూడా ఇప్పుడు తమ అభిప్రాయం మార్చుకుంటున్నారు. అయితే భవిష్యత్తులో కూడా ఆయన పాలన ఇలాగే సాఫీగా సాగుతుందని చెప్పలేం. లోక్‌సభ ఎన్నికలే కాదు– ఆరు గ్యారంటీల అమలు వంటివి రేవంత్ సామర్థ్యానికి పరీక్షగా ఉండబోతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఖజానా ఖాళీ చేశారని ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారు. అయితే, ప్రజలు ప్రభుత్వ ఆర్థిక కష్టాలను పట్టించుకోరు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ఎదురు తిరుగుతారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. లోక్‌సభ ఎన్నికల నాటికి గ్రేటర్ వాసులలో ఫీల్ గుడ్ భావన కల్పించాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపై ఉంది. అదే సమయంలో రాజకీయంగా సుస్థిరత సాధించవలసి ఉంది. కేంద్రంలో ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారన్న అభిప్రాయం బలంగా ఉన్నందున లోక్‌సభ ఎన్నికల తర్వాత రేవంత్ ప్రభుత్వానికి కేంద్ర సహకారం ఏ మేరకు ఉంటుందో తెలియదు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు భిన్నంగా రేవంత్ రెడ్డి కేంద్రంతో సఖ్యతగా ఉండే ప్రయత్నం మొదలు పెట్టారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలుసుకొని రాష్ట్రానికి సహాయ సహకారాలను అర్థించారు. అయితే, కాంగ్రెస్ పొడ గిట్టని నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానమంత్రి అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కుదురుగా ఉండనిస్తారో లేదో తెలియదు. సొంత పార్టీలో కూడా పట్టు సాధించవలసిన అవసరం ముఖ్యమంత్రికి ఉంది. ప్రస్తుతానికి 39 మంది సభ్యుల బలంతో శాసనసభలో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్–బీజేపీ చేతులు కలిపితే కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లు సాధించిపెట్టడం రేవంత్ రెడ్డికి అతి పెద్ద సవాల్ అవుతుంది. ఈ సవాల్‌ను అధిగమించగలిగితేనే తానేమిటో రుజువు చేసుకొనే అవకాశం ఆయనకు లభిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో జలగం వెంగళ రావు, చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు, చంద్రబాబు, రాజశేఖర రెడ్డి వంటివారు ముఖ్యమంత్రులుగా తమదైన ముద్ర వేశారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ కూడా బలమైన ముద్ర వేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి తనదైన ముద్ర వేయగలిగితేనే ఆయనకు సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. ఇటు ప్రజల్లో, అటు కాంగ్రెస్ కార్యకర్తల్లో తన నాయకత్వం పట్ల విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రిపై ఉంది. ముఖ్యమంత్రిగా కూడా రేవంత్ రెడ్డి ఆర్భాటాలకు పోకుండా సాదాసీదాగానే ఉంటున్నారు. ఆహార్యంలో కూడా ఎటువంటి మార్పు లేకుండా సింపుల్‌గా ఉండటానికే ఇష్టపడుతున్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అండదండలు పుష్కలంగా ఉన్నందున పార్టీపరంగా ఇబ్బందులు ఎదురు కాకపోవచ్చునుగానీ ఎమ్మెల్యేలను సంతృప్తి పరుస్తూ ఉండటమే ప్రధాన సమస్యగా ఉంటుంది. ఫిరాయింపులను ప్రోత్సహించే పక్షంలో కాంగ్రెస్‌లో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించి, ఆరు గ్యారంటీలను సజావుగా అమలు చేయగలిగితే రేవంత్ రెడ్డి నాయకుడిగా బలపడిపోతారు. అనూహ్యంగా ముఖ్యమంత్రి పదవిని అందుకోగలిగిన రేవంత్ ఈ లక్ష్యాలను సాధించలేకపోతారా? వేచి చూద్దాం!

> బీజేపీతో పొత్తు అనేది బీఆర్ఎస్‌కు ఆత్మహత్యాసదృశం అవుతుందా? లేక బతికి బట్టకట్టడానికి ఉపయోగపడుతుందా? అంటే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించడంకోసమే జాతీయ రాజకీయాలలోకి వెళుతున్నానని ప్రకటించిన కేసీఆర్... తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చారు. కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఏం చేయాలనుకుంటున్నారో కూడా చెప్పుకొన్నారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన వారిని ఆకర్షించడానికి డబ్బు పంచిపెట్టారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించి కొంతమంది ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించారు. దీంతో తెలంగాణకు చెందిన ఆ పార్టీ నాయకులు భ్రమల్లోకి వెళ్లారు. కేటీఆర్, హరీశ్ రావు వంటివారు మాత్రం అప్పుడు కూడా బీఆర్ఎస్ ఏర్పాటును, జాతీయ రాజకీయాల ఆలోచనను వ్యతిరేకించారు. అయితే కేసీఆర్‌ను ఎదిరించే సాహసం చేయలేక అప్పట్లో వారు కూడా వంత పాడారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు.

ఆదాయంలో పేద, ఎన్నికల ఖర్చులో సంపన్నం!

> మన తలసరి ఆదాయం పేద దేశాల స్థాయిలో ఉంటే, ఓట్ల కొనుగోలు ఖర్చు మాత్రం సంపన్న దేశాలను మించి ఉంటోంది. ఆ ఖర్చంతా అనివార్యంగా లెక్కలుచూపని నగదు రూపంలోనే జరుగుతోంది. మన ఎన్నికల రాజకీయ వ్యవస్థలో మనుగడకి చట్టవిరుద్ధమైన ఈ వ్యయం సర్వసాధారణ వ్యవహారంగా మారింది. తత్ఫలితంగా ప్రభుత్వ వ్యవస్థలోనూ, విశాల సమాజంలోనూ అవినీతి పెరిగిపోతోంది.



జార్ఖండ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు సంబంధించిన ఆస్తులపై ఇటీవల ఆదాయ పన్ను శాఖ చేసిన దాడుల్లో కళ్లు చెదిరే స్థాయిలో నోట్ల కట్టలు పట్టుబడ్డాయి. రూ.350కోట్లు దొరికినట్లు సమాచారం. టీవీ ఛానెళ్లలో యథావిధిగా పార్టీల మధ్య పరస్పర ఆరోపణల యుద్ధం జరిగింది. రాజకీయ ఎదురుదాడుల్ని అలా ఉంచితే, భారత దేశంలో ఎన్నికలకు, లెక్కచెప్పని వేల కోట్ల రూపాయల నగదుకు మధ్య విడదీయలేని బంధం ఉందనేది జగమెరిగిన సంగతి.

ఇటీవల నిర్వహించిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల్లో అత్యధికులు సగటున రూ.25–30 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా. బరిలో ఉన్న మూడు ప్రధాన పార్టీల ఖర్చునూ లెక్కేస్తే, మొత్తం నియోజకవర్గ స్థాయి ఎన్నికల ఖర్చు సుమారు రూ.10,000కోట్లు. 17 లోక్‌సభ స్థానాలున్న ఒక చిన్న రాష్ట్రంలో ఇది దిగ్భ్రాంతి కలిగించే మొత్తం. దీంతోపాటు, ప్రకటనలు, స్టార్ నేతల ప్రచారానికి ప్రధాన పార్టీలు బోలెడు డబ్బు వెచ్చించాయి.

చట్టబద్ధ కార్యకలాపాలకి పార్టీలకు డబ్బు అవసరం. కానీ నిజమైన సమస్య, ఎన్నికల ప్రచారాలకి, పార్టీని సంస్థాగతంగా నడపటానికయ్యే చట్టబద్ధ ఖర్చు కాదు. మన రాజకీయ ప్రక్రియలో చట్టవిరుద్ధ నిధుల సమీకరణకు అంతం లేదు. చాలా రాష్ట్రాల్లో ఎన్నికల్లో చేసే ఖర్చులో చాలా మేర డబ్బుతో, బహుమతులు, మద్యం వంటి ఇతర ప్రలోభాలతో ఓటరుకు లంచం ఇవ్వటానికే అవుతోంది. కేరళ మినహాయించి అన్ని దక్షిణాది రాష్ట్రాలలో చట్టవిరుద్ధమైన, లెక్కలు చెప్పని భారీస్థాయి వ్యయం నియమంలా మారింది. మిగిలిన చాలా రాష్ట్రాల్లోకి కూడా ఈ తీరు వ్యాపిస్తోంది. ఓటరును ప్రలోభపెట్టటం ఉన్నకొద్దీ సర్వసాధారణమవుతోంది. దీనర్థం, డబ్బుతో మీరు ఓటర్లని కొనగలరని కాదు; బరిలో ఉన్నట్లు, పోటీలో పరిగణనలోకి తీసుకోదగిన అభ్యర్థిగా అనిపించుకునేందుకు భరోసాకి మాత్రమే ఓటర్లకు డబ్బు పంపిణీ పనికొస్తుంది. ఇంకా చెప్పాలంటే, ఎన్నికల్లో పోటీకి డబ్బు పంపిణీ ప్రవేశ రుసుములా తయారైంది. ఓటర్లపై చేసే భారీ ఖర్చు గెలుపుకి గ్యారంటీ కాదు; కానీ ఖర్చు పెట్టకపోతే ఓటమి మాత్రం దాదాపు గ్యారంటీ. ఈశాన్య రాష్ట్రాల, జమ్మూ కశ్మీర్ ఓటర్లు కూడా ఎన్నికల సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు ఆశిస్తున్నారు.

ఓట్ల కొనుగోలు చట్టవిరుద్ధం, ఓటర్లకు లంచమిచ్చే అభ్యర్థి, పార్టీ కార్యకర్తలు, ఆ డబ్బు తీసుకునే ఓటర్లు కూడా నేరానికి పాల్పడుతున్నట్లు లెక్క. కానీ పాతుకుపోయిన రాజకీయ సంస్కృతిలో అది భాగమైనప్పుడు చట్టం, ప్రాసిక్యూషన్ ద్వారా నియంత్రించటం అసాధ్యం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో, చాలా రాష్ట్రాల్లోని ప్రధాన పోటీదారులు సుమారు లక్ష మందిదాకా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తారు. బరిలో ఉన్న బలమైన, గెలిచే అవకాశాలున్న ఇద్దరు లేదా ముగ్గురు అభ్యర్థుల నుంచి ఓటర్లు డబ్బు తీసుకుంటారు. వారిలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తారు. మిగిలిన అభ్యర్థులకు గెలిచే అవకాశమే లేదు, ఏవో కొన్ని అరుదైన సందర్భాలు మినహాయిస్తే. దీంతో, చట్టవిరుద్ధంగా ఎన్ని కోట్లు ఖర్చు పెట్టే సామర్థ్యం ఉంది అన్నదే ఎన్నికల్లో పోటీ కోసం వచ్చిన అభ్యర్థుల్లో పార్టీలు వెతికే మొదటి అర్హత అవుతోంది. ఆ ఖర్చుకు సిద్ధపడితేనే టికెట్లిస్తున్నాయి. అందుకే టికెట్ అనగానే చాలా సందర్భాల్లో వెంటనే అడిగే ప్రశ్న, 'ఎంత ఖర్చు పెట్టగలరు?'. మన తలసరి ఆదాయం పేద దేశాల స్థాయిలో ఉంటే, ఓట్ల కొనుగోలు ఖర్చు మాత్రం చాలా రాష్ట్రాల్లో సంపన్న దేశాలను మించి ఉంటోంది. ఆ ఖర్చంతా అనివార్యంగా లెక్కలుచూపని నగదు రూపంలోనే జరుగుతుంటుంది, నల్లధనాన్ని, అవినీతిని పెంచుతుంటుంది. ఎన్నికవటానికి రూ.25–30 కోట్లు ఖర్చు చేసే అభ్యర్థి ఆ ఎన్నిక ఖర్చుతో పాటు, రాజకీయంగా ఒక స్థాయికి రావటానికి అంతకు ముందు చేసిన ఖర్చుని, గతంలో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే అప్పుడైన ఖర్చుని కూడా తిరిగి రాబట్టుకోవాలి, వచ్చే ఎన్నికలో అవసరమైన నిధుల్ని కూడబెట్టాలి. మరి వ్యక్తిగతంగా కూడా వెనకేసుకోవాలి కదా. అందుకోసం అదనంగా కాస్త పెద్ద మొత్తంలోనే సంపాదన. వెరసి, చట్టవిరుద్ధమైన, లెక్కలు చూపెట్టని ఎన్నికల వ్యయం మన ఎన్నికల రాజకీయ వ్యవస్థలో మనుగడకి సర్వసాధారణంగా మారి, అవినీతిని అయిదు నుంచి పది రెట్లు పెంచుతోంది. ఎన్నికవటానికి ఒక పేద దేశంలో అంత భారీ మొత్తాల్ని ఖర్చు చేయటం పిచ్చి తప్ప మరోటి కాదు. అదే సమయంలో అధికారం పట్ల లాలసతో ఎన్నికల బరిలో ఎంతైనా ఖర్చు పెట్టి, ఎంత రిస్కయినా తీసుకోవటానికి సిద్ధపడుతున్న అభ్యర్థులు కావలసినంతమంది ఉన్నారు. ఫలితంగా, నిజాయతీ, ప్రజాసేవ పట్ల మమకారం ఉన్న పౌరులు మన ఎన్నికల ప్రక్రియలో ఉన్నకొద్దీ ప్రాధాన్యతను కోల్పోతున్నారు. ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు, లేదంటే రాజకీయాల నుంచి గెంటివేయబడుతున్నారు, లేదూ, కాలక్రమంలో రాజీపడుతున్నారు, మనుగడ కోసం ఆటలో భాగమవుతున్నారు. నిజాయితీ, అధికారంలో మనుగడ కలసిసాగటం ఉన్నకొద్దీ అసాధ్యమవుతున్నాయి.

ఒక పౌరుడు వ్యక్తిగతంగా నిజాయతీపరుడు కావచ్చు, మన రాజకీయాల్లో ఇప్పుడు కూడా వ్యక్తిగతంగా నిఖార్సయినవాళ్లు చాలా మంది ఉన్నారు, కానీ ఎన్నికల్లో చట్టవిరుద్ధ ఖర్చు భరించటం కోసం, ఎన్నికల్లో తమ మనుగడని కాపాడుకోవటం కోసం వ్యవస్థీకృత అవినీతిలో వారూ భాగంకాక తప్పదు.

ఓటరుకిచ్చే ప్రలోభాలు, విపరీత ఎన్నికల వ్యయం ఈవేళ ఏ స్థాయికి చేరాయంటే నైతిక విజ్ఞప్తులు, వ్యక్తిగత విలువలతో వాటిని ఎదుర్కోవటం ఇక ఎంత మాత్రం సాధ్యం కాదు. ఇప్పుడది వ్యవస్థీకృత సమస్య. ఓటరుకు ప్రలోభాల్నిచ్చే ధోరణికి పూర్తిగా స్వస్తి చెప్పేందుకు పార్టీలన్నీ నిజాయతీగా ఏకాభిప్రాయానికి రావటం అవసరం. కానీ అది పైకి కనిపిస్తున్నంత తేలిక కాదు. పార్టీలు పరస్పర అపనమ్మకంతో ఉన్నాయి. రాజకీయాల్లో గుర్తింపు కోసం భారీ మొత్తాల్ని వెచ్చించటానికి చాలామంది అభ్యర్థులు సిద్ధంగా ఉన్నప్పుడు, పార్టీల స్వీయనియంత్రణ ఆచరణలో సులభం కాదు. ఇక మిగిలిన పరిష్కారం, ఓట్ల కొనుగోలు వల్ల పెద్ద ఉపయోగంలేదనే రీతిలోకి ఎన్నికల వ్యవస్థను మార్చటం. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్లే, మిగిలిన అభ్యర్థుల ఓట్లన్నీ వృథాయే అనే ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ ఎన్నికల వ్యవస్థ మనలాంటి పేద దేశంలో, అధికార కేంద్రీకరణ, బలహీన చట్టబద్ధపాలన ఉన్న దేశంలో ఓట్ల కొనుగోలుకు పెద్ద ప్రోత్సాహకంగా మారుతుంది. మనం సమష్టిగా ఆత్మావలోకనం చేసుకోవాలి, ప్రోత్సాహకాన్ని మార్చాలి. ధనస్వామ్యం, దోపిడీస్వామ్యం నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటానికి నిజమైన ఎన్నికల సంస్కరణ పద్ధతులపై మనం దృష్టి సారించటం తక్షణావసరం.

• డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

చిన్నారిని చిదిమేశాడు!

పదకొండేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం..ఆపై హత్య?
గిరిజనగ్రామంలో ఘోరం

గూడెంకొత్తవీధి, జనవరి 6: పదకొండేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడగా, ఆదేరోజు ఆమె అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అఘాయిత్యానికి పాల్పడ్డ యువకుడే హత్య చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని ఓ గిరిజన గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తల్లిదండ్రు లు, గ్రామస్థుల కథనం ప్రకారం... జీకే వీధి పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (11) ఐదో తరగతి చదువుతోంది. ఈ నెల రెండో తేదీన ఉదయం ఏడు గంటలకు బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిపోయారు. బాలిక పాఠశాలకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పద్దెనిమిదేళ్ల యువకుడు అడ్డగించి, చేయిపట్టుకుని బలవంతంగా ఖాళీ గా ఉన్న పక్క ఇంట్లోకి లాక్కువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికను లాక్కెళ్లడం, ఆమె అరవడం సమీప గృహాలకు చెందిన పదేళ్లలోపు పిల్లలు చూశారు. ఎవరికైనా చెబితే చంపేస్తానని యువకుడు వారిని బెదిరించాడు. అదేరోజు సుమారు ఎనిమిది గంటలకు బాలిక తన ఇంటి వరండాలో దూలానికి చున్నీతో ఉరి వేసుకుని ఉంది. పక్కింటికి చెందిన యువతి చూసి కిందకు దించి, బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. బాలిక అప్పటికే మృతి చెందినట్టు స్థానికులు గుర్తించారు. మరుసటిరోజు సమాధి చేసే సమయంలో రక్తస్రావం జరిగినట్టు గుర్తించారు. దీంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. బాలికపై అత్యాచారం జరిగి ఉంటుందని భావించారు. అదే సమయంలో అక్కడి పిల్లలు బాలికను యువకుడు లాక్కువెళ్లిన విషయం తెలియజేశారు. గ్రామం లో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి యువకుడిని ప్రశ్నించగా తాను అత్యాచారం చేశానని, బాలికను హత్య చేయలేదని, ఆమే ఉరి వేసుకుని ఉంటుందని చెప్పాడు. యువకుడే అత్యాచారం చేసి హత్య చేసి ఉంటాడని తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే గ్రామ పెద్దలు బాలిక తల్లిదండ్రులకు నచ్చచెప్పి మూడో తేదీ న గ్రామ శివారులో సమాధి చేయించారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని బాలిక తల్లిదండ్రులు ఈనెల ఐదో తేదీ సాయంత్రం జీకే వీధి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం పోలీసులు గ్రామానికి వెళ్లి బాలిక మృతదేహాన్ని వెలికితీసి, చింతపల్లి వైద్యాధికారితో పోస్టుమార్టం చేయించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడు పరారీలో ఉన్నాడు. ప్రాథమిక సమాచారం మేరకు బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసినట్టుగా భావిస్తున్నామని చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక రావలసి ఉందన్నారు.


వీర్రాజు

పింఛన్ కోసం వెళితే ప్రాణమే పోయింది!

పంపిణీ సభనుంచి వస్తూ కుప్పకూలిన వృద్ధుడు

చాగల్లు, జనవరి 6 : పింఛను తెచ్చుకోవడానికి వెళ్లిన ఓ వృద్ధుడు నిర్జీవంగా ఇంటికి తిరిగివచ్చాడు. తూర్పుగోదావరి జి ల్లా చాగల్లులో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పిం ఛను రూ.3వేలకు పెంచిన కారణంగా ప్రత్యేక సభలు నిర్వహించి అందించే కార్యక్రమం వైసీపీ ప్రభుత్వం చేస్తోంది. అం దులో భాగంగా స్థానిక తెలగా సంఘం వారి వినాయకుడి గు డి ప్రాంగణంలో కొత్తగా పింఛన్‌లు మంజూరైనవారు, పింఛన్ పెరిగిన వారికి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇమ్మణ్ణి వీర్రాజు (73) పింఛన్ తీసుకోవడానికి సభకు వచ్చి ముగిసిన తరువాత ఇంటికి వెళుతూ డైలీ మార్కెట్ సెంటర్‌లో కుప్పకూలిపోయాడు. మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ ప్రత్యేక వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. వృద్ధుడు కావడంతో అధిక సమయం సమావేశంలో ఉండిపోవడం వల్ల తిరు గు ప్రయాణంలో కుప్పకూలిపోయాడని పలువురు అంటున్నారు.

జాతి సంస్కృతికి భాష గొంతుక

- తెలుగును బతికించుకోవాలి
- మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'భాష ఒక జాతి సంస్కృతికి గొంతుక..అలాంటి గొంతుకను నులిమేయొద్దు..సజీవంగా ఉంచాలి. తెలుగు భాషను బతికించుకోవడం, వ్యాప్తి చేయడం అందరూ బాధ్యతగా స్వీకరించి తెలుగుభాషా వికాసానికి కృషి చేయాలి' అని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల రెండో రోజు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇవాళ కొన్ని పరిస్థితులు చూస్తుంటే కొన్నాళ్లకు తెలుగుభాష బలహీన పడుతుందేమో అనే భయం కలుగుతోందన్నారు. తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి సుందర్ తెలుగు అని, దేశభాలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు...ఇలా తెలుగు భాషను చాలా మంది అనేక విధాలుగా కొనియాడారు. ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్ అనే నానుడు ఎంతో కాలంగా ఉంది. తెలుగు భాష ప్రాచీన హోదా కలిగినది' అని హరిబాబు పేర్కొన్నారు. 2024వ సంవత్సరం తెలుగు ప్రజలకు మంచి ఉన్నతిని ఇవ్వాలని ఆకాంక్షించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మనభాషలో ఉన్న సాహిత్యం, అవధానం, పద్యం ఏ భాషలోనూ లేవని.. మన రచనలను విశ్వవ్యాప్తం చేయాలని అన్నారు. సాహిత్య దిగుమతి ఎక్కువైందని.. ఎగుమతి చేయాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. తెలుగు తోరణం సాంస్కృతిక కార్యక్రమం అనంతరం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ జాతి విలువలు పెంచేందుకు పునరంకితం కావాలన్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ ఇవాళ ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందన్నారు. తెలుగు విద్యార్థులు నాలెడ్జ్ ప్రొడ్యూసర్స్‌గా ఉండాలని, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మిజోరం గవర్నర్ కంభంపాటి


తెలుగు తోరణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అలరించిన తెలుగు తోరణం

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 6: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలల ప్రాంగణంలో గైట్ విద్యార్థులు శనివారం రాత్రి ప్రదర్శించిన తెలుగు తోరణం నృత్యం రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యార్థులు చేసిన అద్భుతమైన ప్రదర్శనలు అందరినీ మంత్ర ముగ్ధులను చేశాయి. తెలుగు జాతి ఔన్నత్యం, తెలుగు వారి గొప్పతనాన్ని చాటిచెబుతూ మహనీయులందరినీ స్మరిస్తూ తెలుగు తోరణం నృత్య ప్రదర్శన సాగింది. సినీ రచయిత రసరాజు రచించిన ఈ నృత్య రూపకానికి ఘంటసాల పవన్‌కుమార్ నృత్య దర్శకత్వం వహించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ ప్రదర్శనకు గజల్ శ్రీనివాస్ గానం, సంగీతం అందించడంతో పాటు దర్శకత్వం వహించారు.

నేడు పశ్చిమ గోదావరిలో 'రా...కదలిరా'

- ఆచంట బహిరంగ సభకు చంద్రబాబు

భీమవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఆచంటలో నిర్వహించే 'రా..కదలిరా' బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభం కానుంది. హెలీకాప్టర్‌లో చంద్రబాబు ఆచంట చేరుకుంటారు. హెలీప్యాడ్‌నుంచి ర్యాలీగా సభావేదిక వద్దకు వెళతారు. సాయంత్రం 6.30 గంటలకు సభ ముగియనుంది. ఆ తర్వాత రోడ్డుమార్గంలో రాజమండ్రి చేరుకుంటారు. విమానంలో హైదరాబాద్ వెళ్లనున్నారు.

విదేశాల్లో చదవాలా.. ఈ పరీక్షలు రాయండి

దిక్సూచి DIKSUCHI



విదేశాల్లో చదువుకోవాలంటే కేవలం అకడమిక్ అర్హతలు ఉంటే సరిపోదు. చదివే కోర్సును బట్టి కొన్ని, కామన్‌గా మరికొన్ని ఎంట్రెన్స్ టెస్టులు ఉంటాయి. ఆ టెస్టులతో అవసరం లేదని చెప్పే విదేశీ వర్సిటీలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ వీటిని రాయడమే మేలు. వీటిలో సాధించిన స్కోర్‌తో పెట్టుకునే దరఖాస్తు పటిష్ఠంగా ఉంటుంది. అంతేకాదు, కాలేజీ క్రెడిట్స్ లభిస్తాయి. స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించేందుకు కూడా దోహదపడతాయి. అవేంటంటే....

భారత దేశానికి వెలుపల అంటే మొదట రాయాల్సింది ఇంగ్లీష్ టెస్ట్. ఈ టెస్టులో సాధారణంగా నాలుగు మాడ్యూల్స్ - లిజనింగ్, రీడింగ్, రైటింగ్, స్పీకింగ్ ఉంటాయి. ఈ టెస్టులు అభ్యర్థికి ఇంగ్లీష్‌లో ఉన్న ప్రావీణ్యాన్ని పరీక్షిస్తాయి. ఇంగ్లీష్ మాట్లాడే దేశాల్లో చదివేందుకు ఈ టెస్టులు ఉపయోగపడతాయి. ఐఈఎల్‌టీఎస్ అకడమిక్, ఐఈఎల్‌టీఎస్ యూకేవీఐ, టీఓఈఎఫ్ఎల్ ఐబీటీ, డీయూఓ ఎల్ఐఎన్‌జీఓ, పీయర్సన్ ఈ ఇంగ్లీష్ టెస్టుల్లో ముఖ్యమైనవని చెప్పవచ్చు.చాలా దేశాలు ఈ టెస్టుల్లో సాధించిన స్కోర్‌ను ఆమోదిస్తాయి. అయితే బ్రిటన్‌లో మాత్రం ఐఈఎల్‌టీఎస్‌లో సాధించిన మార్కులకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్

- **ఎల్ఎన్ఏటి:** యూకేలో లా కోర్సు చేసేందుకు www.lnat.ac.uk ఈ టెస్ట్ రాయాలి. యూకె వర్సిటీల కన్సార్టియం దీన్ని డెవలప్ చేసింది. యూజీ స్థాయిలో లా చదివేందుకు అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను పరీక్షిస్తుంది. అభ్యర్థి ఆప్టిట్యూడ్, వెర్బల్ రీజనింగ్, కాంప్రహెన్షన్, ఇంట్రప్రెటేషన్, అనాల్సిస్, సింథసిస్, ఇండక్షన్, డిడక్షన్ టెస్టులో భాగం.
- **ఎల్ఎస్ఏటీ:** అమెరికా, కెనడా దేశాల్లో లా చేసేందుకు ఈ టెస్ట్ www.lsac.org/lsat అవసరం. ఇదో ప్రామాణికమైన లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్. అభ్యర్థి లాజికల్, వెర్బల్ రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తుంది.
- **ఎస్ఏటీ, ఎస్ఏటీ సబ్జెక్టు టెస్టులు:** అమెరికా, కెనడా, సింగపూర్‌లో చదువులకు www.collegeboard. ఎస్ఏటీ ఉపయోగపడుతుంది. వెర్బల్, మేథమెటికల్, రైటింగ్ నైపుణ్యాలను ఈ టెస్ట్‌లో పరీక్షిస్తారు. ప్రత్యేకించి ఒక సబ్జెక్ట్ ఏరియాలో ప్రావీణ్యాన్ని తెలియజెప్పేవి ఎస్ఏటీ సబ్జెక్టు టెస్టులు.
- **ఏపీ టెస్ట్స్ ఫర్ యుఎస్:** కాలేజీ క్రెడిట్స్ సాధించేందుకు దారితీసే అడ్వాన్స్‌డ్ ప్లేస్‌మెంట్స్ ఎగ్జామ్స్ www.collegeboard.com ఇవి.
- ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జికి కూడా సొంతంగా ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ www.admissiontesting.org ఉన్నాయి. యూక్యాట్(గతంలో యుకెక్యాట్ అనేవారు) ప్రత్యేకించి యూకేలో మెడికల్ స్కూల్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష. యూకేలో బయో మెడికల్ సైన్సెస్‌లో చేరేందుకు బీఎంఏటీ, మేథమెటిక్స్ అలాగే ఎకనామిక్స్‌లో చేరేందుకు టీఎంయూఏ ఇప్పటి వరకు అవసరం. ఈ ఏడాది వీటిని తీసేయవచ్చు.

టెస్ట్స్ ఫర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్

- అమెరికా, కెనడా, యూరప్, సింగపూర్‌లో ఇంజనీరింగ్, సైన్స్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన టెస్ట్ జీఆర్ఈ. గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్‌గా దీనికి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. వెర్బల్, క్వాంటిటేటివ్, అనలిటికల్ రైటింగ్ స్కిల్స్‌ను ఇందులో పరీక్షిస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరేందుకు జీమ్యాట్ www.mba.com రాయాలి. గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ కాగా కంప్యూటర్ అడాప్టివ్ టెస్ట్ ఇది. రీజనింగ్, క్రిటికల్ థింకింగ్, అనలిటికల్, క్వాంటిటేటివ్, వెర్బల్ స్కిల్స్‌ను ఈ టెస్టులో పరీక్షిస్తారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లోని విద్యాసంస్థల్లో ఎంబీఏ చేసేందుకు ఈ టెస్ట్‌లో తెచ్చుకున్న స్కోర్ ప్రాతిపదిక అవుతుంది.
- జీఏఎంఎస్ఏటీ - యూకే, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, సింగపూర్, ఐర్లాండ్‌లో గ్రాడ్యుయేట్ మెడికల్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు www.gamsat.acer.org ఈ టెస్ట్ రాయాలి. ఇది కూడా కంప్యూటర్ ఆధారిత ప్రామాణిక పరీక్ష. మెడిసిన్, డెంటిస్ట్రీ, ఆప్టోమెట్రీ, ఫార్మసీ, వెటర్నరీ సైన్సెస్‌లో చేరేందుకు దీన్ని ఉద్దేశించారు.
- ఎంక్యాట్ మరో టెస్ట్. యుఎస్, కెనడాలో మెడికల్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు దీన్ని www.aamc.org నిర్వహిస్తున్నారు.ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రాబ్లెమ్ - సాల్వింగ్, క్రిటికల్ థిం కింగ్, రిటెన్ అనాల్సిస్, సైంటిఫిక్ ప్రిన్సిపల్స్ అలా గే కాన్సెప్ట్‌పై పరిజ్ఞానాన్ని ఈ టెస్ట్‌లో పరీక్షిస్తారు.

విశాఖ ఐఐఎంలో పీజీపీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఎంబీఏ డిగ్రీకి సమానం. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 340 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటింగ్, కంపెనీ సెక్రటరీషిప్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 8 నుంచి 30 వరకు
- **అడ్మిషన్స్:** మే 20
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూన్ 24
- **వెబ్‌సైట్:** iimv.ac.in

నేషనల్ లా స్కూల్‌లో పీజీ, పీహెచ్‌డీ

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ) - ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఎంపీపీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అడ్మిషన్ టెస్ట్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఎల్ఎల్‌బీ ఆనర్స్

ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీని వ్యవధి మూడేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది ట్రైమెస్టర్లు ఉంటాయి. ఏడాదికి 48 చొప్పున మొత్తం 144 క్రెడిట్స్ సాధించాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎల్ఎస్ఏటీ-ఎల్ఎల్‌బీ) 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 డిసెంబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ (ఎంపీపీ)

ఇది రెండేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో పబ్లిక్ పాలసీ, ఎకనామిక్స్, లా, సోషియాలజీ, ఫైనాన్స్, ఇండియన్ సొసైటీ, పొలిటికల్ ఎకానమీ అంశాలు ప్రధానంగా ఉంటాయి.

పీహెచ్‌డీ

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. లా, ఇంటర్‌డిసిప్లినరీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 4 చొప్పున మొత్తం 8 సీట్లు ఉన్నాయి. సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ పీహెచ్‌డీ(ఎన్ఎల్ఎస్ఏటీ-పీహెచ్‌డీ)2024, రీసెర్చ్ ప్రపోజల్, ఓరల్ ప్రజంటేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ఎన్ఎల్ఎస్ఏటీ 2024 తేదీ:** మార్చి 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nls.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oRGAhebలో చదవండి.

19 నుంచి హైదరాబాద్ ఐఐటీలో
ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ ఫెయిర్

హైదరాబాద్ ఐఐటీలో ఈ నెల 19, 20 తేదీల్లో ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ ఫెయిర్‌ని నిర్వహిస్తున్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీన్ని ప్రారంభిస్తారు. దేశంలోని ఐఐటీలకు తోడు ఎన్ఐటి, ఐఐఎస్ఈఆర్, ఐఐఎస్సీ బెంగుళూరు అలాగే 50 వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలు ఈ ఫెయిర్‌లో పాల్గొననున్నాయి. ఇండస్ట్రీ నుంచి రెండు వేలమంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ ప్రాతిపదికగా ఈ ఫెయిర్ ఉంటుంది.

వెబ్‌సైట్స్: https://www.iith.ac.in/, https://www.iith.ac.in/.

ఐఐఎఫ్ఎంలో పీజీ డిప్లొమాలు

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్(ఐఐఎఫ్ఎం) - పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్(పీజీడీఎఫ్ఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్(పీజీడీఎస్ఎం) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. పీజీడీఎఫ్ఎంలో 150 సీట్లు, పీజీడీఎస్ఎంలో 75 సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఇంటర్వ్యూ కేంద్రాలు:** అహ్మదాబాద్, భోపాల్, ఢిల్లీ, గువహటి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.iifm.ac.in

ఇక రాజులమ్మ జాతరే



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. 'తండేల్' కథను క్లుప్తంగా పరిచయం చేస్తూ శనివారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను వదిలింది. మత్స్యకార పాత్రలో నాగచైతన్య కనిపించనున్నారు. 'ఈ పాలి యేట..గురి తప్పేదేలేదేస్... ఇక రాజులమ్మ జాతరే' అంటూ ఆయన శ్రీకాకుళం యాసలో పలికిన మాస్ డైలాగ్‌తో వీడియో మొదలైంది. చేపలు పడుతూ పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించడం, అక్కడి సైన్యం వారిని కరాచీ సెంట్రల్ జైలులో ఖైదు చేసి చిత్రహింసలు పెట్టడం సినిమాపై ఆసక్తిని పెంచాయి. నాగచైతన్య ప్రేయసి బుజ్జి తల్లిగా సాయిపల్లవి కనిపించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

మారేడుమిల్లిలో యాక్షన్



వరుస విజయాలతో దూసుకుపోతున్నారు నందమూరి బాలకృష్ణ. ఇప్పటికే అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్‌కేసరి చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన బాలయ్య సిక్సర్‌పై కన్నేశారు. ఆ ప్రయత్నంలో భాగంగా కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఎస్.నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ మారేడుమిల్లి ఫారెస్ట్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణ, ప్రధాన తారాగణంపై యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు బాబీ చిత్రీకరిస్తున్నారు. సీనియర్ నటి ఊర్వశి కూడా షూటింగ్‌లో భాగమయ్యారు. మరో రెండు మూడు రోజుల్లో ఈ షెడ్యూల్ పూర్తి కానున్నట్టు మేకర్స్ తెలిపారు. బాలకృష్ణ కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను ఇందులో చేస్తున్నారని, కథ, కథనం, సినేరియా కొత్తగా ఉంటుందని, అభిమానులు పండుగ చేసుకునేలా బాలకృష్ణ కేరక్టరైజేషన్ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. బాబీడియోల్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ మీనన్ కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

ప్రేక్షకులకు చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి

- విజయ్ బిన్ని



'తొలి సినిమాలోనే నాగార్జున గారి లాంటి పెద్దస్టార్‌ని డైరెక్ట్ చేయడం నా అదృష్టం. 1980ల్లో సాగే కథ కావడంతో 'నా సామిరంగ' చిత్రంలో ఆయన్ను డిఫరెంట్‌గా, కొత్తగా చూపించబోతున్నాం. అభిమానులకు పాత చిత్రాల్లో నాగార్జున గుర్తుకొస్తారు' అని దర్శకుడు విజయ్ బిన్ని చెప్పారు. శ్రీనివాస చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ బిన్ని సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- దర్శకుడు కావాలనే లక్ష్యంతో పరిశ్రమకు వచ్చాను. ఆ విభాగంలో రాణించడానికి ఉపయోగపడుతుందని నృత్య దర్శకుడిగా మారాను. అలా నాగార్జున గారి సినిమాలకు కొరియోగ్రఫీ చేయడం వల్ల ఆయనతో పరిచయం ఏర్పడింది. నాగార్జున గారికి ఒక కథ వినిపించాను. ఆయన 'నా సామిరంగ' సినిమా చేయమని అవకాశం ఇచ్చారు. కథను ఆకళింపు చేసుకొని నాదైన శైలిలో తెరకెక్కించాను. సినిమా అవుట్‌పుట్ పట్ల ఆయన సంతోషంగా ఉన్నారు. నాగార్జున గారి సహకారంతో ఇబ్బందిపడకుండా సజావుగా, వేగంగా చిత్రీకరణ పూర్తి చేశాం.
- స్నేహం, ప్రేమ, భావోద్వేగాల సంఘర్షణ నేపథ్యంలో కథ సాగుతుంది. నాగార్జున గారి స్నేహితుడిగా అల్లరి నరేశ్ కనిపిస్తారు. రాజ్‌తరుణ్‌ది కీలకమైన పాత్ర. మూడు పాత్రల మధ్య ఉన్న సంబంధం, వారికెదురైన సవాళ్లు, వారు ఎలా స్పందించారు అనేది ఆసక్తికరంగా చూపించబోతున్నాం. 'నా సామిరంగ'లో ప్రేక్షకులకు చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయి. అవేంటో తెరపైన చూస్తేనే బాగుంటుంది. కీరవాణి గారు స్వరపరిచిన మూడు పాటలూ సూపర్‌హిట్టయ్యాయి.

నటుడిగా సైంధవ్ సంతృప్తిని ఇచ్చింది

- నవాజుద్దీన్ సిద్దిఖీ



'తెలుగు సినిమా చేయాలని చాలాకాలంగా అనుకుంటున్నాను. సరైన కథ కుదరడంతో 'సైంధవ్'తో అరంగేట్రం చేస్తున్నాను. వెంకటేశ్‌తో పనిచేయడం ఎవరికైనా ఒక డ్రీం. ఆయనతో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అని నవాజుద్దీన్ సిద్దిఖీ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. నవాజుద్దీన్ విలన్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

- కొన్నిసార్లు నెగిటివ్ పాత్రల్లోనే నటనకు ఎక్కువ ఆస్కారముంటుంది. పాత్ర ఆసక్తికరంగా ఉంటే హీరోనా, విలనా అనేది పట్టించుకోను. ఇందులో నా పాత్రను శైలేష్ కొత్త తరహాలో తీర్చిదిద్దారు. నటుడిగా ఈ సినిమా చాలా సంతృప్తిని ఇచ్చింది. నా పాత్రకు ఇతరులు ఎవరో డబ్బింగ్ చెప్పడం నాకు ఇష్టం ఉండదు. భాషను భావాన్ని అర్థం చేసుకొని తెలుగులో డబ్బింగ్ చెప్పాను. ప్రతి డైలాగ్‌ను బాగా సాధన చేశాను. కష్టంతో కూడిన యాక్షన్ సీక్వెన్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. సముద్రంలో బోట్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లు చేస్తున్నప్పుడు భారీ అల వచ్చి నన్ను పైకి లేపింది. పై ప్రాణాలు పైనే పోయాయి. అదృష్టవశాత్తూ మళ్లీ బోట్‌లోనే పడ్డాను.
- సెట్‌లో వెంకటేశ్ చాలా ప్రశాంతంగా ఉంటారు. డైలాగ్స్ బాగా సాధన చేసి షూటింగ్‌కి వస్తారు. రిస్క్‌తో కూడిన యాక్షన్ సీన్స్ చేశారు. ఆయన నుంచి సహనం నేర్చుకోవాలి. వెంకటేశ్‌ను ఈ చిత్రంలో సరికొత్తగా చూడబోతున్నారు. శైలేష్ ప్రొఫెషనల్ డైరెక్టర్. కథకు మెరుగులు అద్దడంలో దిట్ట. కథను చెప్పినంత అద్భుతంగా సినిమాను మలిచాడు. టాలీవుడ్ పరిశ్రమ సమయపాలనకు చాలా ప్రాధాన్యం ఇస్తుంది. ఇక్కడి దర్శకులు, నటులతో పనిచేయాలనుంది. అవకాశం వస్తే ఓషో బయోపిక్ చేయాలనేది నా కోరిక.

వినోదంతో గీతాంజలి వస్తోంది



'నా తొలి హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'గీతాంజలి' ఘన విజయం సాధించింది. ఇప్పుడు 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. సినిమా చాలా బాగుంది. క్లైమాక్స్ ఊహకందని స్థాయిలో ఉంటుంది' అని అంజలి అన్నారు. ఆమె టైటిల్ పాత్రలో నటించిన చిత్రమిది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సత్యనారాయణ నిర్మించారు. కోన వెంకట్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు. శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేశ్, అలీ, సునీల్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం చిత్రబృందం ఈ సినిమాలోని పాత్రల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో గీతాంజలి ముద్దుగా కనిపించినా తను చేసే పనులు భయపెడతాయి. కోన గారు సృష్టించిన కామెడీ ట్రాక్, కథను మలిచిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "గీతాంజలి" సీక్వెల్‌కు అవకాశం ఇచ్చిన కోన వెంకట్ గారికి ధన్యవాదాలు. అంజలి, శ్రీనివాస్‌రెడ్డి సహకారం మరిచిపోలేను' అని తెలిపారు. కోన వెంకట్ మాట్లాడుతూ 'కమర్షియల్ సినిమాలకు భిన్నంగా వెళ్లాలనే కోరికతో 'గీతాంజలి' తీశాం. సీక్వెల్ ప్రేక్షకులు అంచనాలకు మించి ఆస్వాదించేలా ఉంటుంది. సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. నవ్విస్తూ, భయపెడుతూ వినోదం పంచే చిత్రమిదని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

రొమాంటిక్ ఎంటర్టైనర్




నారా రోహిత్ కథానాయకుడిగా నూతన చిత్రం ప్రారంభమైంది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. 'నారా రోహిత్ 20' వర్కింగ్ టైటిల్. శనివారం చిత్రీకరణ ప్రారంభమైంది. తొలిషాట్‌కు సినిమాటోగ్రాఫర్ ప్రదీష్ ఎం వర్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. గౌతమ్‌రెడ్డి క్లాప్ ఇచ్చారు. విజయ్ కృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వీర్తి వాఘని కథానాయిక. శ్రీదేవి విజయ్‌కుమార్, వీకే నరేశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. లియోన్‌జేమ్స్ సంగీతం అందిస్తున్నారు.

థ్రిల్లింగ్ అంశాలతో ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ తొలిసారి దర్శకత్వం వహిస్తున్నారు. లావణ్య కథానాయిక. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన చిత్రమిది. విరాన్ కానిస్టేబుల్‌గా నటించాడు. కథ ఆసక్తికరంగా ఉంది. సినిమా సూపర్‌హిట్ అవ్వాలి' అని ఆకాంక్షించారు. విరాన్ మాట్లాడుతూ 'వేణు గారితో పనిచేయడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయనున్నాం' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ అంశాలతో సాగే ఫ్యామిలీ ఎమోషన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కించాం. మంచి కథతో వస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'మా శివిన్ ప్రొడక్షన్‌లో రూపొందుతున్న తొలి చిత్రమిది. ఇప్పటికే విడుదలైన పాటలకు చక్కటి ఆదరణ వచ్చింది' అనిచెప్పారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 7 జనవరి 2024



నేడు విజయవాడలో ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముగ్గుల పోటీలు



విజయవాడ, జనవరి 6 : ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న "కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గు పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఆదివారం జరగనున్నాయి. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆదివారం ఉదయం 10.00 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఎన్టీఆర్ జిల్లాస్థాయిలో జరిగే ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండో బహుమతిగా రూ.4వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు ఇవ్వనున్నారు. మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతి అందజేస్తారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే వారు నిర్ణీత సమయానికన్నా 30 నిమిషాలు ముందుగా (9.30 గంటలకు) పోటీలు జరిగే ప్రాంతానికి చేరుకుని తమ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.



ముగ్గును పరిశీలిస్తున్న వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము

మంత్రముగ్ధులయ్యేలా..

ఆకట్టుకునే రంగవల్లులతో పులకించిన వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల ప్రాంగణం

- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- గుడివాడకు చెందిన పూజితకు ప్రథమ బహుమతి

రంగవల్లులతో వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల పులకించింది. సందేశాత్మకంగా, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు, యువతులు, విద్యార్థినులు రంగుల హరివిల్లులతో సంక్రాంతి శోభను తీసుకొచ్చారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన, లోకల్ పార్టనర్ వెనిగండ్ల ఫౌండేషన్" సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ముగ్గులపోటీలు వైభవోపేతంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు పాల్గొన్నారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేస్తూ రంగులతో ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీలు జరిగే ప్రాంగణంలో చెరకుగడలు, పుష్పాల అలంకరణతో సంక్రాంతి సంప్రదాయాలను గుర్తు చేశారు. న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. - గుడివాడ

- 6లో..

నేడు తిరువూరులో రా కదలిరా!

టీడీపీ అధినేత చంద్రబాబు రాక

- బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలించిన టీడీపీ నేతలు
- పట్టణమంతా పసుపుమయం

- 6లో..



బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

దూకేద్దాం!



వైసీపీ ఎమ్మెల్యేల పక్కచూపులు

- ఇప్పటికే కాంగ్రెస్ దిశగా మల్లాది విష్ణు, రక్షణనిధి అడుగులు
- టీడీపీ దిశగా పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి చూపులు
- 18న గుడివాడ సభలో చేరికకు రంగం సిద్ధం

వైసీపీలో టికెట్ల చిచ్చు ఇప్పట్లో ఆరేలా లేదు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ఇప్పటికే వైసీపీకి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకోగా తాజాగా వారి సరసన పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు కొలుసు పార్థసారథి వైసీపీని వీడాలని నిర్ణయించుకున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 14 శాసనసభ స్థానాల్లో 2019 ఎన్నికల్లో వైసీపీ 12 గెలుచుకుంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు, కృష్ణా జిల్లాలో గన్నవరం నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో గన్నవరం టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ వైసీపీ పంచన చేరారు. 2019లో బలంగా ఉన్న వైసీపీ 2024లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ కకావికలమై బలహీనంగా కనిపిస్తోంది. ఆ పార్టీకి చెందిన 13 మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు పార్టీకి దూరమవుతున్నారు. మిగిలిన వారిలో ఎవరికి టికెట్ దక్కుతుందో ఎవరికి దక్కదో తెలియని పరిస్థితి. టికెట్ అంశంపై స్పష్టత వస్తే మరింత మంది పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

వీరి టికెట్ అనుమానమే..

- ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుకు సిటింగ్ స్థానాలు దక్కవన్న ప్రచారం జరుగుతోంది. వసంతను వేరే స్థానం నుంచి బరిలోకి దింపే యోచనలో వైసీపీ అధిష్ఠానం ఉన్నట్టు తెలుస్తోంది. మొండితోక బ్రదర్స్‌లో జగన్మోహనరావు ఎమ్మెల్యేగా ఉండగా ఆయన సోదరుడు అరుణ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చారు. దీంతో జగన్మోహనరావుకు ఈసారి టికెట్ ఇవ్వకపోవచ్చన్న ప్రచారం జరుగుతోంది.
- కృష్ణా జిల్లాలో పెడన ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేశ్, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌కు సిటింగ్ స్థానాలు దక్కవన్న ప్రచారం ఉంది. జోగి రమేశ్‌కు ఏలూరు ఎంపీ స్థానం ఇవ్వాలని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. జోగి మాత్రం తనకు మైలవరం స్థానం ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. ఏది ఏమైనా పెడన నుంచి జోగి బరిలో ఉండటం అనుమానమే.
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌కు ఈసారి అవకాశం దక్కడం అనుమానమే. ఆయన స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించాలని వైసీపీ పెద్దలు భావిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో వైసీపీ నుంచి మరింత మంది అసంతృప్తి గళాన్ని వినిపించే అవకాశాలు ఉన్నాయి.



నూజివీడు నుంచి పార్థసారథి

పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కె.పార్థసారథి వైసీపీ పెద్దల తీరుతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత సీనియార్టీ రీత్యా తనకు మంత్రి పదవి దక్కుతుందని సారథి భావించారు. కానీ తొలి విడతలో ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. ఆ తర్వాత 2022 ఏప్రిల్‌లో మరోసారి కేబినెట్ విస్తరణ సమయంలో తనకు బెర్తు ఖాయమని ఆయన భావించారు. కానీ అనూహ్యంగా జోగికి అవకాశం కల్పించారు. ఇద్దరమూ బీసీలమే అయినా సీనియార్టీ రీత్యా తనకు అవకాశం కల్పించకుండా తన కన్నా జూనియర్ అయిన జోగికి మంత్రి పదవి ఇవ్వడంపై సారథి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్షనేత చంద్రబాబును టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని బూతులు తిట్టే వారికి మంత్రి పదవుల్లో ప్రాధాన్యమిచ్చారే తప్ప పార్టీ విధేయత, సీనియార్టీ వంటివేవీ పరిగణనలోకి తీసుకోలేదని అప్పట్లోనే ఆయన వ్యాఖ్యలు చేశారు. అప్పటి నుంచి వైసీపీ పెద్దలపై అవకాశం ఉన్నప్పుడల్లా తన అసంతృప్తిని వెళ్లగక్కుతూ వచ్చారు. కొద్దిరోజుల క్రితం కంకిపాడులో జరిగిన బీసీ సాధికార బస్సు యాత్ర సందర్భంగా.. జగన్ తనను గుర్తించడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ వీడుతారన్న ప్రచారం జోరందుకుంది. ఇప్పటికే టీడీపీ అధినేతను కలిసి తాను టీడీపీలో చేరనున్న విషయాన్ని సారథి తెలియజేసినట్టు సమాచారం. ఆయనకు ఎక్కడ సీటు కేటాయించాలన్న అంశంపై పలు తర్జనభర్జనల అనంతరం ఏలూరు జిల్లా నూజివీడు నుంచి పార్థసారథికి అవకాశం కల్పించేందుకు టీడీపీ పెద్దలు సుముఖత చూపినట్టు తెలుస్తోంది. గుడివాడలో 18వ తేదీన జరగనున్న 'రా కదలి రా' సభలో సారథి టీడీపీలో చేరనున్నట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు.



నేటితో భవానీ దీక్షల విరమణ ముగింపు

భవానీ దీక్షల విరమణలు ఆదివారం ఉదయం పూర్ణాహుతితో ముగియనున్నాయి. ఇప్పటివరకూ 65 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 2.85 లక్షల లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. 13,080 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. 11,700 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. -వన్‌టౌన్



ఎస్మాకు భయపడం

అంగన్వాడీల పోరాటం మరింత ఉధృతమైంది. ప్రభుత్వ నిర్బంధం పెరిగేకొద్దీ పోరు తీవ్రమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాకు భయపడేదిలేదని అంగన్వాడీలు తెగేసి చెప్పారు. 26వ రోజు సమ్మెలో భాగంగా శనివారం 26 గంటల రిలే దీక్ష కొనసాగించారు. నగరంలోని ధర్నాచౌక్ వద్ద ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. - ధర్నాచౌక్

నేటితో పుస్తకం సమాప్తం

- పుస్తక మహోత్సవానికి పోటెత్తిన పాఠకులు
- కిటకిటలాడిన స్టాల్స్

- 6లో..



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ముగ్గు



కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న మహిళలు



ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న గుడివాడకు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు కనకాల సుగుణలత

మంత్రముగ్గులయ్యేలా..



ద్వితీయ బహుమతి సాధించిన ముగ్గు

'వీకేఆర్ అండ్ వీఎన్‌బీ'లో వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు, ముగ్గు వేస్తున్న పదేళ్ల బాలిక నాగలక్ష్మి

గుడివాడ: ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ శనివారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళా శాల ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గులపోటీలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మడకా ప్రసాద్, జాతీయ, జిల్లా స్థాయి 15మంది ఖో-ఖో క్రీడాకారులు ముగ్గుల పోటీలకు తమ వంతు సహకారం అందజేశారు. ఆడుదాం ఆంధ్ర జిల్లా అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న కె.కుమారి వలంటీర్‌గా సేవలందించారు. వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత, టీడీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, ఆంధ్రజ్యోతి విజయవాడ ఎడిషన్ ఇన్‌చార్జ్ ఎ.ఉమామహేశ్వర రావు, ఎంపీడీవో డాక్టర్ ఏవీ రమణలు ముగ్గులను పరిశీలించి మహిళలు, యువతులను అభినందించారు.

విజేతల వివరాలు..

గుడివాడకు చెందిన పి.పూజిత ప్రథమ(రూ.6వేలు), మచిలీపట్నానికి చెందిన బి.అరుణ ద్వితీయ(రూ.4వేలు), గుడివాడకు చెందిన టి.శాంతకుమారి తృతీయ బహుమతి(రూ.3వేలు) గెలుచుకున్నారు. విజేతలకు గుడివాడ ఎంపీడీవో డాక్టర్ ఏవీ రమణ, న్యాయవాది కె.రజిని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరావులు నగదు బహుమతులు అందజేశారు. ఆర్.నాగలక్ష్మి(గుడివాడ), జె.నాగదుర్గ(గుడివాడ), కె.జయంతి(గుడివాడ), పి.స్వాతి(ఏలూరు), కె.హిమబిందు(గుడివాడ)లకు ఒక్కొక్కరికి రూ.500 కన్సోలేషన్ బహుమతులను అతిథులు అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. గుడివాడకు చెందిన న్యాయవాది కె.రజిని, టి.సునీత, టి.లక్ష్మీసుజాత, ఎన్.లక్ష్మీ శివపార్వతిలు ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు.



తృతీయ బహుమతి సాధించిన ముగ్గు

రాష్ట్ర పోటీల్లో ప్రథమ స్థానమే లక్ష్యం

ఏటా క్రమం తప్పకుండా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తోంది. గత ఏడాది జిల్లాలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించాను. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడమే లక్ష్యం.

- పి.పూజిత, ప్రథమ బహుమతి, గుడివాడ

ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందడం ఆనందంగా ఉంది. సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరాలకు పరిచయం చేయడానికి ఇలాంటి వేదికలు మరింత దోహద పడతాయి.

- బి.అరుణ, ద్వితీయ బహుమతి, మచిలీపట్నం

పోటీల నిర్వహణ అభినందనీయం

న్యాయనిర్ణేతలు పారదర్శకంగా వ్యవహరించారు. సందేశాత్మక ముగ్గులను ఎంపిక చేశారు. నాకు బహుమతి రావడం నా కృషికి ఫలితంగా భావిస్తున్నా. ఈ తరహా చుక్కల ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయం.

- టి.శాంతకుమారి, తృతీయ బహుమతి, గుడివాడ

నేటితో పుస్తకం సమాప్తం

22భాషలు... 27లక్షల పుస్తకాలు

▸ జాతీయ గ్రంథాలయ అసిస్టెంట్ లైబ్రేరియన్ కాళీప్రసన్న



విజయవాడ సిటీలైఫ్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సాహిత్య ఛాయలు ఒకసారి మొదలైతే చాలు ప్రాణం ఉన్నంత వరకు కొనసాగుతాయి. ఒక రచన చేసిన రచయిత లేకపోయినా ఆయన రాసిన పుస్తకాలు సజీవంగా ఉంటాయి. ఇలా అనేక మంది గొప్ప రచయితలు, సాహిత్య అభిలాష ఉన్న వారు రాసిన పుస్తకాలకు లాకర్‌గా ఉంటోంది కోల్‌కతాలోని జాతీయ గ్రంథాలయం. వివిధ ప్రచురణకర్తలు ముద్రించిన పుస్తకాలను సేకరించడానికి పుస్తక మహోత్సవంలో ఈ గ్రంథాలయం ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ గ్రంథాలయం అసిస్టెంట్ లైబ్రేరియన్ కాళీప్రసన్న 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? జాతీయ గ్రంథాలయంలో మొత్తం ఎన్ని పుస్తకాలు ఉన్నాయి

జవాబు: కోల్‌కతాలో ఉన్న జాతీయ గ్రంథాలయంలో మొత్తం 22 భాషలకు చెందిన 27లక్షల పుస్తకాలు ఉన్నాయి. వాటిలో తెలుగు పుస్తకాలు 52వేల వరకు ఉన్నాయి

? ఈ పుస్తకాల సేకరణ దేని కోసం

జవాబు: ఇండియన్ నేషనల్ బిబ్లోగ్రఫీ ఒకటి ఉంది. ఇందులో ఒక పుస్తకానికి సంబంధించిన మొత్తం సమాచారం ఉంటుంది. ఆ పుస్తకాన్ని రాసింది ఎవరు? ఏ సంస్థ ప్రచురణ చేయించింది? ఆ పుస్తకంలో ఏయే అంశాలు ఉన్నాయనే సమాచారం ఉంటుంది. ఇదంతా ఒక రికార్డు. ఈ బిబ్లోగ్రఫీ ఏడాదికి ఒకసారి ప్రచురణ అవుతుంది. ఏడాదిలో ఏయే పుస్తకాలు ప్రచురణ అయ్యాయో దీని ద్వారా తెలుస్తోంది.

? ఇక్కడున్న పుస్తకాలను పునఃముద్రణకు ఇస్తారా

జవాబు: జాతీయ గ్రంథాలయం ఎలాంటి ముద్రణలు చేయించదు. ఒక పుస్తకం పాఠకుల్లో బాగా ప్రాచుర్యం సంపాదించుకుని మార్కెట్లో అందుబాటులో లేకపోతే పునఃముద్రణ చేసుకునే వారికి అవకాశం ఇస్తాం. ఇందుకోసం రిఫరీగ్రఫీ సర్వీసెస్ అందుబాటులో ఉన్నాయి. పుస్తకం కాపీరైట్స్ ప్రకారం పుస్తకంలో మొత్తం పేజీల్లో మూడో వంతు పేజీలను ముద్రణకు అనుమతిస్తాం. దీనికి ముద్రణ చేసుకునే వారు కొంత మొత్తాన్ని గ్రంథాలయానికి చెల్లించాల్సి ఉంటుంది.

పోలీసు సాహిత్యం



బొబ్బిలి ఎస్సై చదలవాడ సత్యనారాయణ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్): కేసులు.. దర్యాప్తులు..బందోబస్తులు.. పోలీసు ఉద్యోగం అంటే ఇది విధి. ఎప్పుడు ఇంటికి వెళ్తారో తెలియదు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ఇంటి నుంచి స్టేషన్‌కు పరుగులు తీయాలి. ఇలాంటి ఉరుకుల పరుగుల ఉద్యోగంలో సాహిత్య మధురాన్ని ఆస్వాదిస్తున్నారు చదలవాడ సత్యనారాయణ. విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన భవానీ దీక్షల విరమణ బందోబస్తు విధులకు విజయవాడకు వచ్చారు. సాహిత్య అభిలాష, పుస్తక పఠనం అలవాటు ఉన్న ఆయన తీరిక దొరకడంతో నగరంలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవానికి వచ్చారు. ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ తెలుగు పూర్తి చేసిన ఆయన ఎక్కువగా వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను చదువుతారు. దీనితోపాటు దళిత సాహిత్య పుస్తకాలను పఠనం చేస్తారు. తన ఇంట్లో రూ.లక్ష విలువ చేసే పుస్తకాలు ఉన్నాయని సత్యనారాయణ తెలిపారు. విధి నిర్వహణలో ఎంత ఒత్తిడికి లోనైనా పుస్తక పఠనమే తనకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తోందని ఆయన అన్నారు. సాహిత్య అభిలాష ఉన్న మిత్రులంతా కలిసి స్నేహకళా సాహితీ సంస్థను ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో వారానికి ఒకసారి ప్రముఖ కవులు, రచయితలపై చర్చాగోష్ఠి నిర్వహిస్తారు. ఒక అంశంపై ప్రసంగించాలంటే వాటికి సంబంధించిన పుస్తకాలను చదివితేనే ఆ సామర్థ్యం వస్తుందని సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

పదో రోజు పుస్తక మహోత్సవానికి పోటెత్తిన పాఠకులు ● కికిటలాడిన స్టాల్స్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్): పుస్తక మహోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది. దీనితో శనివారం పదోరోజున పుస్తక మహోత్సవానికి పాఠకులు పోటెత్తారు. మధ్యాహ్నం నుంచి సందర్శకులు విపరీతంగా వచ్చారు. విద్యార్థులూ అదేస్థాయిలో చేరుకున్నారు. గుంటూరు, ప్రకాశం, ఏలూరు, బాపట్ల జిల్లాల నుంచి పాఠకులు ఇక్కడికి వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువత పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈసారి పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు అధిక సంఖ్యలో అమ్ముడయ్యాయని ప్రచురణకర్తలు చెబుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో మరింత ఎక్కువగా అమ్మకాలు జరుగుతాయని భావిస్తున్నారు. పుస్తక మహోత్సవం ప్రారంభం రోజు నుంచి ఇప్పటి వరకు రూ.3కోట్ల వరకు వ్యాపారం జరిగినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఆదివారం మరింత ఎక్కువ జరుగుతుందంటున్నారు.



'శ్రీమదాంధ్ర మహాభారత ప్రవచనం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ దుర్వాసుల వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ బి.కృష్ణమోహన్, చాగంటి కోటేశ్వరరావు

మానవ జీవన ధర్మం కోసం మహాభారతం

విజయవాడ కల్చరల్: మహాభారతాన్ని మించిన వ్యక్తిత్వ వికాస గ్రంథం లేదని ప్రవచనకారుడు చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. మహాభారతం భక్తికోసమే కాదు మానవ జీవన ధర్మం కోసం కూడా అని ఆయన పేర్కొన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఆయన 'నేటి భారతంలో మహాభారత ప్రస్తావనార్హత' అనే అంశంపై ప్రసంగించారు. చాగంటి 'శ్రీమదాంధ్ర మహాభారత ప్రవచనం' గ్రంథాన్ని జస్టిస్ దుర్వాసుల వి.ఎస్.ఎస్.సోమయాజులు ఆవిష్కరించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, సురేష్‌రెడ్డి ప్రథమ ప్రతులను స్వీకరించారు. ఎమెస్కో విజయకుమార్ పాల్గొన్నారు.

'అనగనగా కరణం కథలు' ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: సుతిమెత్తగా, పరోక్షంగానైనా పాఠకులకు మనసుకు హత్తుకునేలా హితబోధలు చేయగల శక్తి మంచి కథకులకు మాత్రమే ఉందని రవాణాశాఖ అధికారి డాక్టర్ ఎస్ఏవీ ప్రసాద్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఆయన పాత్రికేయుడు కరణం కల్యాణ కృష్ణ రచించిన 'అనగనగా కరణం కథలు' సంపుటిని ఆవిష్కరించారు. కవి మువ్వా శ్రీనివాసరావు పాత్రికేయుడు నండూరి రాజగోపాల్, దూరదర్శన్ ప్రయోక్త పురాణం విజయదుర్గ, రచయిత కరణం కళ్యాణకృష్ణ, విమర్శకురాలు సుధామురళి ప్రసంగించారు.

విశ్వజనీన సంస్కృతి ఏదీ లేదు: బీవీ రాఘవులు

విజయవాడ కల్చరల్: విశ్వజనీనమైన సంస్కృతి ఏదీ లేదని, సంస్కృతి అనేది ఆయా ప్రాంతాలకు పరిమితమైందని సీపీఐఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం దేశమంతా ఒకే సంస్కృతి అనే వాదాన్ని ప్రచారంలోకి తెస్తున్నారన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహితీ వేదికపై ప్రజాశక్తి బుక్‌హౌస్ వారి ప్రచురణలు 'ప్రజా సంస్కృతి', 'ప్రపంచీకరణ-స్వేచ్ఛ కుదింపు' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ప్రజా సంస్కృతి పుస్తకాన్ని ఈఎంఎస్ నంబూద్రిపాద్, స్వేచ్ఛ కుదింపు పుస్తకాన్ని ప్రభాత్ పట్నాయక్‌లు రాశారు. మొదటి పుస్తకాన్ని సత్యరంజన్, రెండో పుస్తకాన్ని ఎంవీఎస్ శాస్త్రి తెలుగులోకి అనువదించారు. జనవిజ్ఞాన వేదిక వారి పాటల సీడీని కూడా సభలో ఆవిష్కరించారు. సభకు ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకుడు ఎస్.వెంకట్రావు అధ్యక్షత వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి సత్యరంజన్, పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, అధ్యక్షులు మనోహర నాయుడు, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావులు, జననాట్యమండలి గేయ రచయిత దేవేందర్ సభలో పాల్గొన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రతినిధి కె.లక్ష్మయ్య సభకు స్వాగతం పలికారు.



ప్రజాసంస్కృతి, ప్రపంచీకరణ స్వేచ్ఛా కుదింపు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేత బీవీ రాఘవులు, ఎస్.వెంకట్రావు, దేవేందర్, గుమ్మా సాంబశివరావు




'ఇదీ మన భారతీయం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్, వెలగా జోషి తదితరులు

తాత్వికతకు అద్దం పట్టేలా కొత్త సచ్చిదానందమూర్తి రచనలు

విజయవాడ కల్చరల్: ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి రచనలు భారతీయ తాత్వికతకు అద్దం పడతాయని మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై 'ఇదీ మన భారతీయం' పేరుతో వెలువరించిన కొత్త సచ్చిదానందమూర్తి స్నాతకోత్సవ ఉపన్యాసాల అనువాద కదంబాన్ని ఆయన ఆవిష్కరించారు. సచ్చిదానందమూర్తి తనయుడు రఘునాథ్ ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. కొత్త శ్రీనివాస్, జంపాల రాజేష్, డాక్టర్ వెలగాజోషి, కొత్త రమేష్, డాక్టర్ నారాయణరావు, బెల్లపు బాబ్జీ, డీఎస్పీ మోహన్‌రావు, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

2డీలో 3డీ



(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్): చిత్రాలు 2డీలో ఉంటాయి. దాని బ్యాక్‌గ్రౌండ్ 3డీలో ఉంటుంది. అదే శ్రీరామాయణం. విజయవాడ సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల చిత్రకారుడు ఉప్పరాపల్లి వేణుగోపాలరావు రూపొందించిన ఈ పుస్తకం స్టాల్ నంబర్ 85లో హర్షిత పబ్లికేషన్స్‌లో అందుబాటులో ఉంది. చిన్నపిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో చిత్రాలతోపాటు సంక్షిప్త సమాచారంతో ఈ పుస్తకాన్ని రూపొందించారు. శ్రీరాముడి పట్టాభిషేకం, వనవాసం, సీత అపహరణ, రామరావణుల యుద్ధం, లంకా దహనం ఘటనలకు 2డీ చిత్రాలను తీసి, వాటి వెనుక 3డీ బ్యాక్‌గ్రౌండ్‌తో ముద్రించారు. రూ.350లు ఉన్న ఈ పుస్తకాన్ని పుస్తక మహోత్సవంలో రూ.300లకు విక్రయిస్తున్నారు.

నేడు తిరువూరులో రా కదలిరా!

▸ టీడీపీ అధినేత చంద్రబాబు రాక

తిరువూరు, జనవరి 6: ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ వేడి పెరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'రా.. కదిలిరా' ఎన్నికల సభ రెండోరోజు జిల్లాలోని తిరువూరులో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనుంది. విజయవాడ పార్లమెంట్ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని)పర్యవేక్షణలో నాలుగు రోజులుగా పట్టణంలోని అయ్యప్ప ఆలయం సమీపంలో సుమారు 20 ఎకరాల్లో బహిరంగ సభ ఏర్పాట్లు శరవేగంగా జరిగాయి. సభ జరిగే ప్రాంతం సమీపంలో హెలిప్యాడ్‌ను నిర్మించడంతో పాటుగా సభవేదిక ముందు బారికేడ్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. సభకు నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు లక్ష మంది వస్తారని నిర్వాహకులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం కేశినేని చిన్ని, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్, మాజీ మంత్రులు నక్కా ఆనంద్ బాబు, దేవినేని ఉమా, ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్సీ ఎంఎస్ఎన్.రాజు, జలీల్‌ఖాన్ చింతబత్తిన శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్యకర్తల్లో ఉత్సాహం

పట్టణంలో చంద్రబాబునాయుడు పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లతో టీడీపీ కార్యకర్తలు ఉత్సాహం నెలకొంది. తమ అభిమాన నాయకుడు పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లలో రెండు రోజులుగా తమవంతు శ్రమదానం చేస్తూ ఉరుకులు పరుగులతో పనుల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో, పట్టణంలోని వార్డుల్లో బహిరంగ సభ విజయవంతం కోరుతూ విస్తృత ప్రచారం సాగిస్తున్నారు.

భారీగా ఫ్లెక్సీల ఏర్పాటు

బహిరంగసభ జరిగే ప్రాంతంతో పాటుగా, పట్టణంలోని పలు ప్రాతాల్లో చంద్రబాబుకు స్వాగతం పలుకుతు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులతో పాటు వివిధ అనుబంధ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పట్టణం పసుపువర్ణంగా మారింది.

84 వేల ఇళ్లు ఇస్తే 6 వేలే కేటాయించారేంటి?

ఎన్టీఆర్ జిల్లాలో పీఎంఏవై ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంపై కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ అసంతృప్తి ● లక్ష ఇళ్లు నిర్మించాలని కలెక్టర్‌కు ఆదేశం

జగ్గయ్యపేట, జనవరి 6: ఎన్టీఆర్ జిల్లాకు పీఎంఏవై పథకం కింద 84వేల ఇళ్లు మంజూరు చేస్తే కేవలం 6 వేల ఇళ్లు కేటాయించడంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి భారతీ ప్రవీణ్‌పవార్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయుష్మాన్ భారత్ పథకానికి 9లక్షల మంది అర్హులుగా ఉంటే 31వేల మందికే కార్డులు ఇవ్వటంపైనా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట సమీపంలోని షేర్‌మహ్మద్‌పేటలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవాలని, గ్రామాలవారీగా లక్ష్యాలను పెట్టుకుని నిర్మాణం పూర్తి చేయించాలని జిల్లా జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారని తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికతను జోడించేందుకు డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందుల పిచికారీపై స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, జిల్లాలో 288 పంచాయతీలకు గాను 202 పంచాయతీల్లో యాత్ర పూర్తి చేసినట్టు చెప్పారు.



ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్‌ను అందిస్తున్న కేంద్రమంత్రి భారతీపవార్, ఇన్‌చార్జ్ కలెక్టర్ సంపత్

కేన్సర్ రోగులకు ఫించన్ ఇప్పించండి

ప్రధాని మోదీకి చెప్పి కేన్సర్ రోగులకు ఫించన్ ఇప్పించాలని మంత్రిని షేర్ మహ్మద్‌పేట గ్రామానికి చెందిన ఫర్జానా అనే మహిళ కోరింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద తనకు థైరాయిడ్ కేన్సర్ ఆపరేషన్, తన సోదరుడికి నరాల బలహీనతకు చికిత్స చేయించుకుని కోలుకున్నామని, ఆపరేషన్ తర్వాత గతంలో మాదిరిగా పనిచేయలేకపోతున్నామని ఫించన్ రూపంలో ఆర్థిక సాయం ఇప్పించాలని మంత్రిని కోరారు. మూడు జిల్లాల్లో 1600 మంది టీబీ రోగులకు పోషకాహారాన్ని అందిస్తున్న కోహెన్స్ లైఫ్ సైన్సెస్ కంపెని ప్రతినిధి మూర్తిని కేంద్ర మంత్రి అభినందించి, సత్కరించారు. ఉజ్వల పదకం కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందచేశారు. అంతకు ముందు వివిధ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్వయంసహాయక సంఘాల సభ్యులు ఇచ్చిన గాజులు, స్వీట్లు, నూతన వస్త్రాలను స్వీకరించారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సంపత్, డీపీవో జయచంద్ర, డీఎంహెచ్‌వో సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మానసిక స్థితి సరిగా లేదు

▸ అందుకే ఎమ్మెల్యేలను బదిలీ చేస్తున్నారు

▸ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

తిరువూరు, జనవరి 6: అధికారాన్ని కోల్పోతున్నామన్న వాస్తవం తెలిసి, సీఎం జగన్‌రెడ్డికి మానసికస్థితి సరిగా లేకుండా పోయిందని, దీంతో ఎమ్మెల్యేలను, ఎంపీలను బదిలీ చేస్తున్నారని టీడీపీ పొలిట్‌సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న రాకదలిరా బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం పర్యవేక్షించిన ఆయన సభ వేదిక వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనికిరాడని, ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ పాల్గొన్నారు.

ప్రజాగ్రహంతో వైసీపీ కనుమరుగే: నెట్టెం రఘురాం

అన్నివర్గాల ప్రజలపై భారాలు మోపడం తప్ప రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి లేదని, ఆగ్రహంతో ఉన్న ప్రజలు సైకో జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని, భవిష్యత్‌లో వైసీపీ కనుమరుగవుతుందని టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. చంద్రబాబు ఇచ్చిన రా కదలిరా ఎన్నికల సమర శంఖారావానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందన్నారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	164
చికెన్ స్కిన్‌లెస్	174



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

లయోలలో భావప్రకటనపై అవగాహన సదస్సు

భారతీనగర్, జనవరి 6: ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల సెమినార్ హాల్‌లో భావప్రకటన అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ ఆఫ్ హ్యూమానిటీ సోషల్ సైన్స్ గైడూరు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ మానవ భావ ప్రకటన భాషాప్రయుక్తం అయిఉండటంతో ఇది ప్రత్యేకంగా పరిగణించబడుతుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి.జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, డాక్టర్ సిస్టర్ క్యాండీ, ఇనయల కళావతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఉధృతం చేస్తాం

మున్సిపల్ యూనియన్ నేత ఉమామహేశ్వరరావు, సీపీఎం నేత బాబూరావు

సత్యనారాయణపురం, జనవరి 6: చెత్తవాసన కొద్ది సేపు పీల్చాలంటేనే అమ్మో అంటారు అట్లాంటి చెత్త ఎత్తే కార్మికుల జీవితాలను మాత్రం ఈ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని మున్సిపల్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు అన్నారు.

సత్యనారాయణపురం సర్కిల్ టూ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల 12వ రోజు అందోళనకు మద్దతుగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.జ్యోతిబోసు అధ్యక్షతన శనివారం నిరసన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రికి కనపడట్లేదా, వినపడట్లేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రావాలంటే కార్మికులకు మేలు చేసి రావాలి తప్ప కీడు చేయ కూడదన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం, మున్సిపల్ యూనియన్ నాయకులు

ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. తిరుపతమ్మ, జి.లక్ష్మీ, విజయలక్ష్మీ, కృష్ణవేణి, మహేష్, నరేంద్ర, బ్రహ్మయ్య, దుర్గారావు, సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అమాయకులనే భ్రమల్లోనే జగన్

● భవిష్యత్తుకు గ్యారెంటీ యాత్రలో బొండా ఉమా

గవర్నర్‌పేట, జనవరి 6: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వర్గాలను మోసం చేశారని, ఇంకా ప్రజలు అమాయకులనే భ్రమల్లో జగన్ బతుకుతున్నాడని, ఆయన్ని శాశ్వతంగా ఇంటికి పంపే పనిలో ప్రజలు ఉన్నారని టీడీపీ సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరావు అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 24వ డివిజన్‌లో ఇంటింటికీ పాదయాత్ర జరిగింది. బొండా ఉమా స్వయంగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ జగన్ వైఫల్యాలను ఎండగడుతూ టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ప్రతిచోట ప్రజలు పాదయాత్రకు సానుకూలంగా స్పందించారు. కూడలి ప్రాంతాల్లో ప్రజలతో మమేకమైన బొండా చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరాన్ని, వైసీపీ అసమర్థపాలను వివరించారు. ఉద్యోగుల్ని, యువతను, పెన్షనర్లను మోసం చేసి, ఇబ్బందులకు గురిచేస్తున్న వైఎస్ జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. నియోజవర్గం జనసేన సమన్వయకర్త బొలిశెట్టి వంశీకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు ఇజ్జాడ దుర్గారావు, బి.అప్పారావు, బి. శివ, వి. వేణుగోపాల్, జి. హరిబాబు, బి. వీరబాబు, లక్ష్మీ, పంచకర్ల రాంబాబు, సుధాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న టిడీపీ సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమా

యువత భవిష్యత్తు నాశనం చేసిన దుర్మార్గుడు జగన్: పోతిన

పాతరాజరాజేశ్వరిపేట, జనవరి 6 : ఉద్యోగాలు ఇవ్వకుండా రాష్ట్రంలో యువత భవిష్యత్తుని నాశనం చేసిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అని జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన వెంకట మహేశ్ విమర్శించారు. ఇంటింటికీ రాబోయే మన జనసేన టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని 35వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు ఎన్ఎస్ ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌లో చేపట్టారు. ఈ సందర్భంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంలో పోతిన మహేశ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పటికీ ఎందుకు విడుదల చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.



నలంద విద్యానికేతన్‌లో చిన్నారులకు పోటీలు

గవర్నర్‌పేట, జనవరి 6: వివిధ రకాల పోటీల ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు పాఠశాలలు వేదికలు కావాలని తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ యు. శారదాదేవి అన్నారు. ఎంజీ రోడ్డులోని నలంద విద్యానికేతన్ పాఠశాలలో శనివారం కిండర్ గార్డెన్ చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. టిక్ పిక్, రింగ్‌టోస్, వాటర్ గేమ్స్, వీల్‌స్పిన్, ఐస్‌క్రీమ్ హంట్, హార్ట్ బీట్, ఫీడ్ ది షార్క్, సెల్ఫీ కార్నర్, స్కేరీ హౌస్ వంటి ఆటలు ఏర్పాటు చేశారు. చిన్నారులు కేరింతలతో పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను శారదాదేవి ప్రారంభించి మాట్లాడారు. నలంద విద్యాసంస్థల అధినేత ఎ. విజయబాబు, ప్రిన్సిపాల్ మాదల పద్మజ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వివిధ పోటీలకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



జైభవానీ దీక్షాపీఠం ఆధ్వర్యంలో 46వ వార్షిక చండీయాగం

వన్‌టౌన్, జనవరి 6: బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జై భవానీదీక్షా పీఠం ఆధ్వర్యంలో 46వ వార్షిక చండీయాగాన్ని శనివారం గురుభవానీ మల్లిఖార్జునరావు, మోహిని దంపతులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పరిటాల శ్రీరామచంద్ర మూర్తి గురుభవానీ, ఇంకా పలువురు దంపతులు పాల్గొన్నారు, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నవజాత శిశువుల్లో కామెర్లపై అవగాహన సదస్సు

పటమట, జనవరి 6 : నవజాత శిశువుల్లో కామెర్లు అనే అంశంపై వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ మారు అధ్యక్షతన శనివారం ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సి. గురుప్రసాద్ సవిరంగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ నవజాత శిశువుల్లో కామెర్లు అతిసహజం అని, కొందరు పిల్లల్లో కామెర్లు ప్రమాదస్థితికి చేరతాయని, కళ్లు, శరీరం పచ్చగా కనబడినంత మాత్రాన భయపడనవసరం లేదని తెలిపారు. నవజాత శిశువులో కలిగిన కామెర్లు ఎటువంటివి అనేవి తల్లి తేలికగా గుర్తించగలదన్నారు. వ్యాధిక సంబంధించిన కామెర్లు పుట్టిన గంటల్లోనే కనబడతాయని, కనుక వెంటనే డాక్టరుకి చూపించాలన్నారు. సదస్సులో పాల్గొన్న అనేక మంది సందేహాలడిగి నివృత్తి చేసుకున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సి. గురుప్రసాద్

తిరువూరు సభను జయప్రదం చేయండి: ఎమ్మెల్యే గద్దె

పటమట, జనవరి 6 : తిరువూరులో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే నారా చంద్రబాబు నాయుడు రా కదలిరా సభకు విజయవాడ తూర్పు నియోజక వర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనలో ప్రజలు అనేక అవస్థలు పడ్డారని, సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు రా కదలిరా సభకు ప్రజలు తరలివచ్చి చంద్రబాబుకు మద్దతు తెలపాలని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అందించే సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని, ఆ పథకాల ద్వారా ఉన్నతమైన జీవన ప్రమాణాలు పొందవచ్చుననే ధైర్యంతో ప్రజలు టీడీపీకి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. జయహో బీసీ ద్వారా జగన్ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని వెలుగెత్తి చూపడం జరుగుతుందని అన్నారు. 2019 ఎన్నికల ముందు బీసీలకు జగన్ ప్రకటించిన హామీల్లో ఒక శాతం కూడా అమలు చేయలేదని అన్నారు.

తిరువూరు సభ వైసీపీ పతనానికి నాంది

అజిత్‌సింగ్‌నగర్: తిరువూరు నియోజకవర్గంలో ఆదివారం జరగనున్న చంద్రబాబు భారీ బహిరంగ సభ వైసీపీ పతనానికి నాంది అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తిరువూరులో జరగబోయే భారీ బహిరంగ సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేతలు ఎరుబోతు రమణారావు, ఘంటా కృష్ణమోహన్, సాంబశివరావు పాల్గొన్నారు.

రా కదలి రా ప్రచార ఆటోలు ప్రారంభం

వన్‌టౌన్: తిరువూరులో ఆదివారం జరగనున్న టీడీపీ రా కదలి రా సభను జయప్రదం చేయడానికి ప్రచార ఆటోలను శనివారం సీనియర్ టీడీపీ నాయకుడు ఎంఎస్ బేగ్ ప్రారంభించారు. అనంతరం ఆయన తిరువూరులో సభా ప్రాంగణం వద్ద పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శావల దేవదత్, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, విజయవాడ పశ్చిమ టీం టీడీపీ నాయకులు ఎస్.రాధాకృష్ణ, బి.కనకారావు, రియాజ్, తమ్మిన శేఖర్, బెవర రవి, దాసరి దేవేంద్ర, బేగ్, మక్కెన భాస్కర్ తదితరులతో ఏర్పాట్లను పరిశీలించారు.



రా కదలి రా సభ ప్రచారానికి ఆటోలను ప్రారంభించిన ఎంఎస్ బేగ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి

వన్‌టౌన్, జనవరి 6: కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని వారధి చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన వేమూరి షారోన్ భార్య స్వప్న(23), ఆమె దూరపు బంధువు శిరీష నంబూరు నుంచి గుణదల మేరీ మాత చర్చికి వచ్చి తిరిగి వెళుతుండగా రాత్రి 10.30కు ఈ సంఘటన జరిగింది. స్నేహితురాలికి చెందిన స్కూటీని స్వప్న నడుపుతుండగా శిరీష వెనుక కూర్చుంది. గుంటూరు నుంచి విజయవాడకు వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. స్వప్న భర్త ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవానీ భక్తులకు అన్నప్రసాద వితరణ

వన్‌టౌన్: దుర్గమ్మ భక్తులు సముద్రాల సురేష్, గ్రంధి సత్యనారాయణల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్న వితరణను వైసీపీ నాయకుడు ఆకుల శ్రీనివాసకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరలివస్తున్న భక్తులకు స్వచ్ఛంద సంస్థలు సేవ చేయడం ప్రశంసనీయమన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

గవర్నర్‌పేట, జనవరి 6: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం అమరావతి ఐ ఆసుపత్రి, మిత్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, దుహిత మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి, హియరింగ్ సొల్యూషన్స్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ ప్రారంభించారు. మెడికల్ క్యాంపుకు అపూర్వ స్పందన లభించింది. గ్రంథాలయ సిబ్బందితో పాటు పాఠకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నగర ప్రజలు క్యాంపును సద్వినియోగం చేసుకున్నట్లు ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి తెలిపారు.

డేటా మైండ్స్ లెర్నింగ్ స్టూడెంట్ క్లబ్ ప్రారంభం

వన్‌టౌన్, జనవరి 6: పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు(పీఎస్‌సీఎంఆర్) ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పరుచూరి లక్ష్మణస్వామి డేటా మైండ్స్ లెర్నింగ్ స్టూడెంట్ క్లబ్, లోగోలను ఆవిష్కరించారు. డేటా సైన్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజి, డిజైన్ థింకింగ్‌లపై ఈ క్లబ్బు దృష్టి పెడుతుంది. సంబంధిత రంగాలపై ఈవెంట్‌లను, వర్క్‌షాప్‌లను తదితరాలను నిర్వహిస్తుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రిలతో పాటు ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



దర్గా నివాసిత ప్రాంతాల్లో రోడ్లు, సౌకర్యాలకు చర్యలు

● సొసైటీ సమావేశంలో ఎమ్మెల్యే, మేయర్‌ల హామీ

భవానీపురం, జనవరి 6 : పశ్చిమలోని 41,42 డివిజన్ల నడుమ సుదీర్ఘకాలంగా దర్గా నివాసిత 433 ప్లాట్ల ప్రాంతంలో అభివృద్ధి పనులపై కోర్టు స్టే పూర్తిగా తొలగించిన కారణంగా ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు భరోసా ఇచ్చారు. గత నెల్లో కోర్టులోని వివిధ కేసులను కొట్టివేస్తూ నివాసితులకు అనుకూలంగా తీర్పు వెలువడిన సందర్భంగా మహ్మదీయ కో-ఆపరేటివ్ సొసైటీ- ప్రగతినగర్ కాలనీ అధ్యక్షుడు అట్లూరి బెనర్జీ,సెక్రటరీ దేవిరెడ్డి అంజనేయరెడ్డి, గౌరవాధ్యక్షుడు రంగయ్యలు తమ సమస్యల పరిశీలనకు రావాలని మేయర్, ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ సత్వరం అభివృద్ధి పనులకు అంచనాలను రూపొందించిన వీఎంసీ కమిషనర్, ఈఈలను కోరారు. కార్పొరేటర్లు మహ్మద్ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, స్థానికులు జక్కిరెడ్డి సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు

విద్యాధరపురం,జనవరి 6: తన కుమారుడు కనిపించడం లేదని భవానీపురం పాత ఎంఐజీ కాలనీకి చెందిన రెంటచింతల కృష్ణమూర్తి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని పెద్దకుమారుడు కాశీవిశ్వనాథ్ కమర్షియల్ కాంప్లెక్సులో సహాయ అర్చకుడుగా పనిచేస్తున్నాడు, శనివారం ఉదయం గుడికి వచ్చిన అతనికి ప్రధాన అర్చకుడు తన మోటార్ సైకిల్ ఇచ్చి సమీపంలో పూజలు చేయించుకున్న వారికి కొబ్బరి చిప్పలు ఇచ్చి రమ్మన్నాడు. అయితే ఆతరువాత కాశీవిశ్వనాథ్ తిరిగి రాలేదు, సాయంత్రం దాకా వేచి చూశారు అతని , ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో వెతకగా వీటీపీఎస్ వాటర్ డంపింగ్ కరకట్ట వద్ద అతను వేసుకు వెళ్లిన బండి కనిపించింది, అతని జాడ మాత్రం తెలియరాలేదు, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదు కావాలి

● కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 6: ట్రాన్స్‌జెండర్లు ఎన్టీఆర్ జిల్లాలో వెయ్యి మందికి పైగా ఉన్నారని, 147 మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారని, ఈనెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నందున మిగిలిన వారు కూడా ఓటు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. ఓటరుగా నమోదవడంలో ట్రాన్స్‌జెండర్లకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తామని, కలెక్టరేట్‌లో ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ట్రాన్స్‌జెండర్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో రెవెన్యూ, డీఆర్డీఏ, గృహనిర్మాణం, నగరపాలక సంస్థ, సంక్షేమ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ట్రాన్స్‌జెండర్లకు ఇళ్లస్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డు మంజూరుతో పాటు బ్యాంకుల నుంచి రుణ సహాయం అందించి చిరు వ్యాపారాలు చేసుకునేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు.



కించపరచడమే 'కొడాలి' పని: బుద్దా

▸ టీడీపీ, జనసేన కూటమికి 160 సీట్లు గ్యారంటీ: కేశినేని శివనాథ్



విజయవాడ(వన్‌టౌన్), జనవరి 6: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి పిచ్చి పట్టిందని ప్రజలు అనుకుంటున్నారని టీడీపీ నేత బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. శనివారం ఆయన టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్, నాగుల్ మీరాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో టీడీపీ జండా రెప రెపలాడుతుందన్నారు. కొడాలి నాని ఏ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి ఎక్కడకు వెళ్లాడో గుర్తు చేసుకోవాలన్నారు. నారా, నందమూరి కుటుంబాలను తూలనాడడంతోపాటు లోకేశ్‌ను కూడా నాని అనరాని మాటలన్నాడని విమర్శించారు. మరో సీనియర్ నేత కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరువూరులో ఆదివారం తలపెట్టిన 'రా కదలి రా..!' సభను అనూహ్యరీతిలో జయప్రదం చేస్తామన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ-జనసేన కూటమికి 160 సీట్లు గ్యారంటీ అని చెప్పారు.

మూర్ఖశిఖామణి సీఎం కావడం దౌర్భాగ్యం: రామకృష్ణ

విజయవాడ(వన్‌టౌన్), జనవరి 6: మూర్ఖశిఖామణి సీఎంగా ఉండడం మన రాష్ట్ర దౌర్భాగ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద శనివారం మునిసిపల్ వర్కర్లు, సహాయకుల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మునిసిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని తెలిపారు.

నిరంకుశత్వానికి పరాకాష్ఠ: సీపీఐ

సీఎం జగన్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయాలకే పరిమితమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం జగన్ నిరంకుశత్వానికి పరాకాష్ఠని తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగాన్ని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఓ ప్రకటనలో ఖండించారు.

జగన్ బాణం యూటర్న్ తీసుకుంది: బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ వదిలిన బాణం ఇప్పుడు యూటర్న్ తీసుకుని ఆయనపైకి వస్తోందని బీజేపీ ఏపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బటన్ నొక్కి సీఎం జగన్‌ను ఇంటికి పంపించడానికి ఎదురు చూస్తున్నారన్నారు. శనివారం, ఏపీ భవన్‌లో ఆయన మాట్లాడారు. విధానాల మీద మాట్లాడకుండా జగన్ ఇతరుల కుటుంబ వ్యవహారాల గురించి మాట్లాడుతున్నారని అన్నారు.

శ్వేతపత్రం ఇచ్చే దమ్ముందా?: కనకమేడల

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): '85 శాతం హామీల అమల్లో జగన్ ఫెయిల్ అన్న టీడీపీ పుస్తకంలోని అంశాలపై వాస్తవాలతో శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా? అని టీడీపీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర ప్రశ్నించారు. శనివారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో మాట్లాడుతూ హామీల అమలుకు సంబంధించిన వాస్తవాలు వెల్లడించాకనే జగన్ ప్రజల్ని ఓట్లు అడగాలన్నారు. కాగా, 58 నెలల్లో జగన్ పాలన దోపిడీ, దౌర్జన్యాలు, దుర్మార్గాలు, విధ్వంసం, వంచనకు ప్రతిరూపమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు.

ఇది అన్యాయం: ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. సమస్యల పరిష్కారానికి నిర్బంధ చట్టాలు అమలుచేయడం పరిష్కారం కాదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) చైర్మన్ ఎన్.వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సీహెచ్ మంజుల పేర్కొన్నారు. వెంటనే అంగన్వాడీలను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి అన్నారు. ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

సూది పోటుకు బైబై..!

▸ మధుమేహ రోగులకు అద్భుత వరం
▸ చెమటతో షుగర్ పరీక్ష చేసే పరికరం
▸ నిమిషంలోనే ఫలితం.. ఖర్చు కూడా తక్కువ
▸ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగం
▸ 'ఆంధ్రజ్యోతి'తో ఆవిష్కర్త శ్రీనివాసరావు
▸ పేటెంట్ హక్కులు ఇచ్చిన కేంద్రం

(ఏలూరు/ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

రక్త పరీక్షలంటే అందరికీ భయమే..! జేబుకు చిల్లు పడడంతోపాటు సూది గుచ్చినప్పుడు కలిగే బాధను తలచుకుని హడలిపోతుంటారు. అందరి పరిస్థితి ఎలా ఉన్నా మధుమేహ వ్యాధిగ్రస్తులకు మాత్రం సూదిపోటు తప్పదు. టైప్-1 మధుమేహ బాధితులైతే రోజుకు నాలుగు సార్లు పరీక్షించుకుని ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మధుమేహ పరీక్షలు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇది ఆర్థిక భారమే. ఈ బాధలన్నింటికీ స్వస్తి పలికేలా.. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన ఊసా చిరంజీవి శ్రీనివాసరావు అద్భుతమైన పరికరాన్ని ఆవిష్కరించారు. ఎలక్ట్రో కెమికల్ అనే ఈ పరికరంతో కేవలం చెమట చుక్కతో.. అదికూడా ఒకే ఒక్క నిమిషంలో శరీరంలోని గ్లూకోజ్ స్థాయిని నిర్ధారించవచ్చు. చిరంజీవి నాలుగేళ్లపాటు శ్రమించి రూపొందించిన ఈ పరికరానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి పేటెంట్ హక్కును కూడా కట్టబెట్టింది. ఇంతటి ఘనత సాధించిన శ్రీనివాసరావు తెలుగువారే కావడం గర్వకారణం. ఇది వినియోగంలోకి వస్తే.. పేద, మధ్యతరగతికి ఎంతగానో ఉపయోగపడనుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఆయన కాన్పూర్ ఐఐటీలో సీనియర్ ప్రాజెక్టు సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు.



'డయాబెటిస్ విత్ స్వెట్ టెస్ట్' ప్రయోగానికి సంబంధించి చిరంజీవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాలు ఇవీ

ఎలక్ట్రోకెమికల్ పరికరం ప్రత్యేకతను వివరిస్తారా?

సూదులతో గుచ్చి రక్త నమూనాలు సేకరించాల్సిన అవసరం లేకుండా, కేవలం చెమట బిందువులతో పరీక్షలు చేయవచ్చు. నొప్పిలేని ప్రక్రియ ఇది.

ఈ ఆలోచన ఎలా వచ్చింది..?

చాలా కాలంగా ఈ సూదుల ద్వారా చేస్తున్న పరీక్షలతో మధుమేహ బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధుమేహ నిర్ధారణ పరీక్ష చూసేందుకు సులువుగానే ఉన్నా.. కొన్ని వర్గాలు, వయస్కుల వారికి ఇది రానురానూ ఒక భయానకవాతావరణాన్ని కలిగిస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లో పర్యటించినపుడు ఆ పరిస్థితులను కళ్లారా చూశాను. కాబట్టే ఒక కొత్త ఆవిష్కరణ దిశగా ఆలోచించాను.

ఫలితం ఒకేలా ఉంటుందా..?

కచ్చితంగా..! అదే కదా మరి మా ఘనత. రక్తం, చెమట రెండు పరీక్షల్లోనూ ఫలితం ఒకేలా ఉంటుంది కాబట్టే సూదులకు స్థానం లేని మా ఈ ప్రయోగానికి పేటెంట్ కూడా పొందాం.

బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారంటారా?

చిన్నారులతో పాటు వృద్ధులు, ఇతర వయస్సులు కూడా దీని బాధితులే. కొంతమంది రోగులను పరీక్షించిన తర్వాత ఈ ఎలక్ట్రోకెమికల్ పరికరాన్ని కనుగొనగలిగాం. నేను టీం లీడర్‌గా వ్యవహరించిన ఈ బృందంలో నచికేత్ ఆశిష్ గోఖలే, సిద్ధార్థ పండా ఉన్నారు.

18 ఏళ్లలోపు పిల్లలకు మధుమేహం వస్తుందా?

చాలా అవకాశాలున్నాయి. 18 ఏళ్లలోపు పిల్లలకు వచ్చే వ్యాధి టైప్-1గా నిర్ధారణ అయితే, రోజుకి నాలుగు సార్లు పరీక్షించుకొని ఇన్సులిన్ తీసుకోవాలి.

మధుమేహ రోగులకు సూచనలేమైనా ఇస్తారా..?

డైట్ (ఆహారం), వయస్సు, శారీరక శ్రమ ఇలాంటివన్నీ మధుమేహం రావడానికి కారణం కావచ్చు. అందుకే ప్రతీ ఒక్కరూ కనీసం ఏడాదికి ఒక్కసారైనా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

మధుమేహం వారసత్వంగా సంక్రమిస్తుందా?

అందరికీ వచ్చే అవకాశం లేదు. అది అపోహ మాత్రమే.

పేటెంట్ హక్కు ప్రక్రియ ఎలా సాగింది?

ప్రయోగ దశలో ఉండగానే మా ఇన్‌స్టిట్యూట్ ద్వారా దరఖాస్తు చేశాం. తొలుత మా ప్రయోగాన్ని పరిశీలించిన తర్వాత మరిన్ని వివరాలు కోరారు. పూర్తి సమాచారం అందించాం. రెండేళ్ల తర్వాత మేం రూపొందించిన 'ఎలక్ట్రో కెమికల్ డివైస్ ఫర్ గ్లూకోజ్ డిటెక్షన్'కు పేటెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా పేటెంట్ కల్పించింది.

కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం..

మాది నిరుపేద కుటుంబం. తండ్రి భీమయ్య వాచ్‌మెన్, తల్లి దుర్గ వ్యవసాయ కూలీగా పనిచేసి నన్ను, మా అక్కను చదివించారు. ప్రస్తుతం మా తల్లిదండ్రులు సొంత ఊళ్లోనే ఉన్నారు. నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎస్సీ చదివాను. ఆంధ్రా విశ్వ విద్యాలయంలో పీజీ చేశాను. ఆ తర్వాత సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ కారైకుడి (తమిళనాడు)లో పీహెచ్‌డీ పూర్తిచేశాను.

సీజేఎఫ్ఎస్ లీజుదారులకు అసైనీలతో సమానంగా పరిహారం ఇవ్వండి

▸ వారికి అన్ని ప్రయోజనాలూ చెల్లించాల్సిందే
▸ స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
▸ తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ అప్పీల్ కొట్టివేత

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం భూమిని సేకరించినప్పుడు కామన్ జాయింట్ ఫార్మింగ్ స్కీమ్(సీజేఎఫ్ఎస్) కింద భూములు పొందినవారికి కూడా అసైనీదారులతో సమానంగా నష్టపరిహారం చెల్లించాల్సిందేనని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రైవేటు భూ యజమానులకు చెల్లించిన విధంగానే అసైనీదారులకు నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు కల్పించాల్సిందేనని మేకల పాండు కేసులో హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. ఈ ఉత్తర్వులను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని పేర్కొంది. సీజేఎఫ్ఎస్ భూములు కోల్పోయేవారు కూడా అసైనీదారులతో సమానంగా ప్రయోజనాలు పొందేందుకు అర్హులేనని స్పష్టం చేసింది. అసైన్డ్ పట్టా మంజూరు పలు షరతులకు లోబడి ఉంటుందనే కారణంతో అసైన్‌దారుల హక్కులను హరించడానికి వీల్లేదని పేర్కొంది. తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన కండలేరు రిజర్వాయర్ వల్ల భూములు కోల్పోయిన అసైనీదారులు, సీజేఎఫ్ఎస్ సభ్యులకు కూడా ఇతరులతో సమానంగా పరిహారం, ఇతర ప్రయోజనాలు కల్పించాల్సిందేనని తేల్చిచెప్పింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. తెలుగుగంగ ప్రాజెక్ట్ భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తాజాగా తీర్పు ఇచ్చింది. నెల్లూరుజిల్లా, రాపూరు మండలం, గుండవోలు గ్రామానికి చెందిన మద్దె రామయ్య సహా మరో ముగ్గురికి 1978లో అప్పటి ప్రభుత్వం 6.19 ఎకరాల భూమికి డీకేటీ పట్టాలు ఇచ్చింది. కాగా, కండలేరు రిజర్వేయర్ కోసం ప్రభుత్వం సంబంధిత భూమిని సేకరించింది. అధికారులు ఎక్స్‌గ్రేషియా మాత్రమే చెల్లించారు. దీంతో తమకు ఇతర రైతులతో సమానంగా నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2009లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన సింగిల్ జడ్జి.. అసైనీదారులకు కూడా ప్రైవేటు భూయజమానులతో సమానంగా పరిహారం చెల్లించాల్సిందేనని ఆదేశించారు. అయితే, ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలుగుగంగ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌పై ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు అసైనీదారులు కాదన్నారు. ఇరు పక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ప్రభుత్వ న్యాయవాది వాదనను తోసిపుచ్చి పైవిధంగా తీర్పు వెలువరించింది.

ఆదర్శ పాఠశాలల్లో అక్రమ వసూళ్లు!

▸ సీనియారిటీని పక్కనపెట్టి పదోన్నతులు
▸ కోర్టుకు వెళ్లకుండా ఓ అధికారి ఒత్తిడి
▸ తాజాగా 010 పేరుతో మరోసారి దందా
▸ కార్యదర్శి మార్పు నుంచే విమర్శలు

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆదర్శం పేరుతో నడుస్తున్న మోడల్ స్కూళ్లలో వసూళ్ల పర్వం మొదలైంది. గత అక్టోబరులో పదోన్నతుల పేరుతో వసూళ్లకు పాల్పడిన అక్రమార్కులు.. ఇప్పుడు 010 పద్దుతో జీతాలు ఇప్పిస్తామంటూ మరోసారి టీచర్ల నుంచి వసూళ్లు మొదలుపెట్టారు. ఏడాది కిందటి వరకూ మోడల్ స్కూల్స్ సొసైటీ ఎలాంటి ఆరోపణలు లేకుండా సక్రమంగానే సాగింది. సొసైటీ కార్యదర్శి మార్పు నుంచి అనేక ఆరోపణలు, విమర్శలకు సొసైటీ కేంద్రంగా మారింది. అయితే వాటిని నియంత్రించాల్సిన కీలక అధికారే ఈ తరహా వ్యవహారాలను ప్రోత్సహిస్తున్నారంటూ టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 164 మోడల్ స్కూళ్లలో 2200 మంది టీచర్లు పనిచేస్తున్నారు. గతేడాది అక్టోబరులో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)లకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)లుగా, పీజీటీలకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించారు. అయితే సీనియారిటీ జాబితా ప్రకారం 2013లో చేరిన వారి కంటే 2015లో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ఇదే విషయంపై అప్పట్లో బాధిత టీచర్లు కోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేయగా ఓ కీలకాధికారి వారిని బెదిరించారు. అప్పట్లో 161 మంది టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతి కల్పించారు. మరో 81 మందికి పదోన్నతి కల్పించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు పీజీటీలను చూపించి పదోన్నతులు నిలిపివేశారు. రెగ్యులర్ టీచర్లకు పదోన్నతులు ఇచ్చేటప్పుడు కాంట్రాక్టు టీచర్లు అడ్డు కాకపోయినా కావాలనే అన్యాయం చేశారని టీచర్లు గగ్గోలు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ మొత్తం వ్యవహారంలో ఓ కీలకాధికారికి రూ.10లక్షల మేర ముడుపులు అందినట్లు టీచర్లలో బహిరంగంగానే ప్రచారం సాగుతోంది. ఇక తాజాగా 010 పద్దు కింద జీతాలు ఇప్పిస్తామంటూ ఒక్కో టీచర్ నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకూ మళ్లీ వసూళ్లకు దిగారు. రాష్ట్ర సచివాలయంలో అధికారులను మేనేజ్ చేయాలని, అందుకు రూ.కోటి ఖర్చవుతుందంటూ కొందరు నేతలు ఈ వసూళ్లను ప్రారంభించారు. కీలకమైన అధికారే వారి వెనుక ఉండటంతో టీచర్లు కూడా అడిగిన మేరకు గత్యంతరంలేక సమర్పించుకుంటున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఇప్పటివరకూ వసూళ్లు చేయగా, మిగిలిన జిల్లాల్లో ఇప్పుడు మొదలుపెడుతున్నారు. ప్రతి స్కూలుకు వెళ్లి 010 కింద జీతాలు రావాలంటే కచ్చితంగా ముడుపులు ఇచ్చుకోక తప్పదంటూ బలవంతంగా వసూళ్లకు దిగుతున్నారు.

బెట్టింగ్ యాప్ కేసులో బఘేల్ పేరు

న్యూఢిల్లీ, జనవరి 6: ఛత్తీస్‌గఢ్‌లో సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఆ రాష్ట్ర మాజీ సీఎం భూపేశ్ భఘేల్ పేరును ఈడీ చేర్చింది. ఈనెల ఒకటో తేదీన కోర్టుకు సమర్పించిన అదనపు చార్జిషీట్‌లో ఆయన పేరును ప్రస్తావించింది. ఆ యాప్ వ్యవస్థాపకుల నుంచి లంచాల రూపంలో రూ.508 కోట్లు తీసుకున్నారంటూ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అభియోగాలు మోపింది. చార్జిషీట్‌లో యాప్ వ్యవస్థాపకుడు శుభం సోనీతోపాటు నగదు అందజేతలో సంబంధం ఉందంటూ అనిల్ అగర్వాల్ అలియాస్ అతుల్ అగర్వాల్, రోహిత్ గులాటీ, భీంసింగ్ యాదవ్, అసీందాస్‌ల పేర్లను ప్రస్తావించింది. ఈడీ చార్జిషీట్ ప్రకారం.. భఘేల్‌కు సొమ్ము ఇచ్చినట్టు యాప్ వ్యవస్థాపకుడు శుభం సోనీ విచారణలో అంగీకరించారు.



నిర్వాహకురాలి ఇంటి వద్ద బాధితులు

చిట్టీల పేరుతో రూ. కోటి టోకరా...

పాయకాపురం, జనవరి 6 : పాయకాపురం ప్రాంతంలో ఓ మహిళ చీటీలు, వడ్డీ వ్యాపారం పేరుతో కోటి రూపాయలు టోకరా వేసింది. స్థానికుల నుంచి వివిధ కారణాలతో డబ్బులు దండుకుని పరార్ కావడంతో శనివారం బాధితులు నున్న రూరల్ పోలీసులను ఆశ్రయించారు. వివరాల ప్రకారం స్థానిక రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీలో భీవరపు సునీత నివాసం ఉంటుంది. కిరాణా కొట్టు నిర్వహిస్తున్న ఆమె స్థానికురాలు కావడంతో పలువురు ఆమె వద్ద చీటీలు వేశారు. అంతే కాకుండా వడ్డీ ఇస్తానంటూ పలువురి వద్ద లక్షలాది రూపాయలు తీసుకున్నట్లు తెలుస్తుంది. డ్వాక్రా గ్రూపును కూడా నిర్వహిస్తున్న ఆమె మహిళలు పొదుపు చేసుకున్న డబ్బును కూడా స్వాహా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. గత వారం రోజులుగా దుకాణం తెరవకపోవడం, ఫోన్ కూడా పనిచేయకపోవడంతో వడ్డెర కాలనీ బాధితులు పెద్ద ఎత్తున ఆమె దుకాణం వద్ద గుమిగూడారు. సమాచారం అందుకున్న పోలీసులు వడ్డెర కాలనీ చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. సదరు మహిళ చేతిలో సుమారు 50 మంది వరకు మోసపోయినట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్రదర్ జోసఫ్ తంబి ఓ గొప్ప విశ్వాసి

ఫాదర్ విజయరాజు బావన



తంబి చిత్రపటంవద్ద ప్రార్థనలు

ఉంగుటూరు, జనవరి 6 : దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి దేవుని పట్ల సంపూర్ణ విశ్వాసం కలిగి జీవించారని, ఆయన విశ్వాసం ఎంతో మందిని ఆయన సమాధి వద్దకు నడిపిస్తోందని గుణదల పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ రెవ.ఫాదర్ విజయరాజు బావన అన్నారు. కృష్ణాజిల్లా పెదఅవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి సందర్భంగా నవదిన ప్రార్థనలు శనివారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఫాదర్లు గోపు ప్రవీణ్, కచ్చా కిషోర్‌కుమార్, గోపు అభిలాష్, మద్దాల రవితోపాటు విశ్వాసులు, భక్తులు, గురువులు, కన్యాస్త్రీలు, మఠవాసులు, సంఘపెద్దలు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు కేఆర్‌యూ జట్టు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 : చెన్నైలోని హిందూస్థాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి 16 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్‌లో పాల్గొనే కృష్ణా యూనివర్సిటీ నుంచి 16మందితో కూడిన జట్టు అక్కడకు పయనం అయ్యిం దని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ శనివారం తెలిపారు. జట్టుకు మేనేజర్‌గా కళాశాల పీడీ ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారని చెప్పారు.

అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ టోర్నీకి కృష్ణాజట్టు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 : కడప జిల్లా రాజంపేటలో ఈ నెల 12,13తేదీల్లో జరిగే అంతర్ జిల్లాల(రాష్ట్రస్థాయి)హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి కృష్ణా బాలికల జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తెలిపారు. నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరిగాయని, పలువురితో జట్టును అసోసియేషన్ సెక్రటరీ జె.సింహాచలం ప్రకటించారు. జట్టుకు కెప్టెన్‌గా బి.పుష్ప(కేబీఎన్), వి.గీతాశ్రీ(కృష్ణలంక, ప్రభుత్వ కళాశాల), షేక్ రేష్మా,వై.అంబిక(ఆర్‌సీఎం, విజయవాడ), జి.సుధారాణి, కె.సంజన,జి. సంకీర్తన, వి.లోహిత, పి.దుర్గాభవానీ, పి.నికిత(నున్న),జి. గంగాభవానీ (హనుమాన్ జంక్షన్)లు ఎంపికయ్యారు.



ఇరుముడుల సమర్పించేందుకు తరలివస్తున్న భవానీలు



ఆలయంలో చండీ హోమం

నేటితో ముగియనున్న భవానీ దీక్షల విరమణ

వన్‌టౌన్,జనవరి 6: భవానీదీక్షల విరమణలు హోరుగా సాగుతున్నాయి. దీక్షల విరమణలు శనివారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఆలయ వైదిక కమిటీ నిర్ణయం మేరకు ఐదురోజుల దీక్షల విరమణలు ఆదివారం ఉదయం పూర్ణాహుతితో ముగియనున్నది. ఈనెల 3న హోమగుండాలలో అగ్ని ప్రతిష్ఠాపనతో పాటు శతచండీయాగానికి శ్రీకారం చుట్టారు. 5న రాత్రి 11.30 గంటల వరకు 65 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 2.85 లక్షల లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. 13,080 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. 11,700 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. కాగా శనివారం ఈవో రామరావు అన్ని విభాగాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఒక స్టాల్‌లో అమ్ముతున్న ఆయిల్‌ను పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. లడ్డూ ప్రసాద విక్రయాలను పరిశీలించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

అన్న ప్రసాద వితరణకు విరాళం

దుర్గగుడిలో అన్నప్రసాద వితరణకు కృష్ణా జిల్లాకు చెందిన వడ్డి త్రివేణికుమార్ శనివారం ఆలయ అధికారులకు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. వడ్డి పూజిత పేరిట అన్న వితరణ చేయాలని కోరారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు

ముందుగానే వచ్చిన సంక్రాంతి... సిద్ధార్థలో మిన్నంటిన సంబరాలు





విజయవాడ కల్చరల్, జనవరి 6 :సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వరీ సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉదయాన్నే ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. తర్వాత సంక్రాంతి లక్ష్మి పేరుతో కళాశాల వేదిక మీద విద్యార్థినులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని వివరించారు. పండుగ విశిష్టతను వివరించి, వివిధ పోటీల్లో పాల్గొన్న వారికి, విజేతలకు బహుమతులు అందజేశారు. లెక్చరర్స్ విద్యార్థినులు పాల్గొన్నారు.

సీనియర్స్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీకి ఏర్పాట్లు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 : ఆంధ్రప్రదేశ్ లాన్‌టెన్నిస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ టెన్నిస్ కాంప్లెక్సు సీనియర్ మాస్టర్స్-200 ఐటీఎఫ్(ఎస్వీ.రామయ్య మెమోరియల్ టెన్నిస్) టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు టోర్నీ డైరెక్టర్ డాక్టర్ సూతగాని రామకృష్ణ తెలిపారు. శనివారం విలేకర్ల సమావేశంలో రిఫరీ, సూపర్‌వైజర్ ప్రవీణ్‌నాయక్ మాట్లాడారు. 8న అధికారికంగా శాప్ వీసీ, ఎండీ ధ్యాన్‌చంద్ర ప్రారంభిస్తారన్నారు.

రూ.1.11కోట్ల విలువైన నకిలీ సిగరెట్ల సీజ్

విజయవాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : నకిలీ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేశారు. బిహార్ నుంచి మెసర్స్ వెంకటేశ్వరట్రేడర్స్ పేరుతో ఏపీ16టీఎస్7933 వ్యాన్‌లో విజయవాడకు వచ్చాయి. వీటిని ఇన్వాయిస్‌లో రూ.4,37,157 చూపించారు. సమాచారం తెలుసుకున్న అధికారులు తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు.

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం



గన్నవరం, జనవరి 6: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరా బాద్ నుంచి ప్రత్యేక విమానంలో శనివారం ఇక్కడికి విచ్చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జూపల్లి సురేష్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మండవ లక్ష్మీ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మండవ అన్వేష్, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు షేక్ అబుల్యాజ్ స్వాగతం పలికారు.

అంగన్వాడీలపై ఎస్మా అప్రజాస్వామికం

● యూటీఎఫ్ ఖండన

గవర్నర్‌పేట, జనవరి 6: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత 26 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు న్యాయం చేయకుండా వారిపై ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లు శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎస్మా చట్టం ద్వారా అంగన్వాడీలను ఎమర్జెన్సీ సర్వీసులో చేర్చి 6 నెలల పాటు సమ్మెలు, నిరసనలు నిషేధమంటూ జీవో విడుదల చేయడం దుర్మార్గమని, బెదిరింపులకు దిగటం సమంజసం కాదని అన్నారు. వెంటనే ఎస్మా చట్టాన్ని ఉపసంహరించి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 6 : నగరంలోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కే.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9550671671 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

13 నుంచి వెంకమ్మ పేరంటాలమ్మ జాతర

ఇరిగేషన్ స్థలంలో వాహనాల పార్కింగ్



ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీలు

గుణదల, జనవరి 6: రామవరప్పాడులోని వెంకమ్మ పేరం టాలమ్మ జాతరకు ఇరిగేషన్ స్థలమే వాహనాల పార్కింగ్‌కు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ట్రాఫిక్ ఏసీపీ సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతిని పురస్కరిం చుకుని ఈనెల 13 నుంచి 18 వరకు రామవరప్పాడు వెంకమ్మ పేరంటా లమ్మ ఆలయం వద్ద జరగనున్న జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు, ట్రాఫిక్ ఏసీపీ సురేష్ కుమార్‌రెడ్డి, పటమట సీఐ కాశీవిశ్వ నాథ్‌లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి ఆధ్వర్యంలో శనివారం పర్యవేక్షించారు. జాతరకు వచ్చే భక్తులు తమ తమ ఆటోలు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా రామవరప్పాడు వంతెనకు జాతీయ రహదారికి మధ్య 30 సెంట్ల ఇరిగేషన్ స్థలం అనువుగా ఉంటుం దని పార్కింగ్ స్థలంగా నిర్ణయించారు. ప్రసాదంపాడు నిర్వహించనున్న గ్రామోత్సవానికి పెద్దలు సహకరించాలని పటమట సీఐ కాశీవిశ్వనాథ్ కోరారు.

కాంట్రాక్టర్ల బారి నుంచి తప్పించండి

వన్‌టౌన్, జనవరి 6: కాంట్రాక్టర్ల బారి నుంచి తప్పించి తమకు నేరుగా వేతనాలు పొందే వెలుసుబాటున్న ఆప్కాస్‌లో చేర్చాలని ఏపీ రూరల్ వాటర్ సప్లయ్ (ఆర్‌డబ్ల్యూఎస్), శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. తుమ్మలపల్లివారి క్షేత్రయ కళాక్షేత్రంలో శనివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డి. చిన్న కొండయ్య, జనరల్ సెక్రటరీ సీహెచ్ ప్రసాదబాబు తదితరులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు ప్రభుత్వం నుంచి ప్రతి కార్మికుడి పేరు మీద నెలకు రూ.22 వేలు డ్రా చేసి ఆరు నుంచి పన్నెండువేలు మాత్రమే ఇస్తున్నారన్నారు.

సండే సెలబ్రిటీ



సంక్రాంతి వచ్చేస్తోంది. పల్లెలు, పట్టణాలు పండగ వాతావరణాన్ని సంతరించుకొంటుంటే.. కొత్త చిత్రాల విడుదలకు థియేటర్లు సిద్ధమవుతున్నాయి. ఎప్పటిలానే ఈసారి కూడా మహేష్, వెంకటేష్, నాగార్జున తదితర పెద్ద హీరోల సినిమాలు సంక్రాంతి బరిలో పోటీపడుతున్నాయి. అదే సమయంలో చిన్న చిన్న వివాదాలూ చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' అధినేత... నాగవంశీని 'నవ్య' పలుకరించింది.

మాకు తెలియందేదో ప్రేక్షకులకు తెలుసు

ఈమధ్య సోషల్ మీడియాలో 'గుంటూరు కారం'పై రకరకాల వివాదాలు చెలరేగుతున్నాయి. కారణమేదైనా ఉందా?

మాకు సోషల్ మీడియాతో ఎటువంటి సమస్య లేదు. అభిమానులు, ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు. అయితే కొందరు పనిగట్టుకొని ఫేక్ న్యూస్‌ను క్రియేట్ చేస్తున్నారు. మహేష్, త్రివిక్రమ్ సినిమా అనే సరికి అంచనాలు భారీగా ఉంటాయి. ఎక్కువమంది చదువుతారు. వ్యూస్ పెరుగుతాయి. ఈ వార్తలకు స్పందిస్తే... అవి నిజమనుకుంటారు. లేకపోతే హంగామా చెలరేగుతుంది. ఉదాహరణకు పూజా హెగ్డేకు తేదీలు కుదరలేదు. దాంతో ప్రాజెక్టు నుంచి వైదొలగారు. అదే విధంగా సినిమాటోగ్రాఫర్ వినోద్‌గారు కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల పని చేయలేకపోయారు. ఇవి తప్ప మిగిలినవన్నీ అబద్ధాలే! కొందరు 'హీరోకు... డైరెక్టర్‌కు పడలేదని'.. 'కథ కాపీ' అని రకరకాల ప్రచారాలు చేస్తున్నారు. ఈ సినిమా పాటలు చూస్తే... మహేష్ గారు ఈ ప్రాజెక్టులో ఎంత ఇన్వాల్వ్ అయ్యారో తెలుస్తుంది.

మీరు, దిల్‌రాజుగారు సోషల్ మీడియాలో వచ్చే సినిమా రివ్యూలపై ఇటీవల స్పందించారు కదా!

రివ్యూలపై గొడవ ఎప్పటి నుంచో ఉంది. కానీ ఈమధ్య మేమిద్దరం మాట్లాడటానికి ఒక కారణముంది. నా ఉద్దేశంలో తెలుగు సినిమా పరిశ్రమ ప్రస్తుతం ఒక కఠినమైన ప్రయాణం మొదలు పెట్టింది. ఇంతకు ముందులా ఓటీటీ కంపెనీలు అన్ని సినిమాలూ కొనటంలేదు. చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాయి. హిందీ మార్కెట్, శాటిలైట్ మార్కెట్‌ల ద్వారా వచ్చే ఆదాయం దాదాపు జీరో అయిపోయింది. థియేటర్ల ద్వారా వచ్చే ఆదాయంపైనే సినిమాలు ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి సమయాల్లో నెగెటివ్ రివ్యూలవల్ల తెలియని హాని జరుగుతోంది. అందువల్ల రివ్యూలను విడుదలైన రోజు ఉదయం కాకుండా... మూడు షోల తర్వాత సాయంత్రం ఇవ్వమని అడుగుతున్నాం.

సోషల్ మీడియాలో వచ్చే రివ్యూలకు ప్రేక్షకులు ప్రభావితమయిపోతారా?

రివ్యూలు చదివి సినిమాలు చూస్తారనే విషయాన్ని నేను కూడా పూర్తిగా అంగీకరించను. అయితే ప్రేక్షకులు ఒక అభిప్రాయానికి రాకముందే జడ్జిమెంట్ ఇచ్చేయటంవల్ల సినిమాకు హాని కలుగుతుంది కదా. ప్రేక్షకులకు కూడా ఒక అవకాశం ఇవ్వాలి కదా! ఒక ఉదాహరణ చెబుతాను... 2023లో బ్లాక్‌బస్టర్ సినిమాలకు ఎక్కువమంది మంచి రివ్యూలు ఇవ్వలేదు. అయినా ఆ సినిమాలు పెద్ద హిట్ అయ్యాయి కదా! నా ఉద్దేశంలో ఒక సినిమా హిట్ అవ్వాలన్నా... ఫట్ అయినా ప్రేక్షకులదే ప్రధాన పాత్ర. సినిమాను జడ్జ్ చేయటం ప్రేక్షకులకు తెలిసినంతగా ఎవ్వరికీ తెలియదు. మొదటి పోస్టర్, ట్రైలర్ రిలీజ్ అయిన వెంటనే 'చూడాలా? వద్దా?' అనేది ప్రేక్షకులు నిర్ణయించుకుంటున్నారు. మాకు తెలియంది ఏదో ప్రేక్షకులకు తెలుసు. అందుకే వారు మంచి ఓపెనింగ్స్ ఇచ్చిన సినిమాలు హిట్ అవుతున్నాయి. ఇవ్వనివి పోతున్నాయి.

సినిమా బిజినెస్ ఇంత రిస్కీగా ఉన్నప్పుడు కొన్ని నిర్మాణ సంస్థలు ఎక్కువ సినిమాలు ఎలా చేయగలుగుతున్నాయి?

కోవిడ్ సమయంలో, ఆ తర్వాత... ఓటీటీలో సినిమాలు చూసేవారి సంఖ్య బాగా పెరిగింది. కోవిడ్ సమయంలో ఓటీటీ కంపెనీలు ఎక్కువగా సినిమాలు కొనటం మొదలుపెట్టాయి. దీంతో ఎక్కువ సినిమాలు తీయటం మొదలుపెట్టారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ఓటీటీ కంపెనీలు ఆచితూచి సినిమాలు కొంటున్నాయి. కొన్ని సినిమాలే ఎందుకు కొంటున్నారనే విషయం మనకు తెలియదు. మనకు వాళ్లు చెప్పరు. అంతే కాకుండా హిందీ మార్కెట్, శాటిలైట్ రైట్స్‌వల్ల ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. దీని వల్ల నా ఉద్దేశంలో ఈ ఏడాది సినిమాల సంఖ్య తగ్గుతుంది. కథాబలం ఉండి... ఓటీటీకి ఎంత వస్తుంది? హిందీకి ఎంత వస్తుంది? శాటిలైట్‌కు ఎంత? అనే విషయాలు చూసుకొనే సెట్స్ మీదకు వెళ్తారు. కంటెంట్ మీద నమ్మకం ఉంటేనే ప్రేక్షకులకు నచ్చుతుందనే ఆలోచనతో సినిమా తీయాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. థియేటర్స్ నుంచి వచ్చే ఆదాయమే సినిమాకు ప్రధానమైన వనరుగా మారుతోంది. అంతే కాదు... భవిష్యత్తులో ప్రేక్షకులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని సినిమాలు తీస్తే సరిపోదు. ఓటీటీ కంపెనీలను కూడా దృష్టిలో పెట్టుకొని తీయాలి.



ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు బరిలో ఉన్నాయి. ఒకటి (ఈగల్) వెనకడుగు వేసింది. 'హనుమ' సినిమా థియేటర్లకు సంబంధించి వివాదాలు చెలరేగుతున్నాయి. వీటిని ఎలా అర్థం చేసుకోవచ్చు?

'ఈగల్' వెనకడుగు అనే మాట నేను అంగీకరించను. పండుగకు ఐదు సినిమాలు ఉన్నాయి కాబట్టి వేరే డేట్స్ చూసుకుంటే బావుంటుందని ఛాంబర్... నిర్మాతలు అందరినీ కోరింది. విశ్వప్రసాద్‌గారు, రవితేజగారు అంగీకరించి 'ఈగల్'ను పోస్ట్‌పోన్ చేశారు. ఇది పరిశ్రమకు మంచి పరిణామం. ఇక థియేటర్లకు సంబంధించిన విషయాలపై నేను మాట్లాడను.

ఈ సంక్రాంతికి 4 సినిమాలు బరిలో ఉన్నాయి. ఒకటి(ఈగల్) వెనకడుగు వేసింది. 'హనుమాన్' సినిమా థియేటర్లకు సంబంధించి వివాదాలు చెలరేగుతున్నాయి.. వీటిని ఎలా అర్థం చేసుకోవచ్చు?

'ఈగల్' వెనకడుగు వేసిందనే అనే మాట నేను అంగీకరించను. పండుగకు ఐదు సినిమాలు ఉన్నాయి కాబట్టి వేరే డేట్స్ చూసుకుంటే బావుంటుందని ఛాంబర్.. అందరు నిర్మాతలనూ రిక్వెస్ట్ చేసింది. విశ్వప్రసాద్‌గారు, రవితేజగారు అంగీకరించి ఈగల్‌ను పోస్ట్‌పోన్ చేశారు. ఇది పరిశ్రమకు మంచి పరిణామం. ఇక థియేటర్లకు సంబంధించిన విషయాలపై నేను మాట్లాడను. కానీ విమ్మల్ని ఒక ప్రశ్న వేస్తాను. "మీరు పండగకు సినిమాకు వెళ్లాలంటే దేనికి వెళ్తారు?". కచ్చితంగా పెద్ద హీరో సినిమాకే వెళ్దామనుకుంటారు. ఈ సారి ఎక్కువ మంది మహేష్‌బాబు సినిమాకే వెళ్లాలనుకుంటారు. ఆయనను చూసిన తర్వాతే మిగిలిన వాళ్లను చూడాలనుకుంటారు. అలాంటప్పుడు ఎవరికి ఎక్కువ థియేటర్లు ఇవ్వాలి? ఇదంతా డిమాండ్ అండ్ సప్లై. దీనిలో ఎవరినీ మోసం చేసింది లేదు.. తొక్కేసిందీ లేదు. ఎక్కువ మంది చూడాలనుకుంటారు కాబట్టే వాళ్లను పెద్ద హీరోలంటారు.. వారికి ఎక్కువ క్రేజ్ ఉంటుంది.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

> త్రివిక్రమ్-మహేష్ కాంబినేషన్‌లో 12 సంవత్సరాల తర్వాత సినిమా వస్తోందని ప్రేక్షకులు ఎంతో ఎదురుచూస్తున్నారు. మాది అచ్చమైన తెలుగు సినిమా. మహేష్ గారిని చూడటానికి రెండు కళ్లు చాలవు. త్రివిక్రమ్ గారి పెన్ అద్భుతం. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు అన్ని రుచురూ ఉన్న పెద్ద విందును అందిస్తున్నాం. ఇక ఈ సినిమా నిర్మాణంలో మహేష్‌గారు అందించిన సహకారం అద్భుతం. ఆయనతో అన్ని విషయాలూ స్వేచ్ఛగా చెప్పగలుగుతాం.

సంబంధం లేదు...

కొందరు మాపై కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటిదే 'కీర్తికిరీటాలు' నవలతో పోలిక. నేను ఆ నవల చదవలేదు. నేను ఈ వార్తలు సోషల్ మీడియాలో రావటం మొదలుపెట్టిన తర్వాత బాబాయ్ ('హారిక -హాసిని క్రియేషన్స్' రాధాకృష్ణ)ను అడిగాను. "దానికి... దీనికి అసలు సంబంధం లేదురా" అన్నాడు బాబాయ్.

> **2024లో...**
> గుంటూరు కారంతో ఈ ఏడాది మొదలవుతోంది. 'డీజే టిల్లు స్క్వేర్', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', బాలకృష్ణ గారు, రవితేజ గారి సినిమాలు... ఇలా ఒక దాని తర్వాత మరొకటి ఉన్నాయి. వీటితో పాటుగా ఒక హైస్కూల్ రొమాన్స్ స్టోరీ కూడా ప్లాన్ చేశాం.



భరద్వాజీయం

ఇది సెన్సార్‌బోర్డు 'వ్యూహ'మా?

ఈ మధ్య సినిమాలు చూస్తుంటే సెన్సార్ బోర్డు... నిబంధనల్ని మార్చిందేమో అనిపిస్తోంది. ఒకవేళ కొత్త నిబంధనలు ఏమన్నా తీసుకువచ్చిందేమో... నాకైతే తెలియదు. ఎందుకంటే ఈ మధ్య సినిమాల్లో వయొలెన్స్ బూతులు 'కట్స్' లేకుండా అలాగే వచ్చేస్తున్నాయి. ఇవన్నీ సమాజం మార్పుతో ఏర్పడిన పరిస్థితులు అయ్యుండవచ్చు. కానీ మా రోజుల్లో సెన్సార్ బోర్డు చాలా కఠినంగా వ్యవహరించేది. మనిషిని పోలిన మనిషిని పెట్టినా... ఎవరైనా జీవించివున్న ప్రముఖుల పేరు వాడినా అనుమతించేవారు కాదు. అప్పట్లో ఒక సినిమాలో ఎన్టీఆర్ గారు... సత్యనారాయణకు సత్యసాయిలా గెటప్ వేశారు. దానికి సెన్సార్ బోర్డు అభ్యంతరం తెలిపింది. నాలుగైదు నెలలు పోరాడి, చివరకు మార్పులు చేసి దాన్ని వదిలారు. అలాగే ఫ్యామిలీ ప్లానింగ్, ఎమర్జెన్సీ మీద, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మీద విమర్శనాత్మకంగా రామారావు గారు చాలా చిత్రాలు తీశారు. మాదాల రంగారావు గారు ఓ సినిమా విడుదల కోసం ఏడాదికి పైగా కోర్టుల చుట్టూ తిరిగారు. ఆర్ నారాయణమూర్తి గారు కూడా తన రెండు మూడు చిత్రాలకు అలానే కోర్టుకు వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. నా 'మన్మథ సామ్రాజ్యం'లో 'పీఎం, ఎఫ్ఎం' అనే రెండు పదాలు వాడామని సెన్సార్ బోర్డువాళ్లు నన్ను ఆరు నెలలు తిప్పారు. చివరకు ఆ పదాలు తీసేదాకా ఒప్పుకోలేదు. 'మినిస్టర్' అనచ్చు కానీ, ఫైనాన్స్, ప్రైమ్ మినిస్టర్ అని వాడకూడదన్నారు. తరువాత 'స్వర్ణక్క'లో 'రాస్కెల్' అంటే... ముఖ్యమంత్రి అలాంటి భాష వాడకూడదని ఆ పదం కట్ చేయమన్నారు. అప్పట్లో అంత కఠినంగా వ్యవహరించేవారు సెన్సార్ బోర్డువారు. ఇప్పుడైతే 'రాస్కెల్' కాదు... అసలు ఆ 'నాలుగు అక్షరాల ఆంగ్ల పదం' లేకుండా సినిమాలో మగవాళ్లు, ఆడవాళ్లు మాట్లాడుకోవడం లేదు. ఆ పదం లేకపోతే మోడ్రన్‌గా అనిపించుకోదని భావిస్తున్నట్టున్నారు.

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే... ఇటీవల కొన్ని చిత్రాలు వస్తున్నాయి. జీవించివున్న రాజకీయ నాయకుల వేషధారణలో, వాళ్ల పేర్లనే పెట్టి, వాళ్ల మీదే సినిమాలు తీస్తున్నారు. ఇది చాలా దుర్మార్గమైన విషయం. గతంలో మేం ఫిలిమ్ ఛాంబర్‌లో ఉన్నప్పుడు 'చిరంజీవి' అని ఒక టైటిల్ రిజిస్ట్రేషన్‌కు వచ్చింది. 'చిరంజీవి గారు ఒక సెలబ్రిటీ. మీ సినిమాలో ఏం చూపిస్తారో మాకు తెలియదు కాబట్టి ఆయన నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకురండి. అప్పుడు టైటిల్ రిజిస్టర్ చేస్తాం' అని చెప్పాం. సెన్సార్ బోర్డు కూడా వారికి అదే సూచించింది.

కానీ ఇప్పుడు ఏంచేస్తున్నారు? ఆ మధ్య 'యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' అని మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ గారి మీద ఎవరో సినిమా తీశారు... అచ్చం ఆయనలానే గెటప్ వేసి. అలానే 'లక్ష్మీస్ ఎన్టీఆర్' కూడా. ఇప్పుడు 'వ్యూహం'. కోర్టు కేసులతో ఆగినట్టుంది.

భావప్రకటనా స్వేచ్ఛ అనేది వంద శాతం అందరికీ ఉంటుంది. ఏది కావాలనుకొంటే అది చెప్పచ్చు. ఏది కావాలనుకొంటే అది తీయచ్చు. అయితే ఎదుటివాడికి కూడా అదే హక్కు ఉంటుంది కదా. మన హక్కులను మనం పరిరక్షించుకోవాలని ఎలా అనుకొంటున్నామో... ఎదుటివారి హక్కులకు మనవల్ల భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనదే కదా. రాజకీయ నాయకుల విషయమే తీసుకొందాం... ఒక నాయకుడు నాకు నచ్చవచ్చు. మీకు నచ్చకపోవచ్చు. నేను అనుకున్న నాయకుడు మంచివాడు అయ్యుండచ్చు... మీరు అనుకున్న నాయకుడు దుర్మార్గుడై ఉండవచ్చు... నా దృష్టిలో. అలాగే మీ కోణంలో అది రివర్స్ అవ్వచ్చు. మన దృక్కోణాన్ని తెలియజేయడానికి వేదిక సినిమా కాదు. విడిగా బహిరంగ సభల్లోనో, మరెక్కడో ఆ పార్టీల తరుఫున వెళ్లి, మన అభిప్రాయాన్ని చెప్పవచ్చు. ఎవరినైనా విమర్శించవచ్చు. కానీ... దాన్ని తీసుకువచ్చి సినిమాల్లో పెట్టడంవల్ల కలిగే ప్రయోజనం ఏంటి? గతంలో ఎన్టీఆర్ గారి మీద చాలా చిత్రాలు తీశారు. ఒక సంవత్సరంలో నాలుగైదు సినిమాలు ఆయనపై వచ్చాయి. అయినా ఆ ఏడాది ఎన్టీఆర్ ఎన్నికల్లో గెలిచారు. వాటివల్ల ఆయనకు నష్టమేం జరగలేదు. మొన్న 'యాత్ర', 'కథానాయకుడు' తదితర బయోపిక్స్ తీశారు. మరి వీటిల్లో వాళ్ల గెటప్‌లతోనే చేశారు కదా అని మీరు అడగవచ్చు. బయోపిక్స్ అనుకున్నప్పుడు సంబంధిత కుటుంబ సభ్యుల అనుమతి తీసుకొంటారు. ఇప్పుడు కూడా ఎవరి కథైతే చెబుదామనుకున్నారో... వాళ్ల కుటుంబాల



సమ్మతితో చేసుకోవచ్చు. ఆ తరువాత మీకు నచ్చింది తీసుకోవచ్చు. అలాకాకుండా వాళ్ల అనుమతి లేకుండా... వాళ్లను పోలిన మనుషులనే పెట్టి, వాళ్ల పేర్లే పాత్రలకు పెట్టి, వాళ్లను మనం కించపరచడం ఎంతవరకు సబబు? ఆ హక్కు మనకు ఉందా? అలాంటి చిత్రాల విడుదలకు సెన్సార్ అనుమతించవచ్చా? నాకు తెలిసినంతవరకు ఆ అవకాశం లేదు. కానీ సెన్సార్‌వారు ఓకే చెబుతున్నారు.

సినిమా అనేది అందరూ చూసేలా ఉండాలి. అప్పుడైతేకానీ సినిమాకు డబ్బు రాదు. మనం ఒక పార్టీకో, ఒక వర్గానికో చెందినవారం కాదు. అలాంటప్పుడు ఒక వర్గాన్ని ఆకాశానికెత్తుతూ... రెండో వర్గానికి దూరంగా ఉండడం అవసరమా? దానివల్ల మనకు వచ్చేదేమైనా ఉంటుందా? బహుశా ఒక పార్టీ నాకు... మరో పార్టీ మీకు డబ్బు ఇచ్చివుండవచ్చు... సినిమా చేయమని. అలా తీసినందువల్ల డబ్బు పోవడం తప్పిస్తే ఏ ప్రయోజనమూ ఒనగూరదు. ఎందుకంటే మనం మన చిత్రం ద్వారా ఏదైతే చెప్పదలుచుకున్నామో అవన్నీ యూట్యూబ్‌ల్లో కనిపిస్తాయి. మనం తీసుకొనేది కూడా అక్కడి నుంచే కదా. కొత్తగా కథలైతే రాసేది ఉండదు. ఒకవేళ తీసినా వాళ్ల పేర్లు పెట్టకుండా సెటైరికల్‌గా చేసుకోవచ్చు. కానీ ఒకరిని కించపరిచే సినిమాలవల్ల పరిశ్రమపై ప్రతికూల ప్రభావం పడుతుంది. నిజానికి ఇలాంటి చిత్రాలతో పరిశ్రమకు ఎలాంటి సంబంధం ఉండదు. కానీ బయటివారికి అవేవీ తెలియవు కదా. ఎవరో వచ్చి మీరెందుకు ఆపలేదని అడుగుతాడు. ఇంకొకొరు ఇంకోటేదో అంటారు.

కనుక ఈ తరహా ముద్ర పరిశ్రమపై పడకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒక సినిమా తీస్తున్నామంటే... అది ప్రజల్లోకి వెళ్లాలి. బాగా ఆడాలి. అప్పుడే డబ్బులు వస్తాయి. అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా మనపై ఉంటుందని గ్రహించాలి. లేదు... 'నా డబ్బు... నా ఇష్టం. నాకు సామాజిక బాధ్యత లేదు. దానికోసం నేను ఇక్కడికి రాలేదు. నా ఇష్టం వచ్చింది నేను చేస్తాను' అనుకొంటే చేసుకోవచ్చు. అయితే దాని వల్ల ఏ రకంగానూ లాభం ఉండదు... నష్టమే తప్ప

సాధారణంగా ఇక్కడకు ఒక ప్యాషన్‌తో వస్తాం. ఒక ప్యాషన్‌తో సినిమాలు తీస్తాం. ఆ ప్యాషన్ చచ్చిపోయి... ద్వేషాన్ని పెంచుకొంటూ... ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం అనేది ఎవరికీ ఆమోదయోగ్యం కాదు. అదే సమయంలో ఎన్టీ రామారావు గారు చెప్పినట్టు... ఇటువంటి సినిమాలను అసలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఎక్కడో విన్నాను... అప్పట్లో రామారావు గారి మీద ఏదో సినిమా చేసినందుకు కోట శ్రీనివాసరావును జనం కొట్టారని. ఆ తరువాత రామారావు గారికి ఎక్కడో కోట ఎదురుపడి మన్నించమని అడిగితే... 'ఏం పర్లేదు బ్రదర్' అంటూ స్పోర్టివ్‌గా తీసుకున్నారట. అలాగే ఎక్కడో కృష్ణగారు కలిస్తే... 'నా మీద ఇంకా ఎన్ని సినిమాలు తీస్తావ్' అని అడిగారట. అలా క్రీడాస్ఫూర్తితో ఉండాలి కానీ... కోర్టులకు వెళ్లి, కేసులు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే... ప్రచార ఆర్భాటమే కానీ ఆ సినిమాలవల్ల కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. తీసేవాళ్లకు తీయడం దండగ. వాటి మీద కోర్టుల చుట్టూ తిరగడం అంతకంటే దండగ. ఇరువురికీ సమయం వృథా తప్ప మిగిలేదేమీ ఉండదనేది నా అభిప్రాయం.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YMyPoqn లో చదవండి.

విడాకుల వేడుక

తెలంగాణలో వచ్చిన 'ఆహ్వానం' సినిమా గుర్తుందిగా! అందులో కథానాయిక... తన విడాకులను వేడుకగా జరిపేందుకు అతిథులను ఆహ్వానిస్తుంది. అప్పట్లో ఆ కొత్త కాన్సెప్ట్ కాస్త వింతగా అనిపించినా... అది 'రీల్ లైఫ్' అని సరిపెట్టేసుకున్నాం. కానీ ఇప్పుడు... చైనాలో సరిగ్గా అలాంటి 'సన్నివేశ'మే ఒకటి చోటు చేసుకుంది. చైనా గ్వాంగ్‌డంగ్ ప్రావిన్స్‌కు చెందిన 34 సంవత్సరాల సంగ్... తన నాలుగేళ్ల వైవాహిక జీవితానికి విడాకులతో ఘనంగా వీడ్కోలు పలికింది. ఊరంత పందిరి వేసి... ఊరూవాడను పిలిచి... మేళతాళాలతో పెళ్లి చేసుకోవడం చూస్తూనే ఉంటాం. కానీ భర్తతో బంధాన్ని తెంచుకున్న సందర్భాన్ని కూడా అంతే వైభవంగా, ఉత్సవంలా చేసుకుంది సంగ్. బడా బ్యానర్లు కట్టి, బంధువులు, సన్నిహితులను పిలిచి, భారీ స్థాయిలో ఖరీదైన పార్టీ ఒకటి ఏర్పాటు చేసింది. 'ఇక్కడితో ఈ వివాహ బంధం ముగిసింది' అంటూ తాటికాయంత అక్షరాలతో రాయించి... అతిథులతో తన ఆనందాన్ని పంచుకుంది.

అంతటితో అయిపోలేదు... పెళ్లికే కాదు విడాకుల వేడుకకూ కొన్ని ఆచారాలు



ఉంటాయంటూ... కొత్త సంప్రదాయానికి తెర తీసింది. మండుతున్న తొట్టిలో నుంచి అడుగు బయటకు పెట్టడం... తలపై ఆకులు పెట్టి స్నానం ఆచరించడం... ఇలా ఎన్నో ఉన్నాయి ఆ వేడుకలో. చివరకు అందరూ కలిసి 'బ్రేకప్ హ్యాపీలీ' అంటూ పాట పాడి... పంచభక్ష పరమాన్నాలతో విందు ఆరగించి... సంబరాలు జరుపుకున్నారు. అతిథులు బహుమతులతో సంగ్‌ను ఆశీర్వదించి వెళ్లారు. ఈ 'రియల్ లైఫ్' రీల్‌ను సంగ్ ఇటీవల తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. ఇక అక్కడి నుంచి లక్షల షేర్లు... లెక్కకు మించి లైక్‌లతో ఆమె ఇన్‌స్టా సూపర్ హిట్ అయింది. రాత్రికి రాత్రే ఒక సెలబ్రిటీ హోదా రావడంతో సంగ్ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది.



మాధ్యమం కాదు.. ప్రతిభే ముఖ్యం!

సీరియల్ నటిగా ఆమె హిందీలో పాపులర్. అక్షర, కొమాలికా.. అనే పాత్రల పేర్లు.. సీరియల్స్ వీక్షించే వారికి నోటెడ్. ఇండియన్ ఐడల్, బిగ్‌బాస్ లాంటి రియాలిటీ షోలో పేరు తెచ్చుకున్న ఈ ప్రతిభాశాలి పేరు హినా ఖాన్. కశ్మీర్‌లో పుట్టి పెరిగిన హినా ఖాన్ గురించి కొన్ని విశేషాలివే..



హినాఖాన్ ఇన్‌స్టాలో 19 మిలియన్ల ఫాలోవర్లున్నారు. ఆమెకు బుల్లితెర ప్రేక్షకుల ఫాలోయింగే.. ఇంతలా సోషల్ మీడియాలో పేరు తెచ్చిపెట్టింది. సినిమా కథానాయికగా ఏమాత్రం తీసిపోని క్రేజ్ ఆమెది.

బుల్లితెర అవకాశం..

'ఢిల్లీలో చదివేదాన్ని. నా స్నేహితురాలు వెళ్లమంటే.. ఒక ప్రొడక్షన్ హౌస్ వాళ్లను వెళ్లి కలిశా. టీవీ వాళ్లు 'ఇండియన్ ఐడల్' అవకాశం ఇచ్చారు. ఆ వెంటనే ఓ సీరియల్ ఆడిషన్‌లో పాల్గొన్నా. నా పని చేసుకుంటుంటే.. 'ఎంపిక య్యావు' అని కబురొచ్చింది. అలా ఆ సీరియల్ షూటింగ్ కోసం ముంబై వెళ్లా. ఆ సీరియల్ పేరు.. 'ఏ రిషితా క్యా కేల్‌తా హై'. ఆ పాత్ర పేరు అక్షర. షూటింగ్ జరుగుతూనే ఉంది. నా పాత్రకు మంచి పేరొచ్చింది. ప్రతిరోజూ కొత్త విషయం తెలుసుకునే దాన్ని. రోజురోజుకూ పాపులారిటీ పెరిగింది. అలా ఆ సీరియల్ ఎనిమిదేళ్లు నడిచింది. ఆ తర్వాత వెనక్కి చూసుకుంటే నేనేనా? అనిపించిందంటుంది హినా.

అలా.. లక్ష్యం కోసం!

హినాఖాన్‌కు ఎలాంటి సినిమా నేపథ్యం లేదు. ఈ ఫీల్డ్‌లో ఎవరూ లేరు. ఆమె ప్రతిభనే ముందుకు తీసుకెళ్లింది. 'మాధ్యమం ఏదన్నది కాదు.. ప్రతిభే ముఖ్యం' అంటుంది. ఖత్రోంకే కిలాడీ, బిగ్‌బాస్ 11 లాంటి షోలతో యూత్‌లో క్రేజ్ సంపాదించింది. ఆ తర్వాత 'కాసోతి జిందగీ కే' సీరియల్‌లో కొమలిక పాత్ర జనాలకు దగ్గరైంది. ఆ తర్వాత బిగ్‌బాస్ 14 రియాలిటీషోలో కనిపించింది. 'అసలు ఇతర అవకాశాలు తీసుకునేంత ఖాళీగా లేను. తెలీకుండానే పదిహేనేళ్ల పాటు గడిచిపోయాయి' అంటుంది హినా. బాగా నటించాలనే లక్ష్యంతోనే పని చేసిందామె. 'టెలివిజన్ తర్వాత ఓటీటీ డిఫరెంట్. స్టీరియోటైప్‌ను మార్చేసింది. ఇప్పుడు ఓటీటీలో మంచి కథలొస్తున్నాయి. పైగా ప్రేక్షకులకు ఆప్షన్స్ పెరిగాయి. అందువల్లనే కంటెంట్ ఉండేవే నిలబడతాయి' అంటుంది హినా.

అలా ఒత్తిడి చిత్తు..

సీరియల్స్‌తో పాటు 'హ్యాక్డ్', 'అన్‌లాక్' చిత్రాల్లో నటించింది. రెండు చిత్రాలను నిర్మించింది. 'ఎక్కడైనా, ఏ వృత్తిలో అయినా ఒత్తిడి ఉంటుంది. ఇక్కడ కూడా అంతే. అయితే ఒత్తిడిని తగ్గించుకోవటానికి కుటుంబంతో కలిసి విహారయాత్రలు వెళ్తా. కుటుంబానికే నా ఓటు. కొత్త ప్రాంతాలకు వెళ్లి తెలీని వ్యక్తులతో పాటు అక్కడి సంప్రదాయాలను తెలుసుకోవటం ఎంతో ఇష్టం' అంటుంది. ఆమె ప్రతిరోజూ జిమ్‌కు వెళ్తుంది. వ్యాయామం అనేది జీవనవిధానమంటూ చెబుతుంది. అవుట్‌డోర్ షూటింగ్‌లో జాగింగ్‌కు సమయం కేటాయిస్తానంటుంది. 'వ్యాయామం చేస్తేనే శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుంది. ఆశావహదృక్పథం కలుగుతుంది' అంటూ హినా చెప్పుకొస్తుంది. ఆమె ప్రస్తుతం రెండు ఓటీటీల్లో నటిస్తోంది. దీంతో పాటు రెండు చిత్రాలను అంగీకరించింది. 'ఎక్కడ ఉన్నా.. ప్రేక్షకుల అభిమానాలు. ఏ ప్లాట్‌ఫాం మీదున్నా.. ప్రతిభ ఉంటేనే నిలబడతాం' అంటుందామె.

సన్ మిషన్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

చేరుకోవటాన్ని మనం కొనసాగిస్తూనే ఉందాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేంద్రసింగ్ స్పందిస్తూ.. 'చంద్రుడిపై నడక నుంచి సూర్యుడి వద్ద డ్యాన్స్ వరకూ.. భారత్‌కు గొప్ప విజయాల్ని అందించిన సందర్భం' అంటూ హర్షం వ్యక్తం చేశారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి గత సెప్టెంబరు 2న పీఎస్ఎల్వీ-సీ57 వాహక నౌక ద్వారా ఆదిత్య ఎల్1 ప్రయోగాన్ని ఇస్రో చేపట్టింది. 16 రోజుల పాటు వ్యోమనౌక భూకక్ష్యలో భూమి చుట్టూ నాలుగుసార్లు తిరిగింది. అనంతరం భూమ్యాకర్షణశక్తిని దాటుకొని సూర్యుడి దిశగా పయనించింది. అంతరిక్షంలో 127 రోజుల పాటు 15లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి శనివారం సాయంత్రం 4గంటలకు ఎల్1 పాయింట్ వద్దకు చేరింది. సూర్యుడిపై అధ్యయనం చేసేందుకు ఇస్రో చేపట్టిన తొలి మిషన్ ఇది. సౌర వాతావరణాన్ని లోతుగా అధ్యయనం చేయడం ఆదిత్య ఎల్1 లక్ష్యం. ఐదేళ్లపాటు తన సేవలను అందించనుంది.

పలు అంశాలపై పరిశోధన

ఆదిత్య ఎల్ 1లో ఏడు పేలోడ్లు ఉన్నాయి. వీటిలోని ఎలక్ట్రో మ్యాగ్నెటిక్, పార్టికల్, మ్యాగ్నెటిక్ ఫీల్డ్ డిటెక్టర్ల ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు సూర్యుడిని అధ్యయనం చేయనున్నారు. ముఖ్యంగా ఫొటోస్పియర్, క్రోమోస్పియర్, కొరోనా (సూర్యుడి బాహ్య పొరలు)లపై దృష్టి పెడతారు. 'ఏడు పేలోడ్లలో నాలుగు సూర్యుడిని ప్రత్యక్షంగా పరిశీలిస్తాయి. మిగిలిన మూడు ఎల్-1 వద్ద ఉన్న కణాలు, క్షేత్రాలపై వివరాలు అందిస్తాయి. తద్వారా ఖగోళాంతర ప్రాంతాల్లో సోలార్ డైనమిక్స్ తాలూకు శాస్త్ర పరిశోధనలకు తోడ్పడతాయి' అని ఇస్రో వెల్లడించింది. ఇస్రో తదుపరి లక్ష్యం అంగారకుడేనని, 'మిషన్ టు మార్స్'ను చేపడతామని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమ్‌నాథ్ శనివారం వెల్లడించారు.

నీట్-పీజీ పరీక్షలు జూలై మొదటి వారంలో

న్యూఢిల్లీ, జనవరి 6: నీట్-పీజీ పరీక్షలు జులై మొదటి వారంలో నిర్వహించే అవకాశం ఉందని శనివారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్) నిర్వహించే అవకాశం లేదని వెల్లడించాయి. పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ (అమెండ్‌మెంట్) రెగ్యులేషన్స్-2018 బదులు పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ రెగ్యులేషన్స్-2023ను ఇటీవల ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నెక్స్ట్ విధానం అమల్లోకి వచ్చేవరకు ప్రస్తుతమున్న నీట్-పీజీ పరీక్షలు కొనసాగుతాయి.

'ఆయుష్మాన్'కు వైఎస్సార్ పేరెలా పెడతారు?

- అధికారులపై మండిపడ్డ మంత్రి భారతీ పవార్
- ఆరోగ్య కేంద్రం బయట గంట సేపు నిల్చొని నిరసన



ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం బయటే నిల్చున్న కేంద్ర మంత్రి

జగ్గయ్యపేట, జనవరి 6: కేంద్ర నిధులతో నిర్మించిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం తొర్రగుంటపాలెంలో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి వైఎస్సార్ పేరు పెట్టడంపై కేంద్ర ఆరోగ్య మంత్రి భారతీప్రవీణ్ పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం పూర్తయ్యాక తొర్రగుంటపాలెంలో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించేందుకు వచ్చారు. ఆరోగ్యకేంద్రం పేరు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ అని ఉండడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిధులతో నిర్మించిన భవనానికి ఆ పేరు ఎలా పెట్టారని ప్రశ్నించారు. విషయం తేలాకనే లోపలకు వస్తానని గంటకుపైగా భీష్మించారు. వారం రోజుల్లో కేంద్రానికి పేరు మార్చి నిబంధనల ప్రకారం బోర్డులు ఏర్పాటు చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ రికార్డులను పరిశీలించగా, గత డిసెంబర్ 26 నుంచి ఓపీ లేకపోవటంతో రోగులకు ఇవేనా అందించే సేవలు అంటూ ప్రశ్నించారు. రికార్డుల్లో రిమార్కులు రాశారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని కేంద్ర మంత్రి భారతీ పవార్ ఆరోపించారు.

రాముడి విగ్రహం బరువు 1.5 టన్నులు!

- 51 అంగుళాల ఎత్తైనా మూర్తి ఎంపిక
- ఏటా రామనవమి రోజు సూర్యకిరణ స్పర్శ
- 26 తర్వాతే భక్తులు అయోధ్యకు రావాలన్న ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాయ్

అయోధ్య, జనవరి 6: అయోధ్యలో నిర్మితమవుతున్న రామమందిరంలో ప్రతిష్ఠించనున్న రాముడి విగ్రహం 51 అంగుళాల పొడవు, 1.5 టన్నుల బరువు ఉంటుందని ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ఐదేళ్ల పసి బాలుడిలోని అమాకత్వంతో, దైవత్వం ఉట్టిపడే విగ్రహాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఏటా చైత్ర మాసంలోని శుక్ల పక్షం తొమ్మిదో రోజైన శ్రీరామనవమి నాడు సూర్య భగవానుడే స్వయంగా శ్రీరాముడి విగ్రహాన్ని తన కిరణాలతో అభిషేకిస్తాడని, ఆ రోజున సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు ఆలయంలో కొలువైన విగ్రహం నుదిటిపై భానుడి కిరణాలు నేరుగా పడి ప్రకాశిస్తాయని పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు విగ్రహం ఎత్తును, దానిని ప్రతిష్ఠించే సింహాసనం ఎత్తును దీనికి అనుగుణంగా డిజైన్ చేసినట్లు వివరించారు. దక్షిణ భారతంలోని ఆలయాల స్ఫూర్తితో ఈ మందిర నిర్మాణం చేపట్టామని వివరించారు. 1947 ఆగస్టు 15 తనకు ఎంత ముఖ్యమో, 2024 జనవరి 22 కూడా అంతే ముఖ్యమని రాయ్ చెప్పారు. 22న దేశవ్యాప్తంగా ఉన్న 5లక్షలకు పైగా దేవాలయాల్లో పూజలు చేసి, ఘనంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జనవరి 26 తర్వాతే భక్తులు ఆలయ సందర్శనకు అయోధ్యకు రావాలని భక్తులకు సూచించారు. రామమందిర ప్రతిష్ఠా కార్యక్రమాన్ని జనవరి 22న దేశవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను ప్రజలంద రూ వీక్షించడమే లక్ష్యంగా బూత్ స్థాయిలో భారీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించి నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, రామమందిర ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్య నుంచి రామజ్యోతిని కాశీకి తెచ్చేందుకు వారాణసీకి చెందిన నజీన్ అన్సారీ, నజ్మా పర్వీన్ ముందుకొచ్చారు. ఆ జ్యోతిని చేతబట్టి ఊరూరా తిరుగుతూ శ్రీరాముడు తమ పూర్వీకుడని, ప్రతి భారతీయుడి డీఎన్ఏ ఒక్కటేననే సందేశాన్ని వ్యాప్తి చేయనున్నారు.

ఆర్కే: రాజకీయంగా జగన్‌తో సఖ్యత లేదు కదా!

రేవంత్: లేదు. నేను రాహుల్ గాంధీ పీఎంకావాలని అనుకుంటుంటే.. ఆయన నరేంద్ర మోదీ కావాలని అనుకుంటున్నారు. కేసీఆర్‌ను ఓడించాలని నేను అనుకుంటే... ఆయనను గెలిపించాలని జగన్ అనుకున్నారు. అయినా...నేను ఆయన మా ప్రత్యర్థి అని అనుకోవడం లేదు. నాకు అంత అవసరం లేదు. కర్ణాటక, తమిళనాడు ఎంతో, ఏపీ కూడా అంతే.



మా ఓటమికి జగన్ చాలా చేశారు

- కేసీఆర్‌ను గెలిపించాలని అనుకున్నారు
- పక్కరాష్ట్ర సీఎంకు ఫోన్ చేయడం మర్యాద
- జగన్ ఆ పని కూడా చేయలేదు
- కలిసి పరిష్కరించుకోవాల్సిన అంశాలున్నాయి కదా!
- ఏపీలో షర్మిలకు సహకరిస్తాం!
- ఆమె మా పార్టీ నాయకురాలు
- 'బిగ్ డిబేట్'లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తాను తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాక ఏపీ సీఎం జగన్ మర్యాదపూర్వకంగానైనా తనకు ఫోన్ చేయలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. కాలం కలిసి వస్తే ఇవాళ కాకపోతే రేపైనా ఏపీలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో పాల్గొన్నారు. సీఎం హోదాలో రేవంత్ ఇచ్చిన తొలి ఇంటర్వ్యూ ఇదే కావడం విశేషం. ఇందులో ఆయన పేర్కొన్న ముఖ్యాంశాలు ఇవి...

ఆర్కే: తెలంగాణలో కాంగ్రెస్ గెలిచి మీరు సీఎం కావడంతో ఏపీలో చంద్రబాబుకు బలం వచ్చిందనే అభిప్రాయం నిజమేనా.

రేవంత్: కర్ణాటకలో కాంగ్రెస్ గెలవడం వల్ల తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులకు మనోధైర్యం వచ్చింది. కేసీఆర్, జగన్ కలిసిపోయి ఉన్నారు. సహజంగా కొత్తగా సీఎం అయితే కర్టసీ కోసం అయినా పక్క రాష్ట్రాల సీఎంలు ఫోన్ చేస్తారు. జగన్ నుంచి మాత్రం నాకు ఫోన్ రాలేదు. నేను సీఎం కావడం ఆయనకు ఇష్టం లేదేమో అనేది తెలియదు. కానీ.. ఇద్దరం కలిసి పరిష్కరించుకోవాల్సిన సమస్యలు ఉన్నాయి కదా!

ఆర్కే: మీరు సీఎం కావడం ఆయనకు ఇష్టం లేదేమో!

రేవంత్: అది నాకు తెలియదు.

ఆర్కే: మరో రెండు నెలలే కదా ఆయనకు... ఏముందిలే అనుకున్నారేమో. మీ ఇద్దరి మధ్య అంతకుముందు వైరం ఉందా?

రేవంత్: నేను ఇవతల (విపక్షంలో) ఉన్నప్పుడు అగ్రెసివ్‌గా ఉండేవాడిని. రాజశేఖర్ రెడ్డితోనే కొట్లాడేవాడిని. అదే పరంపర కొనసాగింది. జగన్‌తో వ్యక్తిగత వైరంలేదు. కామన్ ఫ్రెండ్స్ ఉన్నారు.

ఆర్కే: ఢిల్లీలో మీరు డిన్నర్ ఇస్తే దానికి వచ్చిన వైసీపీ ఎంపీలను జగన్ తిట్టారట. ఇవాళ కూడా ఒక ఎంపీని పట్టుకుని రేవంత్ రెడ్డిని టికెట్ అడుక్కోండి అని అన్నారట!

రేవంత్: మేమూ టికెట్లు ఇస్తాం. ఏపీలో 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే సీట్లు ఉన్నాయి. షర్మిలతోనే ఇప్పిస్తా. జగన్, చంద్రబాబు నాయుడికి ఎన్ని బీఫాంలు ఉన్నాయో మాకూ అన్నే ఉన్నాయి కదా! తెలంగాణలో కాంగ్రెస్ బతకనే బతకదు.. అయిపోయింది అన్నారు కదా! అదునైనప్పుడు పంట పండేది ఎంత సేపు. కాలం కలిసొస్తే ఇవాళ కాకపోయినా రేపైనా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి మారుతుంది.

ఆర్కే: ఏపీకి కాబోయే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పెళ్లి కార్డు తీసుకుని మీ ఇంటికి వచ్చారు. రాజకీయాలు మాట్లాడుకున్నారా?

రేవంత్: షర్మిల మా పార్టీ నాయకురాలు. తప్పకుండా మా మధ్య రాజకీయాలు చర్చ జరుగుతాయి. నా వంతు మద్దతు ఉంటుంది. ఏపీలో పరిస్థితులు చక్కదిద్దాలి. అన్నీ రకాలుగా నైతికంగా, రాజకీయంగా నేను అండగా నిలవాల్సిన బాధ్యత నాపై ఉంది. ఎన్నికల్లో లీడ్ చేయాలి.


ఆర్కే: తెలంగాణలో అధికారంలోకి వచ్చాక.. ఏపీలో రాహుల్‌గాంధీకి ఆశ పెరిగినట్లు ఉంది.

సీఎం: పార్టీపై నమ్మకం వచ్చింది. ఏపీలో పార్టీ బలోపేతానికి, విస్తరణకు అవసరమైన సహకారం ఇవ్వాలి. షర్మిలకు మద్దతు ఇస్తే పార్టీకి ప్రయోజనం అని చెబితే... ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా ఆ దిశగా ముందుకు వెళతా.

ఆర్కే: మొన్న ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు ఫండింగ్ చేయకుండా జగన్ కట్టడి చేశారట కదా.. నిజమేనా?

సీఎం: ఇంకా చాలా విషయాలు నాకు తెలుసు. సీఎంగా అవన్నీ ఇప్పుడు చెప్పలేను.

లోకం తీరు



కుల గణన, నిరుద్యోగంపై ఫోకస్

- భారత్ జోడో న్యాయ యాత్రలో వీటిపైనే ప్రజలతో చర్చించనున్నాం: ఖర్గే

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్రలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విస్మరించిన పలు అంశాలను ప్రస్తావిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఆర్థిక అసమానతలు, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, కుల గణన, నిరుద్యోగం, సాగు సమస్యలు వంటి అంశాలపై ప్రజలతో చర్చిస్తామన్నారు. ఆయా విషయాలను కనీసం పార్లమెంటులోనూ లేవనెత్తనీయకుండా కేంద్రం నిలువరిస్తోందని విమర్శించారు. శనివారం ఢిల్లీలో ఆయన మణిపూర్-ముంబై యాత్రకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై విమర్శలు ఎక్కుపెట్టారు. అల్లర్లతో అట్టుడికిన మణిపూర్‌లో పర్యటించేందుకు ప్రధానికి సమయం లేదని, ఫొటోషూట్‌లు, నిర్మాణంలో ఉన్న ఆలయాలను సందర్శించేందుకు మాత్రం ఆయనకు కావాల్సినంత సమయం ఉందని దుయ్యబట్టారు. విపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఈడీ, సీబీఐ, ఐటీలను వినియోగించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏకంగా పెద్ద డ్రైక్లీన్ ఫ్యాక్టరీని నడుపుతున్నారు. కళంకిత నేతలను పార్టీలో చేర్చుకుని అత్యంత పరిశుభ్రమైన నాయకులుగా బయటకు తీసుకువస్తున్నారు" అని ఖర్గే ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో తొలిసారి 146మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని ఖర్గే విమర్శించారు. "ఈ యాత్ర ద్వారా కేవలం మేం చెప్పడమే కాదు.. ప్రజల మాట కూడా వింటాం. వారి సమస్యలు కూడా అర్థం చేసుకుంటాం" అని అన్నారు. కేంద్రం కొత్తగా తెచ్చిన కార్మిక, క్రిమినల్ చట్టాలు.. నియంతృత్వ పోకడలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాగా, అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి వెళ్లాలా? వద్దా? అనే విషయంపై త్వరలోనే నిర్ణయిస్తామన్నారు.

అక్కడ ఆఫీసు.. ఇక్కడ బిల్లు

- 'బ్లాక్‌బక్స్'కు నిధుల చెల్లింపుల్లో వింత కోణం
- జూబ్లీహిల్స్, అమెరికా, బెజవాడలో మాత్రమే ఆఫీసులు ఉన్నట్టు కంపెనీ సైట్‌లో వెల్లడి
- ఇన్‌వాయిస్‌లో మాత్రం మంగళగిరి అడ్రస్

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి నిధుల చెల్లింపుల వ్యవహారంలో అనుమానాలు పెరుగుతున్నాయి. ఎలాంటి టెండర్లు, జీవోలు లేకుండా బ్లాక్‌బక్స్ అనే కంపెనీకి నామినేషన్ ఆధారంగా కాంట్రాక్టు అప్పగించిన ఉన్నత విద్యామండలి.. బిల్లుల చెల్లింపులోనూ కొత్త అనుమానాన్ని సృష్టించింది. ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ పేరుతో బ్లాక్‌బక్స్ అనే కంపెనీకి ఉన్నత విద్యామండలి కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కాంట్రాక్టును ఏ ప్రాతిపదికన ఇచ్చారో ఎవరికీ తెలియదు. కాగా ఆ కంపెనీ రాష్ట్రంలోని పలువురు విద్యార్థులకు కోడింగ్, ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్ విభాగాల్లో టెస్టులు నిర్వహించిందని మండలి చెబుతోంది. ఈ క్రమంలో డిసెంబరు 21న రూ.51లక్షల బిల్లు చెల్లించాలని ఆ కంపెనీ ఇన్‌వాయిస్ పంపింది. ఆ ఫైలును వెంటనే ప్రాసెస్ చేసిన మండలి అధికారులు నిధులు విడుదల చేశారు. అయితే హైదరాబాద్ కేంద్రంగా నడిచే ఆ కంపెనీ మంగళగిరిలో ఆఫీసు ఉన్నట్టుగా చూపించి ఇన్‌వాయిస్ పెట్టడం అనుమానాలకు కారణమైంది. ఆ కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉంది. మరో రెండు బ్రాంచ్ ఆఫీసులు ఒకటి అమెరికాలో, మరొకటి విజయవాడలోని ఎంజీ రోడ్డులో ఉన్నట్టు పేర్కొంది. కానీ ఉన్నత విద్యామండలికి మంగళగిరిలోని మిడ్‌వ్యాలీ సిటీ అనే రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో ఆఫీసు ఉన్నట్టుగా చూపించింది. విచిత్రం ఏంటంటే ఉన్నత విద్యామండలి కార్యాలయానికి మిడ్‌వ్యాలీ సిటీ కూతవేటు దూరంలోనే ఉంటుంది. అసలు ఆఫీసే లేకుండా బిల్లులు పెడితే ఉన్నత విద్యామండలి ఎందుకు దాన్ని ప్రశ్నించలేదు? అసలు ఆ కంపెనీనే ఎంపిక చేయడానికి ప్రాతిపదిక ఏంటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఓటు ఉందో లేదో చూసుకునే దుస్థితి

- నా రాజకీయ జీవితంలో ఇదే తొలిసారి
- మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి ఆవేదన
- రాజకీయాల్లోకి వెధవలు వస్తున్నారు: ఏబీ

విజయవాడ, జనవరి 6: "నా రాజకీయ జీవితంలో మొట్టమొదటిసారి ఓటు ఉందో పోయిందో చూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది" అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం 'సంక్రాంతి సందర్భంగా ఆత్మీయ కలయిక' పేరుతో కార్యక్రమం జరిగింది. మండలి మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే కాకుండా కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ కోసం తహతహలాడుతోందని, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అంబేడ్కర్ రాజ్యాంగం ఉండదని హెచ్చరించారు. రాష్ట్రానికి సీఎంగా ఉన్న వ్యక్తి సభ్యత, సంస్కారం లేకుండా ఒక నాయకుడి ముగ్గురు పెళ్లాల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పదవుల కోసం, టికెట్ల కోసం లొంగిపోతున్న నాయకులు ఎక్కువైపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేత నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ.. రాజధాని లేని రాష్ట్రంలో ఉండటం మన దౌర్భాగ్యమని అన్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విభజన తరువాత ఏపీ అన్ని రకాల ఒడిదుడుకులను చూసేసిందన్నారు. రాజకీయల్లో మంచివారు లేకపోవడం, రాకపోవడం వల్ల దుష్టులు, దుర్మార్గులు, వెధవలు వస్తున్నారని, ఇది ప్రమాదకరమని అన్నారు. సమాజం మంచి దిశలో పయనించాలంటే మౌనంగా ఉంటే కుదరదని, మన సమాజాన్ని మనమే బాగు చేసుకోవాలని సూచించారు. సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. దేశంలో ఓటు వేసే వారు ఏం చూసి వేస్తున్నారో సర్వే చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 'ఓట్ ఫర్ నేషన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రైతు నాయకులు అక్కినేని భవానీ ప్రసాద్, ఎస్సీ బోస్, హైకోర్టు న్యాయవాది తేజ తదితరులు పాల్గొన్నారు.

● కేసినోతో 10 కోట్లు

2022 సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కేసినో ద్వారా సుమారు రూ.10 కోట్ల ఆదాయాన్ని ఎమ్మెల్యే ఆర్జించినట్లు సమాచారం.

● లక్షకు కోటి

గడ్డం గ్యాంగ్ అప్పులు ఇవ్వకుండానే ఇచ్చామని బెదిరిస్తుంది. లక్ష రూపాయలు అప్పు ఇచ్చి రూ.కోటి చెల్లించాలని వేధిస్తుంది. వారి వేధింపుల తో ఓ రియల్టర్ ఆత్మహత్య చేసుకున్నారు.

● 50 కోట్ల లేఔట్ స్వాహా

నకిలీ పత్రాలు సృష్టించి రూ.50 కోట్లు విలువ చేసే లేఔట్ స్థలాలను గడ్డం గ్యాంగ్ స్వాధీనం చేసుకుంది. సర్వే రాళ్లను తొలగించి, విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేసి, స్థలాలను చదును చేసి వ్యవసాయానికి వీలుగా మార్చేసింది. గడ్డం గ్యాంగ్ అక్రమార్జనంతా ఎమ్మెల్యేకే చేరుతుంది.

అడ్డదిడ్డం.. గడ్డం గ్యాంగ్!

(మొదటి పేజీ తరువాయి)

కాసుల పంట పండించింది. తూర్పు కృష్ణాలోని ఇసుక రీచ్‌లన్నింటినీ తన కబ్జాలో పెట్టుకుని దోపిడీకి పాల్పడ్డారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు రూ.కోట్లు వెనకేసుకున్నారు. సగటున రోజుకు రూ.2 లక్షల పైచిలుకు ఆదాయంఆర్జించారు.

రూపాయికి వంద వసూలు

గడ్డం గ్యాంగ్ అరాచకాలకు ఎందరో బలయ్యారు. 2021 జూలై 15న నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఓ బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పు ఇవ్వకున్నా రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆయన పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. కరోనా.. మూడు రాజధానుల ప్రకటన వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతింది. గడ్డం గ్యాంగ్ అనుచరుల వేధింపుల వల్ల ఆయన ఆత్మహత్య చేసుకునే ముందు కారణాలు వివరిస్తూ సూసైడ్ నోట్ రాశారు. అసలు తనకు అప్పులు ఇవ్వని వారు కూడా అప్పు ఇచ్చినట్లు బెదిరిస్తున్నారని, లక్ష రూపాయలు ఇచ్చి కోటి రూపాయలు ఇచ్చామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఆయన చనిపోయిన తర్వాత కూడా తమకు రూ.1.15 కోట్లు చెల్లించాలని కొడుకును గడ్డం గ్యాంగ్ వేధించింది. పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

మంత్రి హోదాలో వసూళ్లు

కృష్ణా జిల్లాలో 200కు పైగా బియ్యం మిల్లులు ఉన్నాయి. 2019-20కి సంబంధించి లెవీ బియ్యం మిల్లింగ్, తేమ శాతం అధికంగా ఉన్న ధాన్యం డ్రయ్యర్ చార్జీలు, పొలం నుంచి మిల్లుకు ధాన్యం రవాణాచార్జీలు, తదితర ఖర్చులకు గాను రైస్ మిల్లులకు బిల్లుల రూపంలో రూ.100 కోట్లను అప్పట్లో ప్రభుత్వం విడుదల చేసింది. మిల్లర్ల ఖాతాల్లో ఈ నగదు జమైంది. మిల్లర్లకు వచ్చిన రూ.100 కోట్ల నుంచి 8 శాతం(8కోట్లు) పార్టీ ఫండ్ పేరుతో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకుల నుంచి మంత్రి హోదాలో సదరు ఎమ్మెల్యే వసూలు చేశారు.

పేకాట, కేసినో..



నియోజకవర్గంలో 'గడ్డం గ్యాంగ్' చేయని అరాచకం లేదు. పేకాట శిబిరాల నిర్వహణ మొదలు కబ్జాలు, దాడులు చేసేస్తుంటారు. 2020 సంవత్సరం చివరిలో నియోజకవర్గం పరిధిలో గడ్డం గ్యాంగ్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సెబ్ అధికారులు దాడి చేశారు. అప్పట్లో ఇది రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ దాడిపై మంత్రి హోదాలో ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'పేకాట ఆడితే చంపేస్తారా' అంటూ వ్యాఖ్యానించారు. నియోజకవర్గ కేంద్రం చుట్టుపక్కల ఆయన అనుచరుల ఆధ్వర్యంలో నడిచే పేకాట శిబిరాల కారణంగా వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పేకాట శిబిరాల నిర్వహణ ద్వారా నిత్యం రూ.10 లక్షల పైచిలుకు కమీషన్ల రూపంలో జేబులో వేసుకుంటారు. సంక్రాంతి వేడుకలను తమ జూద వ్యాపారానికి వేదికగా చేసుకుని రూ.కోట్లు ఆర్జించేందుకు కేసినో కింగ్‌ను రంగంలోకి దింపారు. 2022 సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో భారీ ఎత్తున కేసినో నిర్వహించారు. పోకర్.. అమెరికన్ రౌలెట్.. తీన్‌పత్తి.. బకారత్.. బ్లాక్ జాక్.. 7అప్ 7 డౌన్.. అందర్ బాహర్.. గోవా కేసినోల్లో మాత్రమే కనిపించే జూదక్రీడలన్నింటినీ ఎమ్మెల్యే యజమానిగా ఉన్న కన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు. కేసినోలో ఎంట్రీ ఫీజు రూ.10 వేలుగా నిర్ణయించారు. ఈ కేసినో ద్వారా సుమారు రూ.10 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు సమాచారం.

కనిపించిందల్లా కబ్జా..!




నియోజకవర్గ కేంద్రంలో విలువైన స్థలాలను కబ్జా చేయడం.. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని కన్వెన్షన్ హాలుకు తీసుకెళ్లి చితకబాదడం గడ్డం గ్యాంగ్ నిత్యకృత్యం. బైపాస్‌రోడ్డును ఆనుకుని ఓ గ్రామ పరిధిలో సుమారు 8.64 ఎకరాలను 1984లో ఒక భూస్వామి తరపున పవర్ ఆఫ్ అటార్నీ తీసుకున్న ప్రముఖ నాయకుడు, ఒక విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి లేఔట్ వేశారు. అధికారిక అనుమతులు లేకుండా 65 ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఈ ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన వ్యాపారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అక్కడ ఓ భారీ ప్రైవేటు స్కూల్ రావడంతో ఆ స్థలాల విలువ అమాంతం పెరిగిపోయింది. దీంతో పవర్ ఆఫ్ అటార్నీ రాసిన భూస్వామికి దురాశ పుట్టింది. ఆ భూములు అమ్మడానికి తాను పవర్ ఆఫ్ అటార్నీ ఎవరికీ ఇవ్వలేదని అడ్డం తిరిగారు. దీంతో స్థల యజమానులు అందరూ ఓ హౌసింగ్ సొసైటీ పేరిట ఏర్పడి లేఔట్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు డీటీసీపీకి దరఖాస్తు చేసుకున్నారు. తద్వారా తమ స్థలాలపై చట్టబద్ధమైన హక్కు పొందాలనేది ఆలోచన. వీరి అభ్యర్థన మేరకు 2017లో లేఔట్ అప్రూవల్ పొందింది. స్థలాల యజమానులు విద్యుత్ శాఖకు రూ.25 లక్షలు చెల్లించడంతో విద్యుత్ శాఖ స్తంభాలు వేసింది. వాటికి లైన్లు వేసే సమయంలో గడ్డం గ్యాంగ్ ఈ స్థలాల్లోకి చొరబడింది. ఎలాగైనా రూ.50 కోట్లు విలువ చేసే ఆ స్థలాలను కొట్టేయాలన్న ఆలోచనతో గడ్డం గ్యాంగ్ భూస్వామితో కలిసి కుట్ర పన్నింది. లేఔట్ స్థలాలను తాను వేరే వ్యక్తులకు లీజుకు ఇచ్చానంటూ భూస్వామి పత్రాలు సృష్టించారు. దీంతో గడ్డం గ్యాంగ్ రంగంలోకి దిగి ప్లాట్ల సర్వే రాళ్లను తొలగించింది. స్థలాలను చదును చేసింది. ఇప్పటికీ ఇది గడ్డం గ్యాంగ్ స్వాధీనంలోనే ఉంది.

ఫైబర్‌నెట్‌నూ వదలని గ్యాంగ్

నియోజకవర్గ కేంద్రంలో ఫైబర్‌నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు ఓ ఎంఎస్‌వో 2018లో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. టిడ్కో ఇళ్లు, ఇతర ప్రభుత్వ కాలనీల్లో ఫైబర్‌నెట్ కనెక్షన్లు మాత్రమే ఇచ్చేలా ప్రభుత్వం జీవో ఇచ్చింది. 2023 జూన్‌లో అక్కడ టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. సుమారు 10 వేల ఇళ్లు ఉండగా ఇప్పటికే 500 కుటుంబాల వరకు ఇళ్లలోకి వచ్చారు. వారందరికీ ఫైబర్‌నెట్ ఇచ్చేందుకు సదరు ఎంఎస్‌వో ఆగస్టు నుంచి సుమారు 20 లక్షలు వెచ్చించింది. ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరు సదరు ఎంఎస్‌వోను తమ ఇంటికి పిలిపించి బెదిరింపులకు దిగారు. తమ అనుమతి లేకుండా వైరింగ్ ఎందుకు లాగారంటూ నిలదీశారు. రెండు మూడు రోజులు టైం ఇస్తున్నాం. ఈలోపు మీ వైరింగ్ మొత్తం పీక్కుని పోండి లేదా మేమే మొత్తం పీకేస్తాం' అని ఎమ్మెల్యే అనుచరులు హెచ్చరించారు.

లేటుగా తింటే గుండె జబ్బుల ముప్పు

- డిన్నర్‌కు, అల్పాహారానికి మధ్య ఎంత ఎక్కువ
- సమయం ఉంటే ఆరోగ్యానికి అంత మంచిది
- రాత్రి ఎనిమిదిలోపు తినేవారిలో రిస్క్ తక్కువ
- బ్రేక్‌ఫాస్ట్ మానేసి నేరుగా భోజనం చేసేవారిలో ప్రతి గంటకూ 6% మేర పెరిగే హృద్రోగ ముప్పు
- లక్ష మందిపై జరిపిన అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): లేట్ నైట్.. అనగా అర్ధరాత్రి వేళ.. హాట్ హాట్‌గా ఏదైనా తినే అలవాటు మీకుందా? అయితే తస్మాత్ జాగ్రత! అలా రాత్రుళ్లు వేళ మించి తినేవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ సోర్బోన్ పారిస్‌నోర్డ్‌కు చెందిన పరిశోధకుల బృందం ఈ స్టడీ చేసింది. అందులో భాగంగా.. 1,03,389 మంది ఆహార, ఆరోగ్య వివరాలను సేకరించి భోజనం చేసే సమయానికి.. కార్డియోవాస్క్యులర్ డిసీజెస్‌కు(గుండె జబ్బులకు) మధ్య ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో చేసిన అధ్యయనం ఇది. గ్లోబల్ డిసీజ్ బర్డెన్ 2020 అధ్యయనం ప్రకారం ఏటా ప్రపంచవ్యాప్తంగా ప్రతి లక్ష మందిలో సగటున 235 మంది హృద్రోగాలతో మృత్యువాత పడుతున్నారు. మనదేశంలో ఆ సగటు ఏకంగా 272గా ఉంది. ఈ నేపథ్యంలోనే భోజన వేళలకు, హృద్రోగాలకు మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు ఈ స్టడీ చేశారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తీసుకోకుండా... నేరుగా(ఆలస్యంగా) భోజనం చేసేవారిలో హృదయ సంబంధిత జబ్బుల బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు. అలా ఆలస్యమయ్యే ప్రతి గంటకూ.. హృద్రోగ ముప్పు 6 శాతం మేర పెరుగుతుందని పేర్కొన్నారు. అంటే.. ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ చేసేవారితో పోలిస్తే 9 గంటలకు తినేవారిలో హృద్రోగాల బారిన పడే ప్రమాదం 6 శాతం అధికమన్నమాట. అలాగే.. రాత్రి 8 గంటల కంటే ముందే తినేవారితో పోల్చితే 9 తర్వాత భోజనం చేసే వారిలో 28 శాతం మందికి గుండెజబ్బుల రిస్కు ఎక్కువని వారు పేర్కొన్నారు. ఈ ముప్పు మహిళల్లో ఎక్కువని కూడా వారు హెచ్చరించారు. రాత్రి భోజనాన్ని 7 గంటలకే ముగించి బ్రేక్‌ఫాస్ట్ పొద్దున ఎనిమిదింటికి తినడం వల్ల ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనమని, ఇలా చేసేవారిలో రక్తపోటు, స్ట్రోక్ ముప్పు తగ్గుతాయని పరిశోధకులు వెల్లడించారు.

భారత్‌లో ఐదో వంతు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం 2020లో ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 17.7 మిలియన్ల గుండె జబ్బుల మరణాలు సంభవిస్తే.. అందులో ఐదోవంతు ఒక్క మన దేశానివే కావడం గమనార్హం. ఇందులో కూడా ఎక్కువగా యువతే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ప్రాముఖ్యాన్ని గుర్తించాలని, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు అలవర్చుకోవడంతోపాటు.. రాత్రి భోజనాన్ని వీలైనంత త్వరగా ముగించాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. రాత్రివేళ ఎక్కువ సమయం కడుపును ఖాళీగా ఉంచేందుకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. కాగా.. సాయంత్రం వేళల్లో త్వరగా భోజనం చేయడం ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుందని, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందని హైదరాబాద్ యశోద ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. చీకటి పడ్డాక త్వరగా తినేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయులను మరింత సమర్థంగా నియంత్రించవచ్చని, హృదయనాళ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

ఎస్మాపై

నిరసనాగ్ని

రాష్ట్రవ్యాపంగా జీవో కాపీలు తగలబెట్టిన అంగన్వాడీలు

» గుంటూరు జిల్లాలో అంగన్వాడీ కార్యకర్త మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై అంగన్వాడీ కార్యకర్తలు భగ్గుమన్నారు. ఆ జీవో కాపీలను తగులబెట్టి నిరసన తెలిపారు. పలు జిల్లాల్లో 24 గంటల నిరసన దీక్షలు చేపట్టారు. రాత్రికి చలి వణుకుతూ దీక్షా శిబిరాల్లోనే నిద్రించారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 26వ రోజైన శనివారం కొనసాగింది. ఎస్మా ప్రయోగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్లకు చెందిన అంగన్వాడీ టీచర్ నారీ రాజకుమారి(35) ఆందోళనకు గురై మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ధూళిపాళ్ల డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిందని తెలియడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎ.సత్యవతి, సీహెచ్.వెంకటరమణ ఫిట్స్‌తో స్పృహ కోల్పోయారు. ప్రకాశం జిల్లాలో దీక్షా శిబిరాలు, ఆందోళన కార్యక్రమాల వేదికల వద్ద ఎస్మా చట్టం ప్రతులను తగులబెట్టారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఎస్మాకు సంబంధించిన జీవో 2 ప్రతులను తగులబెట్టారు.

ఓటేసి తప్పు చేశామంటూ చెప్పుతో..

సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడంతో జగనన్నకు ఓట్లు వేసి గెలిపించినందుకు మా చెప్పులతో మేము కొట్టుకునే పరిస్థితి వచ్చిందంటూ కర్నూలు జిల్లా ఆలూరులో అంగన్వాడీలు చెప్పులతో కొట్టుకుంటూ నిరసన తెలిపారు. ఇక జన్మలో జగన్ పార్టీకి ఓటు వేసేది లేదంటూ నినాదాలు చేశారు. శ్రీకాకుళం, నెల్లూరు, పార్వతీపురం మన్యం, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద 24 గంటల నిరవధిక నిరసన దీక్షలు చేపట్టారు. రాత్రికి చలిలోనే దీక్ష శిబిరాల్లో నిద్రించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శిబిరంలో గుంజీలు తీసి నిరసన ప్రదర్శన చేపట్టారు. సాలూరులో అంగన్వాడీ కార్యకర్తలు చెవిలో కాలీఫ్లవర్ పెట్టుకొని నిరసన తెలిపారు. కర్నూలు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో అంగన్వాడీలు నిద్రపోతున్నట్టు నటిస్తూ నిరసన తెలిపారు.

గవర్నర్ కాన్వాయ్ వెళ్తుండగా నినాదాలు..

అనంతపురం జిల్లాలో జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లేందుకు అంగన్వాడీలు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో గవర్నర్ కాన్వాయ్ కనిపించగానే సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎస్మాను ఎత్తివేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పర్యటనకు వచ్చిన మంత్రి ఉష శ్రీచరణ్‌ను కలిసేందుకు అంగన్వాడీలు యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి పలువురు అంగన్వాడీ కార్యకర్తలు గాయపడ్డారు.

సమ్మె ఆపేది లేదు: సుబ్బరావమ్మ

ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించినా వెనక్కి తగ్గేది లేదని, సమ్మె యథావిధిగా కొనసాగుతుందని అంగన్వాడీల మూడు సంఘాల సమన్వయ కమిటీ నాయకురాలు సుబ్బరావమ్మ స్పష్టం చేశారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైనచర్యని తీవ్రంగా ఖండించారు. ఎస్మా చట్టం ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తుంది కానీ గౌరవవేతనంతో పని చేస్తున్న అంగన్వాడీలకు వర్తించదనే విషయం తెలుసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉక్కుపాదం దారుణం: లోకేశ్

అమ్మనే గెంటేసిన వాడికి అంగన్వాడీల విలువ ఏం తెలుస్తుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ శాంతియుతంగా నిరసనలు తెలపడం కూడా నేరమేనా? అని ప్రశ్నించారు. అంగన్వాడీ ఉద్యమంపై సైకో సర్కార్ ఉక్కుపాదం మోపడం దారుణమన్నారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం, సమ్మె కాలానికి వేతనంలో కోత పెట్టడం జగన్ నియంత పోకడలకు పరాకాష్ఠగా అభివర్ణించారు.

ఎస్మా చట్టవిరుద్ధం: ఐలూ

శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్మికులపై ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు పేర్కొన్నారు. ఎస్మా ప్రయోగానికి సెక్షన్ల ప్రకారం చట్టం అనుమతించదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు పరచాలని కోరారు.

కార్పొరేషన్ కార్యాలయాల ముట్టడి

» 12వ రోజు ఉధృతంగా సమ్మె

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మున్సిపల్ కార్మికులు కదం తొక్కారు. సమస్యల పరిష్కారం కోరుతూ వారు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజూ కొనసాగింది. అనంతపురం నగరంలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. కమిషనర్ చాంబర్ నుంచి అధికారులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అక్కడే తలకిందులుగా నిలబడి నిరసన తెలిపారు. సప్తగిరి సర్కిల్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో చెత్త పారబోసి నిరసన తెలిపారు. నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి నగరపాలకసంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు కార్పొరేషన్‌లోని కంప్యూటర్ ఆపరేటర్లు సంఘీభావం తెలిపారు.

ఎస్మాస్త్రం!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రుల కమిటీ చర్చలు కొనసాగుతుండగా... మరోవైపు అంగన్వాడీలను అత్యవసర సర్వీసుల కిందకు తీసుకొస్తూ జీవో 2 ఇచ్చి ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ జారీ చేసింది. 2013 జాతీయ ఆహార భద్రతా చట్టంలోని సెక్షన్ 39 కింద గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అనుబంధ పౌష్టికాహారం సంవత్సరంలో 300 రోజులపాటు అంగన్వాడీ సెంటర్ల ద్వారా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపింది. ఆ విభాగంలో పని చేస్తున్నారు కనుక అంగన్వాడీలు అత్యవసర సర్వీసుల కిందకు వస్తారని పేర్కొంది. 1981 అత్యవసర సేవల నిర్వహణ చట్టం కింద సమ్మెను నిషేధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించి సమ్మెను కొనసాగిస్తే అంగన్వాడీలను డిస్మిస్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. సమ్మెలో ఉన్న వారిపై ప్రాసిక్యూషన్‌కు అవకాశం ఉంటుంది. సమ్మె చేసిన వారికి 6నెలలు జైలు శిక్ష, సహకరించిన వారికి ఏడాది జైలుశిక్ష విధించే అవకాశాలు ఉంటాయి. ఇంతటి కఠినమైన నిబంధనలున్న చట్టాన్ని.. జగన్ సర్కారు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా.. అంగన్వాడీలపై ప్రయోగించింది. దీనిపై అంగన్వాడీలతోపాటు వివిధ పార్టీలు, సంఘాల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

సమ్మె కాలానికి జీతం కట్

మరోవైపు సమ్మె చేసిన కాలానికి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనంలో సర్కార్ కోత విధించింది. నవంబరు 21 నుంచి డిసెంబరు 20వరకు ఒక క్యాలెండర్ నెలగా పరిగణిస్తారు. దాని ప్రకారం అంగన్వాడీలకు వేతనాల చెల్లింపులు ఉంటాయి. అంగన్వాడీలు నవంబరు 21 నుంచి డిసెంబరు 11వరకు విధులు నిర్వర్తించారు. డిసెంబరు 12నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఆ తేదీ నుంచి డిసెంబరు 20వరకు 9 రోజులు అంగన్వాడీలకు వేతనాల్లో ప్రభుత్వం కోత విధించింది. దీంతో దాదాపు ఒక్కొక్క అంగన్వాడీ కార్యకర్తకు రూ.3,450 తగ్గించి రూ.8050 వేతనాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. అదేవిధంగా ఆయాల జీతాల్లోనూ కోత పెట్టింది.

సర్కార్ జగమొండితోనే.. సమ్మెబాట

తమ సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్వాడీలు నాలుగున్నరేళ్లుగా అనేక పర్యాయాలు ప్రభుత్వానికి వినతులు ఇచ్చారు. అనేకసార్లు వివిధ రూపాల్లో తమ నిరసనలు వ్యక్తం చేశారు. గత ఎన్నికల ముందు తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి ఎక్కువగా వేతనం ఇస్తామన్న జగన్ హామీని నెరవేర్చాలని డిమాండ్లు చేశారు. అయితే వాటన్నిటినీ జగన్ సర్కారు బేఖాతరు చేయడంతో అంగన్వాడీలు సమ్మెబాట పట్టారు. ప్రతిగా ప్రభుత్వం బెదిరింపు ధోరణికి దిగుతూ అంగన్వాడీ కేంద్రాల తాళాలను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో బద్దలు కొట్టించి వాటి పర్యవేక్షణ బాధ్యతలు వారికి అప్పగించింది. అయినా అంగన్వాడీలు వెనక్కి తగ్గడం లేదు. దీంతో ప్రభుత్వం నాలుగు దఫాలుగా అంగన్వాడీ యూనియన్లతో చర్చలు జరిపింది. కొన్ని డిమాండ్లు పరిష్కరిస్తున్నట్లు ప్రకటించింది, కొన్ని జీవోలు ఇచ్చింది. వేతనాలు పెంచలేమని మంత్రుల కమిటీ పదే పదే తేల్చేసింది. కానీ ప్రధాన డిమాండ్లయిన కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలుపై మాత్రం ఎలాంటి హామీలూ ఇవ్వలేదు. ఈ నెల5 లోపు విధుల్లో చేరకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా హెచ్చరికలు జారీచేసింది. అయినా వినకపోవడంతో ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించింది.

ఏమిటీ.. ఎస్మా?

అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలపై జగన్ సర్కారు పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించింది. తద్వారా వారిని కట్టడి చేయాలని నిర్ణయించింది. ఇది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అసలేమిటి ఎస్మా చట్టం, ఎస్మా ప్రయోగిస్తే ఏమవుతుందన్న అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఎస్మా అంటే ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్(అత్యవసర సేవల నిర్వహణ చట్టం). బంద్ లేదా హర్తాళ్ల వంటివి చేయడం వల్ల ప్రజల దైనందిన జీవనానికి ఇబ్బంది కలగకుండా చూడడం, కొన్ని రకాల అత్యవసర సేవల నిర్వహణకు ఆటంకం లేకుండా కొనసాగేలా చూడడం కోసం 1981లో దీన్ని రూపొందించారు. అత్యవసర సేవలందించే ఉద్యోగులు తమ విధులకు హాజరు కాకుండా, ఆయా సేవలకు విఘాతం కలిగేలా సమ్మె చేస్తే దీన్ని ప్రయోగిస్తారు. 1980లో కార్మిక సంఘాల నిరసనలతో దేశం అట్టుడికిపోయింది. కార్మిక చట్టాల్లో మార్పులు తేవాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ ఉద్యమించాయి. 1981లో పార్లమెంట్ ముందు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. దేశ వ్యాప్తంగా పరిశ్రమలన్నింటా పెద్దఎత్తున సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం తీవ్రరూపం దాలుస్తున్నట్లు గుర్తించిన ప్రభుత్వం.. తొలుత 12 పరిశ్రమల్లో సమ్మెను నిషేధిస్తూ ఎస్మా ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఆ తర్వాత ఈ ఆర్డినెన్స్ స్థానంలో ఎస్మా చట్టం తీసుకొచ్చింది.

అత్యవసర సేవలంటే...

ప్రజల దైనందిన జీవితానికి అత్యవసరమని ప్రభుత్వం భావించే ఏ సేవ అయినా అత్యవసర సేవగా పరిగణించి, ఆయా సేవలకు సంబంధించి ఎస్మా వర్తిస్తుందని ప్రత్యేక ఉత్తర్వులు జారీచేయవచ్చు. ప్రధానంగా నీటి సరఫరా, ఆసుపత్రులు, పారిశుధ్యం, రవాణా, తంతి తపాలతో పాటు పెట్రోలు, బొగ్గు, విద్యుత్, ఉక్కు, ఎరువుల వంటి వనరుల ఉత్పత్తి రవాణా పంపిణీ సేవలన్నింటికీ దీన్ని వర్తింపజేయవచ్చు. బ్యాంకింగ్, ఆహారధాన్యాలు, ఆహారపదార్థాల పంపిణీ వంటి వాటన్నింటికీ దీన్ని వర్తింపచేయవచ్చు.

అతిక్రమిస్తే ఏం జరుగుతుంది?

ఎస్మా నిబంధనలు అతిక్రమించి సమ్మెకు దిగినట్లు ఎవరిపైనైనా అనుమానం ఉంటే, నేరశిక్షాస్మృతితో సంబంధం లేకుండా, వారెంట్ లేకుండానే పోలీసులు అరెస్టు చేయవచ్చు. సమ్మె ప్రారంభించే, పాటించే ఉద్యోగులను డిస్మిస్ చేయడంతోపాటు క్రమశిక్షణ చర్యలు చేపట్టవచ్చు. సమ్మెలో పాల్గొంటున్న వారికి, వారిని ప్రోత్సహిస్తున్న వారికి జైలు, జరిమానా, లేదా రెండూ విధించవచ్చు. సమ్మెకు ఆర్థిక సహకారం అందించేవారూ శిక్షలకు అర్హులవుతారు.

గతంలో అంగన్వాడీలపై ఎస్మా లేదు కానీ..

అంగన్వాడీలు గతంలో ఎస్మా పరిధిలో లేరు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది అంగన్వాడీలు 26 రోజులుగా సమ్మె చేస్తున్నారు. జిల్లా, మండల, ఐసీడీఎస్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రతిష్ఠ మసకబారింది. ఇది చూసి మరికొన్ని శాఖల ఉద్యోగులు కూడా డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కారు. ఉక్కిరిబిక్కిరైన ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి కక్షపూరిత చర్యలకు దిగింది. ఏదోవిధంగా అంగన్వాడీల సమ్మెకు అడ్డుకట్ట వేయాలనే నిర్ణయానికి వచ్చిన జగన్ సర్కార్.. అత్యవసర సర్వీసుల పరిధిలోకి రాని అంగన్వాడీలను ఆ పరిధిలోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేసి మరీ వారిపై ఎస్మా అస్త్రం ప్రయోగించింది.

'మున్సిపల్' చర్చలు మరోసారి విఫలం

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులతో ప్రభుత్వం జరిపిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. ఇప్పటికే మంత్రి ఆదిమూలపు సురేష్‌తో ఒకసారి, మంత్రులు బొత్స సత్యనారాయణ, సురేష్, సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంకోసారి చర్చలు నిర్వహించిన విషయం తెలిసిందే. శనివారం సీఎంవో ఆదేశాలతో అప్పటికప్పుడు కార్మిక సంఘాలకు కబురు పంపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఏపీ మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో అమరావతి సచివాలయంలో మంత్రి బొత్స, సజ్జల చర్చలు జరిపారు. మంత్రి సురేష్, జేఏసీ కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు జూమ్ మీటింగ్ ద్వారా హాజరయ్యారు. కార్మికుల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీని రూ.2లక్షలు చేయాలని సంఘాలు కోరాయి. ఆక్యుపెన్సీ అలవెన్స్ కింద రూ.6వేలు ఇస్తున్నామని, జీతాలు పెంచలేమని మంత్రులు తేల్చిచెప్పారు. గ్రాట్యుటీ రూ.50 వేలు ఇస్తామని, విగిలిన డిమాండ్లపైనా సానుకూలంగా స్పందిస్తామన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు 11వ పీఆర్సీ అమల్లోకి తేవాలని కోరగా, అదీ సాధ్యం కాదని మంత్రులు స్పష్టం చేశారు. జీతాలు పెంచకుంటే సమ్మె విరమించేది లేదని కార్మిక సంఘాలు తేల్చిచెప్పాయి.



కనిగిరిలోని అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం వడ్డిస్తున్న చంద్రబాబు

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం: చంద్రబాబు

» కనిగిరిలో అన్న క్యాంటీన్ వార్షికోత్సవ పైలాన్ ఆవిష్కరణ

కనిగిరి, జనవరి 6: అన్న క్యాంటీన్ ద్వారా పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశంసించారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కనిగిరిలో సమర శంఖారావం సభలో పాల్గొన్న ఆయన రాత్రికి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లోనే బస చేశారు. శనివారం టీడీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జననీ చారిటబుల్ ట్రస్టు సహకారంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను బాబు సందర్శించారు. అన్న క్యాంటీన్ ప్రారంభించి 365 రోజులు పూర్తయిన సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. కాగా, జిల్లాలోని ముఖ్య నేతలు, ఇన్‌చార్జిలతో చంద్రబాబు తొలుత సమావేశం నిర్వహించారు. అనంతరం వారి కోరిక మేరకు ఆయన ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు.

వైఎస్ఆర్ మరణంపై సందేహాలున్నాయి

» కాంగ్రెస్‌లోకి షర్మిల.. చంద్రబాబు కుట్ర: సజ్జల

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై సందేహాలున్నాయి. జగన్మోహన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టడం వెనుక టీడీపీ, కాంగ్రెస్‌లే ఉన్నాయి' అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేదే లేదు. గత ఎన్నికల్లో ఆపార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. అలాంటి పార్టీలో వైఎస్ షర్మిల చేరడం వెనుక చంద్రబాబు కుట్ర దాగి ఉంది. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టిన రోజే ఆ దిశగా ఆమె ప్రస్తావన మొదలైంది. చంద్రబాబు ఒకవైపు కాంగ్రెస్‌ను మరోవైపు బీజేపీని మేనేజ్ చేస్తున్నాడు. ఏదో రకంగా జగన్‌ను గద్దె దించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. ఆ కుట్రల్లో భాగంగానే షర్మిల కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రమేశ్ విమానంలో షర్మిల వెళ్లడం, బీటెక్ రవిని కలవడం యదృచ్ఛికమని మేం అనుకోవడం లేదు' అని సజ్జల వ్యాఖ్యానించారు. అంబటి రాయుడు ఏ కారణంతో రాజీనామా చేశారో తెలియదని సజ్జల పేర్కొన్నారు.

పదవికి, పార్టీకి.. రాజీనామా చేస్తా!

» పార్టీకి నా అవసరం లేదని బాబు భావించారు: ఎంపీ కేశినేని

కంచికచర్ల, జనవరి 6: ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత తెలుగుదేశం పార్టీని కూడా వదిలేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని నాని ప్రకటించారు. శనివారం ఉదయం తన ఫేస్‌బుక్ వాల్‌పై ఈ మేరకు ఆయన పోస్టు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్పీకర్ అపాయింట్‌మెంట్ కోరానని, అనుమతి రాగానే లోక్‌సభ స్పీకర్‌ను కలిసి ఎంపీ పదవికి రాజీనామా చేస్తూ లేఖను అందించనున్నట్టు చెప్పారు. తర్వాత తెలుగుదేశం పార్టీకి కూడా రాజీనామా చేస్తానని చెప్పారు. ఆ తర్వాత తనను అభిమానించేవాళ్లతో సమావేశమవుతానని, వాళ్లు తీసుకునే నిర్ణయం మేరకు నడుచుకుంటానని చెప్పారు. "ఇప్పటికే రెండుసార్లు ఎంపీగా చేశాను. మూడో సారి ఎంపీగా చేసినా, 30 సార్లు ఎంపీగా చేసినా ఏదో ఒక రోజు మాజీ ఎంపీనే అవుతాను. విరామం తీసుకుంటానని రెండున్నరేళ్ల క్రితమే నా వాళ్లకు, సహచరులకు చెప్పాను. పార్టీని లేదా అధినేత చంద్రబాబు నిర్ణయాలను తప్పు పట్టటం లేదు. అనుకోకుండా కొన్ని నిర్ణయాలు జరుగుతుంటాయి. నేను ఏం చేసినా పారదర్శకంగానే చేస్తాను. ఏ నిర్ణయం తీసుకున్నా తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు పోస్ట్ చేస్తాను. రాజకీయాల్లో ప్రజాసేవ నిస్వార్థంగా చేయాలంటే చాలా త్యాగమవసరం. ఒకరి మీద అనవసరంగా బురద చల్లటం తప్పు" అని వ్యాఖ్యానించారు. కాగా, విజయవాడ కేశినేని భవన్‌లో నానిని రాజ్యసభ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ కలిశారు. తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని, ఆదివారం జరిగే తిరువూరు సభకు రావాలని ఆహ్వానించినట్టు సమాచారం. సుమారు గంటన్నరసేపు నానితో రవీంద్ర భేటీ అయ్యారు. రవీంద్ర ఆహ్వానాన్ని నాని సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

'ఫ్యాన్' పార్టీలో ఉక్కపోత!

» వలసలతో వైసీపీ విలవిల
» ఇడుపులపాయ నుంచి తాడేపల్లి వరకు డైలీ సీరియల్‌లా 'వీడ్కోలు'
» సమ్మెలతో సర్కారు ఉక్కిరిబిక్కిరి
» డీలా పడుతున్న పార్టీ కేడర్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సర్కారుపై ప్రజాగ్రహం

అభ్యర్థుల బదిలీలు, సీట్ల వ్యవహారంలో నాయకులను తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి అవమానిస్తున్న తీరు పార్టీకి భారీ నష్టం కలిగిస్తోంది. ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. తెలంగాణలో కేసీఆర్ ఓటమితో జగన్ వ్యవహారశైలిని పోలుస్తున్నారు. తెలంగాణలో అభివృద్ధి పనులు చేసినా అహంకారం వల్లే ఓడారని అంటున్నారు. ఇక్కడ అభివృద్ధి లేకపోగా నియంతృత్వం, అణచివేతలు, అవినీతి విచ్చలవిడిగా ఉందంటున్నారు. అక్కడ ఫామ్ హౌస్‌లో సీఎం... ఇక్కడ ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి.. అక్కడ నలుగురు కుటుంబ సభ్యులు.. ఇక్కడ నలుగురు రెడ్లు... ఇలా పోలికలు తెస్తున్నారు. జగన్ సర్కారుపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సమ్మెలతో రాష్ట్రం అట్టుడికిపోతోంది. ప్రజలపై భారీగా పన్నులు, చార్జీల భారం మోపారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేదు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉండటం, టీడీపీ-జనసేన బంధం బలోపేతం కావడం, మరోవైపు 'జగనన్న బాణం' ఆయనపైనే గురిపెట్టడంతో వైసీపీ సర్కారు ఉక్కిరిబిక్కిరవుతోంది.

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఫ్యాన్ పార్టీలో 'ఉక్కపోత' తీవ్రమవుతోంది. వికెట్లు టపటపా పడుతున్నాయి. పార్టీలో ఎవరు ఉంటారో, ఎవరు పోతారో తెలియని విచిత్ర పరిస్థితి. పార్టీ వీడే కార్యక్రమం డైలీ సీరియల్‌లా కొనసాగుతోంది. 'పార్టీ నుంచి ఈ రోజు ఎవరు వెళ్లిపోతారు' అని రోజూ వైసీపీ నేతలు, కార్యకర్తలు భయపడే పరిస్థితి వచ్చింది. ఇన్‌చార్జ్‌ల బదిలీలు, సీట్ల వ్యవహారం వైసీపీలో గందరగోళంగా మారింది. పార్టీ పెద్దలు తీసుకుంటున్న నిర్ణయాలు 'రివర్స్' కొడుతున్నాయి. వీరవిధేయులుగా ఉన్నవారే తాడేపల్లి ప్యాలెస్ గేటు ముందు దండం పెట్టి పార్టీని వీడుతున్నారు. శాపనార్థాలు పెట్టి మరీ పోతున్నారు. పవన్ కల్యాణ్‌ను తిట్టించడం వల్ల కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఏరి కోరి తెచ్చుకున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు 'టీ-20 మ్యాచ్' అంత సమయం కూడా పార్టీలో ఇమడలేపోయారు. వైసీపీలో చేరి పది రోజులు కూడా తిరక్కుండానే గుడ్ బై చెప్పారు. నమ్మినబంటులాంటి కోటంరెడ్డి, ఇంట్లో మనిషిలా ఉండే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వీరవిధేయుడు కాపు రామచంద్రారెడ్డి.. ఇలా ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్నారు. దగ్గరి బంధువైన బాలినేని సైతం ఊగిసలాటలో ఉన్నారు. 'ఇప్పటివరకూ ఎన్నికల్లో ఫ్యాన్ తిరగడం కష్టమనుకున్నాం. తాజా పరిణామాలు చూస్తుంటే భోగి మంటల్లోపలే ఫ్యాన్ బూడిదయ్యేలా ఉంది'.. అని అధికార పార్టీ నేతలు, శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జగన్.. తన అహంకార వైఖరి వల్ల పార్టీ సర్వనాశనం అయ్యేలా ఉందని అంటున్నారు.

క్రిస్మస్‌తో మొదలై సంక్రాంతితో ముగింపు!

తనను ప్రశ్నించేవారే లేదని నాలుగున్నరేళ్లుగా నియంతలా వ్యవహరించిన జగన్‌కు క్రిస్మస్ సందర్భంగా ఇడుపులపాయలో సొంత నియోజకవర్గం కార్యకర్తల నుంచే సెగ మొదలైంది. రోజురోజుకూ రాష్ట్రమంతటా సెగలు విస్తరిస్తున్నాయి. ఈపరిస్థితి చూస్తుంటే ఎన్నికలకు ముందే సంక్రాంతి భోగి మంటల్లోనే ఫ్యాన్ రెక్కలు కాలడం ఖాయమని సొంత పార్టీ వారే చెబుతున్నారు. ఎన్నికల నాటికి ఏ మీ ఉండబోదని, ముందే ఓటమి ఖరారు అవుతుందని వైసీపీ బాధిత నేతలు అంటున్నారు.

సీట్ల ఎంపికలో గజిబిజి

మంత్రి గుమ్మనూరు జయరాంను కర్నూలు లోక్‌సభ స్థానానికి పంపుతామని పార్టీ పెద్దలు చెప్పారు. కానీ ఇప్పుడు దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఇంతకాలం జగన్ చెప్పిందే వేదంగా నమ్ముతూ వచ్చిన జయరాం.. ఇప్పుడు తనకు సీటు దక్కకపోతే వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన సన్నిహితుల్లో ప్రచారం సాగుతోంది. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మరోసారి పోటీకి వెనుకంజ వేస్తున్నారని పార్టీలో ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళం లోక్‌సభ సీటు ఎవరికి దక్కుతుందో తెలియని పరిస్థితి. విజయనగరం లోక్‌సభ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ను మార్చాలనుకుంటున్నా సరైన అభ్యర్థి దొరకడంలేదు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ నుంచి వైవీ సుబ్బారెడ్డిని బరిలోకి దింపాలన్న యోచనలో జగన్ ఉన్నా.. ఆయన ఒంగోలు కోరుకుంటున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. అనకాపల్లి ఎంపీ సత్యవతి స్థానంలో మంత్రి గుడివాడ అమర్నాథ్ పేరు పరిశీలనలో ఉన్నా అధిష్ఠానం పునరాలోచనలో పడిందని అంటున్నారు. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ అసెంబ్లీ స్థానానికి పంపడంతో అక్కడ కొత్తఅభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభమైంది. కాకినాడ ఎంపీ వంగాగీతను పిఠాపురం అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించడంతో ఇక్కడా అదే పరిస్థితి. అమలాపురం ఎంపీ చింతా అనూరాధపై వ్యతిరేకత ఉండటంతో మారుస్తారని తెలుస్తోంది. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పోటీకి ఉత్సాహం చూపడం లేదు. చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, తిరుపతి ఎంపీ గురుమూర్తి, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డిని మార్చే అవకాశముంది.

సజ్జలకు నిరసన సెగ

అమరావతి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి సొంత పార్టీ శ్రేణుల నుంచే నిరసన సెగ తగిలింది. సచివాలయానికి వచ్చిన సజ్జలను శ్రీసత్యసాయి జిల్లా మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు ఘెరావ్ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామికి మళ్లీ టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. సర్వే రిపోర్టు తిప్పేస్వామికి వ్యతిరేకంగా ఉన్నందున పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని సజ్జల సర్దిచెప్పే యత్నం చేసినా వారు వినలేదు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శుభకుమార్‌కు మడకశిర సీటు కేటాయిస్తున్నట్లు తెలుసుకున్న కార్యకర్తలు సజ్జలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదుగురు ఎంపీలు ఔట్?

వైసీపీ అధిష్ఠానానికి లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక సవాల్‌గా మారింది. వైసీపీ సిట్టింగ్ ఎంపీలు చాలా మంది మరోసారి పోటీ చేసేందుకు ముందుకు రావడం లేదు. పలువురు టీడీపీతో టచ్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. మొత్తంగా వైసీపీలో లోక్‌సభ టికెట్లకు పెద్దగా డిమాండ్ లేదని తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందే ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోంది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జగన్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే మరో ఎంపీ ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన విందుకు హాజరుకావడం జగన్ ఆగ్రహానికి కారణమైంది. ఆయనతో పాటు మరో ఎంపీ పార్టీ మారుతారని తెలుస్తోంది. ఇక నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు ఎప్పుడో దూరమయ్యారు. నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు కూడా పార్టీ మారే అవకాశముందని ప్రచారంజరుగుతోంది.

వైసీపీలో 'ఆడను'

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు గుడ్ బై

గుంటూరు/విజయవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీలో వలసల పర్వం కొనసాగుతోంది. వైసీపీలో ఇటీవల చేరిన భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వారం తిరగకుండానే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. తాను వైసీపీని వీడుతున్నట్లు శనివారం ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రకటించారు. కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకొన్నానని, తదుపరి కార్యాచరణను రాబోయే రోజుల్లో తెలియజేస్తానని పేర్కొన్నారు. గుంటూరు టికెట్ ఇస్తామని ఆశ చూపించి నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటనలు చేయించిన జగన్.. తీరా గుంటూరు సీటును శుక్రవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుకు ఆఫర్ చేయడంతో రాయుడు తీవ్ర అసంతృప్తికి గురైనట్టు తెలుస్తోంది.

వైసీపీ నుంచి మరో వికెట్!: ఉమ్మడి కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వైసీపీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. 18వ తేదీన గుడివాడలో జరిగే 'రా కదలి రా' సభలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కొన్ని రోజుల క్రితం ఆయన టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి తాను టీడీపీలో చేరడానికి సుముఖంగా ఉన్నానని, పెనమలూరు నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. పెనమలూరు కాకుండా ఒంగోలు ఎంపీ స్థానం నుంచి ఆయన్ను బరిలోకి దింపేందుకు టీడీపీ పెద్దలు సుముఖత చూపినట్లు తెలిసింది. అయితే సారథి పెనమలూరు కోసమే పట్టుబట్టడంతో చివరికి ఆయన్ను నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయించేందుకు టీడీపీ పెద్దలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి కూడా వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారని వారి సన్నిహితులు చెబుతున్నారు.

గుంటూరు అయితే నో: లావు

నరసరావుపేట నుంచి అయితేనే తాను తిరిగి పోటీ చేస్తానని జగన్‌కు కరాకండిగా చెప్పానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు స్పష్టం చేశారు. శనివారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం సీఎం జగన్ తనను పిలిపించుకొని ఈ పర్యాయం గుంటూరు నుంచి పోటీ చేయాలని సూచించినట్లు చెప్పారు. అయితే అందుకు తాను ఒప్పుకోనని నిర్మొహమాటంగా చెప్పానన్నారు. పల్నాడులో అభివృద్ధి కార్యక్రమాలు మధ్యలో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలంటే తిరిగి తాను అక్కడ నుంచి గెలిస్తేనే వీలవుతుందని సీఎంకు వివరించానని చెప్పారు. నరసరావుపేటను వదిలి గుంటూరు నుంచి పోటీ చేయడం తనకు ఇష్టం లేదని చెప్పినట్లు తెలిపారు.

అక్కచెల్లెమ్మలారా.. క్షమించండి!

రాష్ట్రంలో మహిళలపై 2.04 లక్షల అఘాయిత్యాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి. గత నాలుగేళ్లలో మహిళలపై 2,04,414 నేరాలు జరిగాయంటే ప్రభుత్వం మహిళల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో తేటతెల్లమవుతోంది. విశాఖలో ఎస్సీ బాలికపై 10 మంది అత్యాచారం చేస్తే నిందితులను పట్టుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. సీఎం ఇంటి పక్కనే దళిత యువతిని, కాబోయే భర్త సమక్షంలోనే అత్యాచారం చేసినవారిని ఇంతవరకు అరెస్టు చేయలేదు. ఇలాంటి దారుణాలు ఈ ఐదేళ్లలో కోకొల్లలు. అయినప్పటికీ.. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మహిళలపై నేరాలు తగ్గాయంటూ డీజీపీతో వార్షిక నివేదిక ఇప్పించడం దిగజారుడుతనానికి నిదర్శనం. ఎన్‌సీఆర్‌బీ నివేదిక, పార్లమెంట్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రం తెలిపిన సమాధానాలు.. రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరిగిన తీరును స్పష్టం చేస్తున్నాయి.

ఈ ఘటనలపై ఏం చెప్తారు?

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, నెల్లూరు జిల్లాలో గ్యాంగ్‌రేప్ ఘటనలు, విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో యువతిపై అత్యాచారం, ఒంగోలులో బాలికను నిర్బంధించి 15 రోజుల పాటు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటనల్లో పోలీసులు స్పందించిన తీరు బాధాకరం. రేపల్లె రైల్వేస్టేషన్‌లో భర్త, పిల్లల ఎదుట వివాహితపై అత్యాచారం, గుంటూరు జిల్లా తుమ్మపూడిలో ఇంట్లోకి చొరబడి మహిళలపై గ్యాంగ్ రేప్, నరసరావుపేటలో బీటెక్ విద్యార్థిని అనూష హత్య రాజమండ్రిలో చిన్నారిపై సామూహిక అత్యాచారం, ఇటీవల విశాఖలో ఒడిసా బాలికపై అత్యాచార ఘటనలపైనా పోలీసులు తీరు అలాగే ఉంది. రాష్ట్రంలో మహిళా కమిషన్ ఉందో లేదో తెలియని పరిస్థితి. ప్రతిపక్షాలకు నోటీసులివ్వడంపై ఉన్నంత ఉత్సాహం, చొరవ మహిళలకు భద్రత కల్పించడంలో మహిళా కమిషన్ చూపడం లేదు. పదవీకాలం ముగిసినా విపక్షాలపై పెత్తనం మినహా వాసిరెడ్డి పద్మ వల్ల మహిళలకు ఒనగూరే ప్రయోజనం శూన్యమని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆడబిడ్డకు కష్టమొస్తే గన్ కంటే ముందు జగన్ వస్తాడన్న మహిళా మంత్రులు..ఈ ఘటనలపై ఏం సమాధానాలు చెప్తారని జనం ప్రశ్నిస్తున్నారు. సాక్షాత్తు సీఎం నివశించే తాడేపల్లి అత్యాచారాలకు, డ్రగ్స్, గంజాయి సరఫరాకు అడ్డాగా మారిందంటే ఈ రాష్ట్రంలో ఇక ఎవరికి రక్షణ ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్ల వేధింపులు...

జగన్ నియమించిన వలంటీర్లలో కొందరు మహిళలపై వేధింపులకు దిగుతున్నారు. వలంటీర్లు మహిళలపై వేధింపులకు పాల్పడిన ఘటనలపై 4,320 కేసులు నమోదయ్యాయంటే ప్రభుత్వంలో మహిళల రక్షణ ఏ మాత్రం ఉందో అర్థమవుతోంది. వలంటీర్లు మహిళల వ్యక్తిగత వ్యవహారాల్లోకి చొరబడి ఇబ్బంది పెడుతున్నారు. చిన్నారులను, ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్నారు.

సీఎం సొంత జిల్లాలో..

2020 డిసెంబరులో పులివెందులలో దళిత మహిళ నాగమ్మ అత్యాచారం, హత్యకు గురైతే, ఇప్పటి వరకు నిందితుడిని పట్టుకోలేదు. పైగా బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు వెళ్లిన టీడీపీ నేతలు బీటెక్ రవి, వంగలపూడి అనితలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. కడప జిల్లా కోడూరుకు చెందిన డిగ్రీ విద్యార్థిని అనూష అనుమానాస్పద స్థితిలో మృతి చెందితే నిందితుడు మహేశ్వరరెడ్డిపై అనుమానం ఉందని అనూష్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా కనీసం విచారణ చేయకుండానే ఆమెది ఆత్మహత్యని పోలీసులు నిర్ధారించారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో 15 ఏళ్ల దళిత బాలికపై 10 మంది పలుమార్లు అత్యాచారం చేసి నరకం చూపించారు. గర్భవతి అయిన ఆ చిన్నారికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా కేసు మాఫీ చేశారు.

గత నాలుగేళ్ల లెక్కలు ఇవీ..	
మహిళలపై అఘాయిత్యాలు	2,04,414
మహిళలపై జరిగిన నేరాలు	78,090
మిస్సింగ్ అయిన మహిళలు	22,278
మిస్సింగ్ అయిన చిన్నారులు	7918
మహిళలపై దాడుల సంఖ్య	14,438
మహిళలపై అత్యాచారాలు	4,034
ఆత్మగౌరవానికి భంగం ఘటనలు	6,604
చిన్నారులపై నేరాలు	7,841,
మహిళలపై సైబర్ నేరాలు	5,660
గృహహింస కేసులు	15,065
గ్యాంగ్ రేప్ ఘటనలు	60
యాసిడ్‌దాడులు	9
మహిళల హత్యలు	991
స్థానిక ఎన్నికల్లో వేధింపులు	442
వలంటీర్లు వేధించిన కేసులు	4,320
అధికారికంగా నమోదు కానివి	36,664

2022 సంవత్సరంలో లెక్కలు ఇవీ..	
మహిళలపై జరిగిన నేరాలు	25,503
అత్యాచారాలు	601
అత్యాచారయత్నాలు	180
దళిత మహిళలపై తీవ్ర దాడులు	248
దళిత బాలికలపై అత్యాచారాలు	58

దేశవ్యాప్తంగా మహిళలపై నేరాల్లో ఏపీ టాప్	
జాతీయ స్థాయిలో నేరాల రేటు	66.4
ఆంధ్రప్రదేశ్‌లో నేరాల రేటు	96.2
రాష్ట్రంలో మిస్సింగ్ కేసులు	30,196
మిస్సింగ్ మహిళలు	22,278,
చిన్నారులు	7918 మంది

మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే కేసుల్లోనూ ఏపీ టాప్

- 2022లో దేశవ్యాప్తంగా నేరాలు 8,972.. ఏపీలో 3,145 నమోదు(35.05 శాతం)
- మహిళల అవమాన కేసుల్లోనూ ఏపీ టాప్(11.9 రేట్)
- 18 ఏళ్ల లోపు బాలికలపై అత్యాచార కేసుల్లో రెండో స్థానంలో ఏపీ
- దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాల్లో మూడోవంతు ఏపీలోనే

జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే లెక్కల వివరాలు..

- రాష్ట్రంలో 15-19 ఏళ్ల బాలికల్లో గర్భం దాల్చినవారు 12.6 శాతం.. దేశంలోనే ఏపీది మూడో స్థానం
- ఇండియా టుడే సర్వే ప్రకారం ఏపీలో 1,33,447 మంది వ్యభిచార కూపంలో చిక్కుకున్నారు. ఈ అమానుషాల్లో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ

'ఆంధ్రజ్యోతి' ఎడిటర్‌కు మాతృవియోగం

పలువురు ప్రముఖుల సంతాపం.. ముగిసిన అంత్యక్రియలు


రంగనాయకమ్మ

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ మాతృమూర్తి కండ్లకుంట రంగనాయకమ్మ(86) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం తెల్లవారుజామున లంగర్‌హౌస్‌లోని చిన్న కుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. అనంతరం రంగనాయకమ్మ భౌతికకాయాన్ని మన్సూరాబాద్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. ఆమె భర్త ప్రముఖ సంస్కృత పండితుడు ఆశోహ సింగరాచార్యులు గత ఏడాది ఆగస్టులో కన్నుమూసిన సంగతి తెలిసిందే. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారిలో కె.శ్రీనివాస్ రెండో కుమారుడు. రంగనాయకమ్మ మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు మాజీ సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. రంగనాయకమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించిన వారిలో గోరటి వెంకన్న, సజయ కాకర్ల, ఆంధ్రజ్యోతిలోని వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు ఉన్నారు. రంగనాయకమ్మ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నాగోల్ శ్మశానవాటికలో ముగిశాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి


diksuchi@andhrajyothy.com

దిక్సూచి

విజయవాడ ● ఆదివారం 7 జనవరి 2024

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఎంబీఏ డిగ్రీకి సమానం. ఇందులో ఏడాదికి మూడు టర్మ్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, క్లాస్ రూమ్ డిస్కషన్స్, గెస్ట్ లెక్చర్స్, కేస్ స్టడీస్, గ్రూప్ ప్రాజెక్టులు, టర్మ్ పేపర్స్, బిజినెస్ గేమ్స్ ఉంటాయి. కోర్ కోర్సుల కింద బిహేవియరల్ సైన్సెస్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, క్వాంటిటేటివ్ మెథడ్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆపరేషన్స్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ, కమ్యూనికేషన్స్ విభాగాలకు సంబంధించిన అంశాలు చదవాల్సి ఉంటుంది. మొదటి ఏడాది కోర్సు పూర్తయ్యాక సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 340 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు సంస్థ నిబంధనల ప్రకారం ఆర్థిక సహకారం అందిస్తారు. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్, రిజర్వ్‌డ్ వర్గాలవారికి ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లు వర్తిస్తాయి. హాస్టల్ సౌకర్యం ఉంది.

విశాఖ ఐఐఎంలో పీజీ ప్రోగ్రామ్



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటింగ్, కంపెనీ సెక్రటరీషిప్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023 అర్హత తప్పనిసరి.

ఎంపిక: జనరల్ అభ్యర్థులకు క్యాట్ 2023లో ఒక్కో సెక్షన్‌లో 70, మొత్తమ్మీద 82 పర్సంటైల్ ఉండాలి. ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు సెక్షన్‌కు 63, మొత్తమ్మీద 72 పర్సంటైల్; ఎస్సీలకు సెక్షన్‌కు 40, మొత్తమ్మీద 50 పర్సంటైల్; ఎస్టీలు, దివ్యాంగులకు సెక్షన్‌కు 30, మొత్తమ్మీద 40 పర్సంటైల్ ఉండాలి. ఈ పర్సంటైల్‌ను పరిగణనలోకి తీసుకుంటూ క్యాట్ స్కోర్‌కు 50 శాతం; పదోతరగతి స్కోర్, ఇంటర్ స్కోర్, డిగ్రీ స్కోర్, జెండర్ డైవర్సిటీ, అనుభవాలకు ఒక్కోదానికి 10 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వారి ఈమెయిల్‌కు సమాచారమిస్తారు. వీరికి మాత్రమే పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ స్కోర్‌కు 48 శాతం, క్యాట్ స్కోర్‌కు 25 శాతం; పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్కోర్‌లకు ఒక్కోదానికి 4 శాతం; జెండర్ డైవర్సిటీకి 5 శాతం, అనుభవానికి 10 శాతం వెయిటేజీ ఇస్తూ తుది జబితా రూపొందించి అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 8 నుంచి 30 వరకు
- **అడ్మిషన్స్:** మే 20
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూన్ 24
- **వెబ్‌సైట్:** iimv.ac.in



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ) - ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఎంపీపీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అడ్మిషన్ టెస్టుల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

నేషనల్ లా స్కూల్‌లో పీజీ, పీహెచ్‌డీ

ఎల్ఎల్‌బీ ఆనర్స్

ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీని వ్యవధి మూడేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం తొమ్మిది ట్రైమెస్టర్లు ఉంటాయి. ఏడాదికి 48 చొప్పున మొత్తం 144 క్రెడిట్స్ సాధించాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎల్ఎస్ఏటీ-ఎల్ఎల్‌బీ) 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూం టీచింగ్, అసైన్‌మెంట్‌లు, రీసెర్చ్ పేపర్లు, ప్రజంటేషన్స్, క్లాస్ పార్టిసిపేషన్, కేస్ స్టడీస్, జ్యుడీషియల్ డెసిషన్స్, స్కాలర్లీ రైటింగ్స్, క్లాస్ రూం డిస్కషన్స్, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 డిసెంబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ (ఎంపీపీ)

ఇది రెండేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో పబ్లిక్ పాలసీ, ఎకనామిక్స్, లా, సోషియాలజీ, ఫైనాన్స్, ఇండియన్ సొసైటీ, పొలిటికల్ ఎకానమీ అంశాలు ప్రధానంగా ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూం డిస్కషన్స్, ఫీల్డ్ ఎక్స్‌పోజర్స్, ఇంటర్న్‌షిప్, రీసెర్చ్ డిజర్టేషన్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 84 క్రెడిట్స్ నిర్దేశించారు. కోర్ కోర్సులకు 50, ఎలక్టివ్ కోర్సులకు 16, ఫీల్డ్ వర్క్‌కు 2, ప్రాజెక్ట్ వర్క్‌కు 2, సెమినార్ కోర్సులకు 4, డిజర్టేషన్‌కు 10 క్రెడిట్స్ ప్రత్యేకించారు. సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ(ఎన్ఎల్ఎస్ఏటీ-ఎంపీపీ) 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ఎన్ఎల్ఎస్ఏటీ 2024 వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. ఒక్కో పార్ట్‌కు 75 మార్కులు నిర్దేశించారు. ఎల్ఎల్‌బీ, ఎంపీపీ ప్రోగ్రామ్‌లకు మొదటి పార్ట్ ఒకే విధంగా ఉంటుంది. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఇంగ్లీష్ కాంప్రహెన్షన్, కరెంట్ అఫైర్స్, క్రిటికల్ రీజనింగ్ అంశాలనుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం గుర్తించకపోయినా/ తప్పుగా గుర్తించినా పావు వంతు మార్కు కోత విధిస్తారు.

- ఎల్ఎల్‌బీ ప్రవేశ పరీక్ష - రెండో పార్ట్‌లో లీగల్ ఆప్టిట్యూడ్/రీజనింగ్ నుంచి ఆరు ప్రశ్నలు అడుగుతారు. ఒక్కోదానికి 300 నుంచి 350 పదాల్లో సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు పది మార్కులు కేటాయించారు. అనలిటికల్ ఎబిలిటీకి సంబంధించి ఇచ్చిన టాపిక్/ అంశంపై 500 పదాలకు మించకుండా వ్యాసం రాయాలి. దీనికి 15 మార్కులు నిర్దేశించారు.
- ఎంపీపీ ప్రవేశ పరీక్ష - రెండో పార్ట్‌లో పబ్లిక్ పాలసీ, క్వాంటిటేటివ్ స్కిల్స్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.
- ఎన్ఎల్ఎస్ఏటీ పరీక్ష సమయం రెండున్నర గంటలు. రెండు పార్టుల్లో కలిపి జనరల్ అభ్యర్థులకు కనీసం 75 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు రావాలి. మొదటి పార్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను(సీటుకు అయిదుగురిని) షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి సంబంధించిన రెండో పార్ట్‌ను మాత్రమే పరిశీలిస్తారు. రెండు పార్ట్‌లలో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2000; పీహెచ్‌డీ ప్రవేశానికి రూ.3,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ఎన్ఎల్ఎస్ఏటీ 2024 తేదీ:** మార్చి 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nls.ac.in

పీహెచ్‌డీ

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. లా, ఇంటర్‌డిసిప్లినరీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 4 చొప్పున మొత్తం 8 సీట్లు ఉన్నాయి. సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ పీహెచ్‌డీ(ఎన్ఎల్ఎస్ఏటీ-పీహెచ్‌డీ)2024, రీసెర్చ్ ప్రపోజల్, ఓరల్ ప్రజంటేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.
- **అర్హత:** లా స్పెషలైజేషన్‌కు కనీసం 55 శాతం మార్కులతో రెగ్యులర్ ఎల్ఎల్ఎం డిగ్రీ ఉత్తీర్ణులు; కనీసం 75 శాతం మార్కులతో మూడేళ్లు/ అయిదేళ్ల లా డిగ్రీ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్‌డిసిప్లినరీ స్పెషలైజేషన్‌కు కనీసం 55 శాతం మార్కులతో ఏదేని పీజీ ఉత్తీర్ణులు; ఎల్ఎల్‌బీ డిగ్రీతోపాటు కంపెనీ సెక్రటరీషిప్ ఎగ్జామినేషన్/ కంపెనీ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఎగ్జామినేషన్/సొలిసిటర్స్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; ఎన్ఎల్ఎస్ఐయూ నుంచి ఎంఫిల్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.
- **రీసెర్చ్ ప్రపోజల్:** అభ్యర్థులు దరఖాస్తు ఫారంతోపాటే రీసెర్చ్ ప్రపోజల్ పంపాలి. ఇందులో కనీసం ఆరు లేదా ఎనిమిది పేజీలు ఉండాలి. టైటిల్, స్టేట్‌మెంట్-ప్రాబ్లమ్-ఇన్ఫర్మేషన్-రీసెర్చ్, రీసెర్చ్ క్వశ్చన్స్-హైపాథిసిస్ అండ్ మెథడాలజీ, రీసెర్చ్ డిజైన్ తదితర అంశాలు హైలెట్ చేయాలి.
- **ఎన్ఎల్ఎస్ఏటీ-పీహెచ్‌డీ 2024 వివరాలు:** పరీక్ష సమయం రెండున్నర గంటలు. రీసెర్చ్ ఆప్టిట్యూడ్, లా అంశాలకు సంబంధించి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారిని ఓరల్ ప్రజంటేషన్‌కు పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్ స్కోర్‌నకు 50 శాతం, రీసెర్చ్ ప్రపోజల్‌కు 35 శాతం, ఓరల్ ప్రజంటేషన్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.


లిటిల్స్



దేశం- అర్జెంటీనా

- దక్షిణ అమెరికాలోని దక్షిణభాగంలో ఉండే పొడవైన దేశం పేరు 'అర్జెంటీనా'. దక్షిణ అమెరికా ఖండంలోని రెండో అతి పెద్దదేశం ఇదే.
- జనాభా నాలుగున్నర కోటి.
- అమెరికాలో మూడో వంతు ఉంటుంది. ఈ దేశానికి తూర్పు వైపు అట్లాంటిక్ మహాసముద్రం ఉంది. పెరుగ్వే, బొలీవియా, చిలీ వీటి పక్కన ఉండే దేశాలు.
- ఈ దేశంలో డైవర్సిటీ ఉంటుంది. ఆండీస్ పర్వతాలు, పచ్చికబయళ్లతో విభిన్నంగా ఉంటుందీ దేశం.
- జాతీయ భాష స్పానిష్. రెండో భాష ఇటాలియన్.
- అర్జెంటీనా అంటే ఎవరికైనా గుర్తొచ్చే ఆట.. ఫుట్‌బాల్. విచిత్రమేంటంటే ఎల్ పాటో అనే ఆట ఇక్కడి జాతీయ క్రీడ.
- ఈ దేశంలోని ఇగుజు జలపాతం ప్రపంచంలోనే అతి పొడవైనది. 275 జలపాతాలు రెండు మైళ్ల దూరం






వ్యాపించి ఉన్నాయి.
- ఫుట్‌బాల్ క్రీడాకారుడు డియెగో ఆర్మాండో మారడోనా ఆట ఇక్కడి ప్రజల్లో ఫుట్‌బాల్ మీద ప్రేమను, స్ఫూర్తిని నింపింది. ఇకపోతే ఫిఫా వరల్డ్ కప్ (2022) వరల్డ్ కప్‌లో కీలక ఆటగాడైన మెస్సి పేరుతో వేల మంది తమ పిల్లలకు ఈ పేరు పెట్టుకున్నారు. అంతటి క్రీడా ప్రియులు అర్జెంటీనా దేశీయులు. మొత్తానికి ఎవరు చూసినా మెస్సీ పేరు పెట్టుకోవటంతో కన్ఫ్యూజన్ వచ్చి ఆ దేశ ప్రభుత్వం 'మెస్సీ' పేరు పెట్టుకోవద్దని నిబంధన విధించింది.

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 198

				1			5	
	4	7	8			6		
				9	2			
5		4					7	2
9	6					5		8
			9	6				
		2			5	9	6	
	3			4				


సుడోకు - 197 సమాధానం

4	8	5	2	3	1	9	7	6
2	7	1	9	5	6	3	4	8
3	6	9	8	4	7	2	1	5
9	2	4	6	1	5	7	8	3
5	3	6	7	9	8	4	2	1
7	1	8	4	2	3	5	6	9
8	9	7	3	6	4	1	5	2
1	4	2	5	8	9	6	3	7
6	5	3	1	7	2	8	9	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

విదేశాల్లో చదవాలా.. ఈ పరీక్షలు రాయండి

విదేశాల్లో చదువుకోవాలంటే కేవలం అకడమిక్ అర్హతలు ఉంటే సరిపోదు. చదివే కోర్సును బట్టి కొన్ని, కామన్‌గా మరికొన్ని ఎంట్రెన్స్ టెస్టులు ఉంటాయి. ఆ టెస్టులతో అవసరం లేదని చెప్పే విదేశీ వర్సిటీలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ వీటిని రాయడమే మేలు. వీటిలో సాధించిన స్కోర్‌తో పెట్టుకునే దరఖాస్తు పటిష్ఠంగా ఉంటుంది. అంతేకాదు, కాలేజీ క్రెడిట్స్ లభిస్తాయి. స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించేందుకు కూడా దోహదపడతాయి. అవేంటంటే....



భారత దేశానికి వెలుపల అంటే మొదట రాయాల్సింది ఇంగ్లీష్ టెస్ట్. ఈ టెస్టులో సాధారణంగా నాలుగు మాడ్యూల్స్ - లిజనింగ్, రీడింగ్, రైటింగ్, స్పీకింగ్ ఉంటాయి. ఈ టెస్టులు అభ్యర్థికి ఇంగ్లీష్‌లో ఉన్న ప్రావీణ్యాన్ని పరీక్షిస్తాయి. ఇంగ్లీష్ మాట్లాడే దేశాల్లో చదివేందుకు ఈ టెస్టులు ఉపయోగపడతాయి. ఐఈఎల్‌టీఎస్ అకడమిక్, ఐఈఎల్‌టీఎస్ యూకేవీఐ, టీఓఈఎఫ్ఎల్ ఐబీటీ, డీయూఓ ఎల్ఐఎన్‌జీఓ, పియర్సన్ ఈ ఇంగ్లీష్ టెస్టుల్లో ముఖ్యమైనవని చెప్పవచ్చు. చాలా దేశాలు ఈ టెస్టుల్లో సాధించిన స్కోర్‌ను ఆమోదిస్తాయి. అయితే బ్రిటన్‌లో మాత్రం ఐఈఎల్‌టీఎస్‌లో సాధించిన మార్కులకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్

- **ఎల్ఎన్ఏటి:** యూకేలో లా కోర్సు చేసేందుకు www.lnat.ac.uk ఈ టెస్ట్ రాయాలి. యూకె వర్సిటీల కన్సార్టియం దీన్ని డెవలప్ చేసింది. యూజీ స్థాయిలో లా చదివేందుకు అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను పరీక్షిస్తుంది. అభ్యర్థి ఆప్టిట్యూడ్, వెర్బల్ రీజనింగ్, కాంప్రహెన్షన్, ఇంటర్‌ప్రెటేషన్, అనాలిసిస్, సింథసిస్, ఇండక్షన్, డిడక్షన్ టెస్టులో భాగం.
- **ఎల్ఎస్ఏటీ:** అమెరికా, కెనడా దేశాల్లో లా చేసేందుకు ఈ టెస్ట్ www.-lsac.org/lsat అవసరం. ఇదో ప్రామాణికమైన లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్. అభ్యర్థి లాజికల్, వెర్బల్ రీజనింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తుంది.
- **ఎస్ఏటీ, ఎస్ఏటీ సబ్జెక్టు టెస్టులు:** అమెరికా, కెనడా, సింగపూర్‌లో చదువులకు www.collegeboard.com ఎస్ఏటీ ఉపయోగపడుతుంది. వెర్బల్, మేథమెటికల్, రైటింగ్ నైపుణ్యాలను ఈ టెస్ట్‌లో పరీక్షిస్తారు. ప్రత్యేకించి ఒక సబ్జెక్ట్ ఏరియాలో ప్రావీణ్యాన్ని తెలియజెప్పేవి ఎస్ఏటీ సబ్జెక్టు టెస్టులు.
- **ఏపీ టెస్ట్స్ ఫర్ యుఎస్:** కాలేజీ క్రెడిట్స్ సాధించేందుకు దారితీసే అడ్వాన్స్‌డ్ ప్లేస్‌మెంట్స్ ఎగ్జామ్స్ www.collegeboard.com ఇవి.
- ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జికి కూడా సొంతంగా ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ www.admissiontesting.org ఉన్నాయి. యూక్యాట్(గతంలో యుకెక్యాట్ అనేవారు) ప్రత్యేకించి యూకేలో మెడికల్ స్కూల్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష. యూకేలో బయో మెడికల్ సైన్సెస్‌లో చేరేందుకు బీఎంఏటీ, మేథమెటిక్స్ అలాగే ఎకనామిక్స్‌లో చేరేందుకు టీఎంయూఏ ఇప్పటి వరకు అవసరం. ఈ ఏడాది వీటిని తీసేయవచ్చు.

టెస్ట్స్ ఫర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్

- అమెరికా, కెనడా, యూరప్, సింగపూర్‌లో ఇంజనీరింగ్, సైన్స్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన టెస్ట్ జీఆర్ఈ. గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్‌గా దీనికి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. వెర్బల్, క్వాంటిటేటివ్, అనలిటికల్ రైటింగ్ స్కిల్స్‌ను ఇందులో పరీక్షిస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరేందుకు జీమ్యాట్ www.mba.com రాయాలి. గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ కాగా కంప్యూటర్ అడాప్టివ్ టెస్ట్ ఇది. రీజనింగ్, క్రిటికల్ థింకింగ్, అనలిటికల్, క్వాంటిటేటివ్, వెర్బల్ స్కిల్స్‌ను ఈ టెస్టులో పరీక్షిస్తారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లోని విద్యాసంస్థల్లో ఎంబీఏ చేసేందుకు ఈ టెస్ట్‌లో తెచ్చుకున్న స్కోర్ ప్రాతిపదిక అవుతుంది.
- జీఏఎంఎస్ఏటీ - యూకే, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, సింగపూర్, ఐర్లాండ్‌లో గ్రాడ్యుయేట్ మెడికల్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు www.gamsat.acer.org ఈ టెస్ట్ రాయాలి. ఇది కూడా కంప్యూటర్ ఆధారిత ప్రామాణిక పరీక్ష. మెడిసిన్, డెంటిస్ట్రీ, ఆప్టోమెట్రీ, ఫార్మసీ, వెటర్నరీ సైన్సెస్‌లో చేరేందుకు దీన్ని ఉద్దేశించారు.
- ఎంక్యాట్ మరో టెస్ట్. యుఎస్, కెనడాలో మెడికల్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు దీన్ని www.aamc.org నిర్వహిస్తున్నారు.ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రాబ్లెమ్ - సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్, రిటెన్ అనాలిసిస్, సైంటిఫిక్ ప్రిన్సిపల్స్ అలాగే కాన్సెప్ట్‌పై పరిజ్ఞానాన్ని ఈ టెస్ట్‌లో పరీక్షిస్తారు.

19 నుంచి హైదరాబాద్ ఐఐటీలో
ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ ఫెయిర్

హైదరాబాద్ ఐఐటీలో ఈ నెల 19, 20 తేదీలో ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ ఫెయిర్‌ని నిర్వహిస్తున్నారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీన్ని ప్రారంభిస్తారు. దేశంలోని ఐఐటీలకు తోడు ఎన్ఐటి, ఐఐఎస్ఈఆర్, ఐఐఎస్సీ బెంగుళూరు అలాగే 50 వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలు ఈ ఫెయిర్‌లో పాల్గొననున్నాయి. ఇండస్ట్రీ నుంచి రెండు వేలమంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ ప్రాతిపదికగా ఈ ఫెయిర్ ఉంటుంది.

వెబ్‌సైట్స్: https://www.iith.ac.in/, https://www.iith.ac.in/.

ఐఐఎఫ్ఎంలో పీజీ డిప్లొమాలు

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్(ఐఐఎఫ్ఎం) - పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్(పీజీడీఎఫ్ఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్(పీజీడీఎస్ఎం) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. పీజీడీఎఫ్ఎంలో 150 సీట్లు, పీజీడీఎస్ఎంలో 75 సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు.


- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఇంటర్వ్యూ కేంద్రాలు:** అహ్మదాబాద్, భోపాల్, ఢిల్లీ, గువహటి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.iifm.ac.in

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 7 జనవరి 2024

అసలుసిసలైన సినిమాల పండుగ సంక్రాంతి..

సంక్రాంతి అంటే సంతోషాల మేలుకలయిక. బాధల్ని మరిపించే ఆనందాల హరివిల్లు. తెలుగింటి వెలుగు దేదీప్యమానమయ్యే శుభదినం. ధాన్యలక్ష్మి ఆగమనాన్ని గమనించిన భూమాత.. ఆకుపచ్చ తివాచీని పరిచి మరీ అమ్మను ఆహ్వానించే శుభమహోత్సవ సంరంభం సంక్రాంతి.








ఉదయసంధ్యల్లో నులివెచ్చని కిరణాల తాకిడికి కరుగుతున్న మంచు పొరలు.. వాకిళ్లలో ముత్యాలముగ్గులు.. లోగిళ్లలో ధనధాన్యరాశులు.. పిండివంటలు.. హరిదాసుల భజన కీర్తనలు.. భోగిమంటలు.. కోడిపందేలు.. బంధుమిత్రులు ఆనందాల పరవళ్ల వెరసి సంక్రాంతి.

పూజాపునస్కారాలతోపాటు కావల్సినంత వినోదాన్ని కూడా పంచే పండుగ కావడంచేత.. పొటేళ్ల కుమ్ములాటలూ.. కోడిపందేలు.. పొట్లగిత్తల పరుగుపందేలు.. ఇవన్నీ సర్వసాధారణం.. ప్రాంతాలవారీగా ఎవరి సౌలభ్యం వారిది. అయితే.. అందరికీ సౌకర్యంగా సౌలభ్యంగా వినోదాన్ని పంచేది మాత్రం సినిమా మాత్రమే.



ఓ విధంగా సంక్రాంతి అంటే సినిమాల పండుగ. కోట్లాదిమంది జనాలకు కోడిపుంజులైనా.. పొట్లగిత్తలైనా ఇక్కడ మన హీరోలే. ఇది ప్రాంతాలకు అతీతంగా జరిగే సంతోష సంగ్రామం.

అసలు సినిమా లేని సంక్రాంతిని ఊహించగలమా!?.. ఈ బంధం ఇంత బలంగా అల్లుకుపోడానికి కారకులెవరైవుంటారు? అంటే.. ఠకీమని 'మన హీరోలే..' అనే సమాధానం వస్తుంది. అభిమానం తెచ్చిపెట్టిన తంటా ఇదంతా. ఈ విషయంపై కాస్త లోతుగా చర్చించుకుందాం..

1932లో తొలి తెలుగు సినిమా 'భక్తప్రహ్లాద' విడుదలైన నాటినుంచి, ఓ 21ఏళ్ల పాటు 'ఎన్ని సంక్రాంతులకు ఏ ఏ సినిమాలు విడుదలయ్యాయి..' అనే విషయాన్ని పక్కనపెడితే.. ఎన్టీరామారావు 'చంద్రహారం' సినిమా మాత్రం 1954 సంక్రాంతికి విడుదలైంది. ఇది ఎన్టీయార్ తొలి సంక్రాంతి సినిమా. పెద్దగా ఆడలేదు. ప్రత్యేకంగా ఈ సినిమా గురించి ఎందుకు చెప్పాల్సొచ్చిందంటే.. 1954 'చంద్రహారం' నుంచి 1982 'అనురాగ దేవత' వరకూ ఒకట్రెండు సంవత్సరాలను మినహాయిస్తే ప్రతి ఏడాదీ సంక్రాంతికి సినిమాను విడుదల చేసిన ఏకైక హీరో ఎన్టీయార్. ఆయన పాలిటిక్స్‌లోకి వెళ్లేంతవరకూ అంటే.. 33ఏళ్ల కెరీర్‌లో 27 సంక్రాంతి సినిమాలను విడుదల చేసిన ఘనత ఎన్టీయార్‌ది. వీటిలో మిస్సమ్మ, శ్రీవేంకటేశ్వరమహత్మ్యం, సీతారామకల్యాణం, గులేబకావళికథ, శ్రీకృష్ణపాండవీయం, దానవీరశూరకర్ణ లాంటి క్లాసిక్స్ ఉన్నాయి.. అప్పుచేసి పప్పుకూడు, గుడిగంటలు, నాదీ ఆడజన్మే, వరకట్నం.. వంటి బ్లాక్ బాస్టర్స్ ఉన్నాయి. దాదాపు ఆయన సంక్రాంతి సినిమాలన్నీ ఎక్కువ శాతం విజయాలను అందుకోవడం విశేషం.



సంక్రాంతి పందెంకోళ్లు

చిరంజీవి, బాలకృష్ణ విషయానికొస్తే.. చిరంజీవి దొంగమొగుడు, మంచిదొంగ, అత్తకుయముడు అమ్మాయికిమొగుడు, అన్నయ్య, ఖైదీనంబర్ 150, వాల్తేరువీరయ్య.. ఇవన్నీ సంక్రాంతి బ్లాక్ బస్టర్సే. అలాగే బాలయ్య నటించిన వంశానికొక్కడు, పెద్దన్నయ్య, సమరసింహారెడ్డి, నరసింహనాయుడు, లక్ష్మినరసింహా, గౌతమీపుత్ర శాతకర్ణి, వీరసింహారెడ్డి చిత్రాలు సంక్రాంతికి విడుదలై రికార్డులు బద్దలు కొట్టాయి. .

ఇక ఈ విషయంలో ఎన్టీయార్ తర్వాత చెప్పుకోవాల్సిన హీరో అక్కినేని నాగేశ్వరరావు. పరదేశి(1953) నుంచి చుక్కల్లో చంద్రుడు(2006) దాకా ఆయనవి కూడా దాదాపుగా పాతిక సినిమాలు సంక్రాంతికి విడుదలయ్యాయి. వాటిలో తెనాలి రామకృష్ణ, తోడికోడళ్లు, మాంగల్యబలం, నమ్మినబంటు, శాంతి నివాసం, దసరాబుల్లోడు వంటి క్లాసిక్స్ ఉన్నాయి. అంటే.. ఎన్టీయార్‌కి దీటుగా అక్కినేని సినిమాలు కూడా సంక్రాంతికి విడుదలయ్యాయన్నమాట.



వారి తర్వాత జనరేషన్‌లో సూపర్‌స్టార్ కృష్ణ సినిమాలు ఎక్కువగా సంక్రాంతికి విడుదలయ్యేవి. ఊరుకు మొనగాడు, అగ్నిపర్వతం, నెంబర్‌వన్, అమ్మదొంగ.. ఇవన్నీ సంక్రాంతి విజయాలే. అలాగే శోభన్‌బాబు కూడా.. ఆయన 'డ్రైవర్‌బాబు' సంక్రాంతికి విడుదలై బాగా ఆడింది.



సంక్రాంతి సీజన్ బాగా కలిసొచ్చిన హీరోగా విక్టరీ వెంకటేశ్‌ని చెప్పుకోవాలి. ఇప్పటికి వెంకటేశ్ నటించిన 14 సినిమాలు సంక్రాంతికి విడుదల కాగా, వాటిలో రక్తతిలకం, ప్రేమ, చంటి, ధర్మచక్రం, కలిసుందాంరా, లక్ష్మి, సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు, గోపాల గోపాల, ఎఫ్2.. చిత్రాలు ఘన విజయాలు సాధించడం విశేషం. రేపు సంక్రాంతికి 'సైంధవ్'గా రాబోతున్నారాయన.

ఇక అక్కినేని నాగార్జున నటించిన మజ్ను, విజయ్, కిల్లర్, ఆవిడా మా ఆవిడే, సోగ్గాడే చిన్నినాయన, బంగార్రాజు సినిమాలు కూడా సంక్రాంతి విజయాలే. రేపు 'నా సామిరంగ' అంటూ సంక్రాంతి బరిలో దిగుతున్నారు నాగ్. నేటి తరం హీరోల్లో సంక్రాంతికి ఎక్కువ విజయాలున్న హీరో మహేశ్‌బాబు. ఒక్కడు, దూకుడు, బిజినెస్‌మ్యాన్, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, సరిలేరు నీకెవ్వరూ, సర్కారువారి పాట.. ఇలా సంక్రాంతికి మంచి విజయాలనే అందుకున్నారు మహేశ్. ఈ సంక్రాంతికి 'గుంటూరుకారం'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మిగతా స్టార్ హీరోలక్కూడా సంక్రాంతి మంచి విజయాలనే ఇచ్చింది. ఏదిఏమైనా సమ ఉజ్జీలైన హీరోల సినిమాలు బరిలో ఉండే ఆ కిక్కే వేరు. సంక్రాంతి శోభంతా ఇక థియేటర్ల దగ్గరే. మొత్తంగా చెప్పొచ్చేదేంటంటే.. రామారావుగారి నుంచి మొదలైన ఈ హడావిడీ.. తేజా సజ్జా దాకా సాగుతూనే వుంది.. సాగుతూనే వుంటుంది.

ఎన్ని సినిమాలు విడుదలైనా భరించే శక్తి ఒక్క సంక్రాంతి పండుగకే ఉంటుందనేది నిర్మాతలు నమ్మిన నిజం. అంచేత రాబోతున్న సినిమాలన్నీ విజయాలను అందుకొని ఈ సంక్రాంతి బాక్సాఫీస్‌కు లక్కీ సంక్రాంతిగా నిలవాలని ఆశిద్దాం.






రామ్‌చరణ్‌తో రెహమాన్



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. వెంకట సతీష్ కిలారు నిర్మాత. ఆస్కార్ విజేత ఏ. ఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీత సారథ్యం వహించబోతున్నారు. ఈ విషయాన్ని ఆయన పుట్టిన రోజు సందర్భంగా శనివారం చిత్రబృందం ప్రకటించింది. బుచ్చిబాబు, దర్శకుడు సుకుమార్, రెహమాన్ కలసి దిగిన ఫొటోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని యూనిట్ వెల్లడించింది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలసి నిర్మిస్తున్నాయి.

ఓ కొత్త నాగరికత తెరపై చూస్తారు



'జిగ్రా కథలో తెలీని మాయ ఉంది. డైరెక్టర్ వాసన్ బాల కథ చెప్పినప్పుడు షాక్‌లో ఉండిపోయాను. అరుదుగా వచ్చే కథలివి. నిర్మాణంలో భాగమైంది అందుకే..' అన్నారు అలియాభట్. ఆమె సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న చిత్రం 'జిగ్రా'. కరణ్‌జోహార్ నిర్మాత. ఈ సినిమా గురించి ఇటీవల మీడియాతో ముచ్చటించారు అలియా. 'కొన్ని సినిమాలు డబ్బుకోసం చేస్తాం. కొన్ని మాత్రం ఆత్మసంతృప్తికోసం చేస్తాం. 'జిగ్రా' అలాంటి సినిమానే. ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తే కథనంతో వాసన్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. ఓ కొత్త నాగరికత తెరపై చూస్తారు. ఈ సినిమాను ప్రేక్షకులతో కలిసి చూడాలనుకుంటున్నా' అన్నారు అలియాభట్.

విమాన ప్రమాదంలో ఒలీవర్ కన్నుమూత



ప్రముఖ హాలీవుడ్ నటుడు క్రిస్టియన్ ఒలీవర్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనలో ఆయనతో పాటు ప్రయాణం చేస్తున్న ఇద్దరు కూతుళ్లు మాదిత, అన్నిక్, పైలెట్ కన్నుమూశారు. గురువారం ఒలీవర్ సొంత విమానంలో జెక్వియా నుంచి సెయింట్ లూసియాకు వస్తుండగా కరేబియన్ సముద్రంలో విమానం కుప్పకూలింది. ఘటనా స్థలంలో వారి మృతదేహాలు లభించాయని అధికారులు తెలిపారు. 'స్పీడ్ రేసర్', 'వాల్కైరీ' తదితర చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఒలీవర్‌కు మంచి ఇమేజ్ తెచ్చాయి.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
బ్రేక్ పాయింట్	వెబ్‌సిరీస్ 2	జనవరి 10
కింగ్ డమ్ 3	జపనీస్ మూవీ	జనవరి 10
ది ట్రస్ట్	వెబ్‌సిరీస్	జనవరి 10
బాయ్ స్వాలోస్ యూనివర్స్	వెబ్‌సిరీస్	జనవరి 10
కిల్లర్ సూప్	హిందీ సిరీస్	జనవరి 11
ఛాంపియన్	వెబ్‌సిరీస్	జనవరి 11
లిఫ్ట్	హాలీవుడ్ మూవీ	జనవరి 12
అమెజాన్ ప్రైమ్		
టైగర్ 3	హిందీ చిత్రం	జనవరి 07
మిషన్ ఇంపాజిబుల్ : డెడ్ రెకనింగ్	హాలీవుడ్ మూవీ	జనవరి 11
రోల్ ప్లే	హాలీవుడ్ మూవీ	జనవరి 12
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ఎకో	వెబ్‌సిరీస్	జనవరి 11
ది లెజెండ్ ఆఫ్ హనుమాన్	యానిమేషన్ సిరీస్	జనవరి 12
సోనీ లివ్		
జర్నీ	తమిళ చిత్రం	జనవరి 12
ఆహా...		
కోటబొమ్మాళి పీఎస్	తెలుగుచిత్రం	జనవరి 11
సేవప్పి	తమిళ చిత్రం	జనవరి 12
బుక్ మై షో		
ఒన్ మోర్ షాట్	హాలీవుడ్ మూవీ	జనవరి 09
జియో సినిమా		
ల బ్రియా	వెబ్‌సిరీస్	జనవరి 10
టెడ్	వెబ్‌సిరీస్	జనవరి 12
ఆపిల్ టీవీ ప్లస్		
క్రిమినల్ రికార్డ్	వెబ్‌సిరీస్	జనవరి 10
కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్	హాలీవుడ్ మూవీ	జనవరి 12



